ప్రజా కలం
Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

epaper.prajakalam.in
www.prajakalam.in

ప్రజా కలం

Published From Nizamabad

PRGI No.TELTEL/2010/33275

PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
Classifieds
5 Lines Rs.250 only
&
Public Notice Advertising
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526

మంగళవారం | 07-07- 2026 | సంపుటి: 17, సంచిక: 94, నిజామాబాద్, పేజీలు: 12, వెల: 3/- | ఎడిటర్: కలకొండ రామకృష్ణ

ఎకో టూరిజం

అభివృద్ధి చేయాలి

పర్యాటక శాఖపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష

టూరిజం శాఖ అధికారులకు కీలక సూచనలు

అటవీ భూముల్లో అంతర్జాతీయ స్థాయి పర్యాటక ప్రాజెక్టులు

దుర్గం చెరువు, తారామతి బారాదరి అభివృద్ధికి ప్రాధాన్యం

వికారాబాద్‌ను టూరిజం హబ్‌గా తీర్చిదిద్దే కార్యాచరణ

పురానాపూల్ వంటి వారసత్వ కట్టడాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

హైదరాబాద్, జూలై 6 (ప్రజాకలం) :

రాష్ట్రంలో చేపట్టిన పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టులను నిర్ణీత గడువులో పూర్తి చేసి తెలంగాణను దేశంలోనే ప్రముఖ పర్యాటక రాష్ట్రంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పర్యాటక శాఖ చేపడుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో ముఖ్య మంత్రి విస్తృతంగా చర్చించారు. సమావేశంలో సీఎం సలహాదారు కె. రామకృష్ణా రావు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. హైదరాబాద్ కోర్ అర్బన్ ఏరియా పరిధిలో అటవీ శాఖ ఆధీనంలోని భూములను

తరువాయి 2వ పేజీలో...

నీరవ్ మోదీ అప్పగింతకు మార్గం సుగమం..

ఇక భారత్‌కు రప్పించడమేనా..?

లండన్: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) భారీ రుణ మోసం కేసులో ప్రధాన నిందితుడైన వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీని భారత్‌కు అప్పగించే ప్రక్రియకు ఉన్న అన్ని న్యాయపరమైన అడ్డంకులు తొలగిపోయాయి. నీరవ్ మోదీ దాఖలు చేసిన పిటిషన్‌ను యూరోపియన్ కోర్ట్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ (ఈసీహెచ్‌ఆర్) తిరస్కరించింది. దీంతో అప్పగింతకు సంబంధించిన ప్రక్రియను యూకే ప్రభుత్వం మొదలుపెట్టే అవకాశం లభించింది. భారత ప్రభుత్వం 2018 ఆగస్టులో నీరవ్ మోదీపై నేరపూరిత కుట్ర, నమ్మకద్రోహం, మోసం, అవినీతి, మనీలాండరింగ్, నిధుల దుర్వినియోగం, ఒప్పంద ఉల్లంఘన తదితర అభియోగాలు నమోదు చేసింది.

తరువాయి 2వ పేజీలో...

జూన్ 2028 నాటికి ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పూర్తి చేస్తాం

కార్మికుల భద్రతకు ఎలాంటి రాజీ లేదు

ప్రాజెక్టు పూర్తితో 4.01 లక్షల ఎకరాలకు సాగునీరు

618 ఫ్లోరైడ్ బాధిత గ్రామాలకు తాగునీటి భరోసా

టన్నెల్, రిజర్వాయర్లు, కాలువల పనులు సమాంతరంగా పూర్తి చేస్తాం

మూడింతలు పెంచిన సిబ్బంది – ఆధునిక యంత్రాలతో పనులు వేగవంతం

మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్, జూలై 6 (ప్రజాకలం) :

దక్షిణ తెలంగాణ రైతుల దశాబ్దాల కల అయిన ఆలిమినేటి మాధవరెడ్డి శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ (ఏఎంఆర్-ఎస్ఎల్‌బీసీ) ప్రాజెక్టును జూన్-2028 నాటికి తప్పకుండా పూర్తి చేస్తామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. అదే సమయంలో టన్నెల్ పనుల్లో పాల్గొంటున్న కార్మికుల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండబోదని ఆయన తేల్చిచెప్పారు. సోమవారం రోజున డాక్టర్ బి.ఆర్.అంబెడ్కర్ సచివాలయంలో ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టుపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించిన మంత్రి, ఈ ప్రాజెక్టు కేవలం ఇంజినీరింగ్ నిర్మాణం మాత్రమే కాదని, దక్షిణ తెలంగాణ ప్రజల చిరకాల ఆకాంక్షకు రూపం ఇవ్వడమేనని పేర్కొన్నారు. ప్రభుత్వం అవసరమైన నిధులు, భూసేకరణ, సాంకేతిక అనుమతులు, పరిపాలనా అనుమతులను వేగంగా పూర్తి చేసి పనులు నిరంతరాయంగా సాగేందుకు అన్ని చర్యలు తీసుకుంటోందని తెలిపారు. టన్నెల్‌తో పాటు డిండి ప్రాజెక్టు, బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు, కాలువల నిర్మాణాన్ని ఒకే సమగ్ర ప్రాజెక్టుగా భావించి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో టన్నెల్ పనులు పునఃప్రారంభించిన

తరువాయి 2వ పేజీలో...

మున్సిపల్ ఇంజనీర్ల

మాయాజాలం

మెట్‌పల్లి మున్సిపల్‌లో గ్రామపంచాయతీ పేరిట ఇంటి నిర్మాణ పర్మిషన్లు

- మున్సిపల్ అయినప్పటికీ జీపీ పేరిట అనుమతులు ఇవ్వడమేంటని ప్రశ్నిస్తున్న ప్రజలు

- జీపీ పర్మిషన్ పేరుతో భారీగా డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు

- టౌన్ ప్లానింగ్ అధికారి సస్పెన్షన్‌తో ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్న అక్రమాలు

మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జులై 6 (ప్రజా కలం) జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మున్సిపల్ పరిధిలో కొందరు మున్సిపల్ లైసెన్సుడ్ ఇంజనీర్లు చేస్తున్న అక్రమాల కారణంగా అమాయక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మెట్‌పల్లి గ్రామపంచాయతీ నుంచి మున్సిపాలిటీగా మారి సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ, ఇప్పటికీ కొందరు

తరువాయి 2వ పేజీలో...



చైనా కొత్త చిప్

- ఎన్విడియా చిప్ కంటే 478 రెట్లు వేగం

బీజింగ్: మెదడుకు సంబంధించిన త్రీడీ చిత్రాలను అత్యంత వేగవంతంగా రూపొందించే ప్రత్యేక కంప్యూటర్ చిప్‌ను చైనా శాస్త్రవేత్తలు తాజాగా ఆవిష్కరించారు. పెకింగ్ యూనివర్సిటీ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్స్, చైనీస్ అకాడమీ ఆఫ్ సైన్సెస్‌కు చెందిన శాస్త్రవేత్తలు ఈ చిప్‌ను తయారు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలు తాజాగా సైన్స్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. మెదడు త్రీడీ చిత్రాల కోసం ఉద్దేశించిన ప్రత్యేక ఎన్విడియా చిప్ కంటే ఇది 478 రెట్లు వేగవంతమైనదని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ న్యూరల్ నెట్‌వర్క్, ఫేజ్ ఛేంజ్ మెమ్రిస్టర్స్‌తో ఒకే మెమరీ అరేపై డేటా స్టోరేజ్, కంప్యూటేషన్ జరిగేలా ఈ చిప్‌ను డిజైన్ చేశారు. దీంతో, చిప్‌లో సమాచార మార్పిడి మరింత వేగవంతమై త్వరిత గతిన త్రీడీ చిత్రాలు నిర్మించడం సాధ్యం అవుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. విద్యుత్ వినియోగం కూడా మరింతగా తగ్గుతుందని చెబుతున్నారు. మెదడు త్రీడీ చిత్రాలను రూపొందించేందుకు ప్రత్యేకంగా సిద్ధం చేసిన ఎన్విడియా ఏ100తో పోలిస్తే ఇది 50 నుంచి 478 రెట్లు వేగంగా పనిచేయగలదని చైనా పరిశోధకులు పేర్కొన్నారు.

చిప్‌తో ఉపయోగాలు..

వైద్య రంగంలో ఈ చిప్ ఎంతో ఉపయోగపడుతుందని నిపుణులు చెబుతున్నారు. బ్రెయిన్-మెషీన్ ఇంటర్‌ఫేస్ పరికరాలను డిజైన్ చేసేందుకు ఈ చిప్ రూపొందించిన త్రీడీ చిత్రాలు ఎంతో ఉపయోగపడతాయని చెబుతున్నారు. సంక్లిష్ట సర్జరీల సమయంలో వైద్యులకు కూడా ఈ త్రీడీ చిత్రాలు అక్కరకు వస్తాయి. ఈ చిప్ త్రీడీ చిత్రాలను అత్యంత వేగంగా సిద్ధం చేయడంతో సర్జరీ సమయాల్లో తక్షణ నిర్ణయాలు తీసుకునేందుకు వైద్యులకు అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

కలం కౌంటర్



సముద్రం పాలవుతున్న అన్నదాతల ఆశలు

రాజకీయ కక్షతో ప్రాజెక్టు నిర్వీర్యం

అబద్ధపు ప్రచారాలు

ఆపి..సాగునీరు అందించండి

మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

కన్నెపల్లి ముట్టడికి సిద్ధమవుతున్న బీఆర్ఎస్

పెద్దపల్లి,జూలై 06:
(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

రాష్ట్రంలో తీవ్రమైన వర్షాభావ పరిస్థితులతో రైతాంగం అల్లాడుతుంటే, కళ్ల ముందే గోదావరి జలాలు లక్ష క్యూసెక్కుల చొప్పున వృథాగా సముద్రంలో కలుస్తున్నాయని, అయినప్పటికీ ప్రభుత్వం మొండి వైఖరితో సాగునీటిని ఎత్తిపోయడం లేదని రాష్ట్ర మాజీ మంత్రి,బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కొప్పుల ఈశ్వర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.సోమవారం పెద్దపల్లిలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యేలు దాసరి మనోహర్ రెడ్డి, కోరుకంటి చందర్,పుట్ట మధుకర్ లతో కలిసి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మీడియా సమావేశం నిర్వహించారు.

తరువాయి 2వ పేజీలో...

కాళేశ్వరం దోషులను శిక్షించండి..

రైతులను కాదు

రేవంత్‌పై ఈటల ఫైర్

- హైడ్రా పేరుతో పేదల ఇళ్ల కూల్చివేతపై తీవ్ర విమర్శలు

- జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెబుతారని హెచ్చరిక

హైదరాబాద్, జూలై 6 (ప్రజాకలం) :

నాంపల్లిలోని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు, మహనీయుడు డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించడంతో

తరువాయి 2వ పేజీలో...

కేసీఆర్ అసెంబ్లీకి రావాలి..

కాళేశ్వరంపై వివరణ ఇవ్వాలి

కేసీఆర్ తేదీ చెబితే ప్రత్యేక అసెంబ్లీ నిర్వహించేందుకు సిద్ధం

కాళేశ్వరం అవినీతి, ఇందిరమ్మ ఇళ్లపై ప్రజల ముందే చర్చిద్దాం

రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

సిద్ధిపేట / హైదరాబాద్
జూలై 6 (ప్రజాకలం):

దేశంలోనే "ఎనిమిదో వింత"గా కాళేశ్వరం ప్రాజెక్టును ప్రచారం చేసిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇప్పుడు అసెంబ్లీకి వచ్చి కాళేశ్వరం ఎందుకు కుంగిపోయిందో, వేల కోట్ల ప్రజాధనం ఎలా వృథా అయిందో తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. కేసీఆర్ తేదీ, సమయం సూచిస్తే ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. సోమవారం సిద్ధిపేట జిల్లా ములుగు మండలంలో సహచర మంత్రి వివేక్ వెంకటస్వామి, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డితో కలిసి రెండవ విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పట్టాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్ట్ కట్టింది మీరే... కూలింది మీ హయాంలోనే .. ఇప్పుడు మళ్లీ అక్కడికి వెళ్లి గొప్పలు చెప్పుకోవడం కూడా మీరే. దీనికి కాంగ్రెస్ ప్రభుత్వానికి సంబంధమేంటి?" అని ప్రశ్నించారు. ప్రతి పేదవాడి చెమటోడ్చి చెల్లించిన పన్నుల డబ్బుతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు నాణ్యత లేక కుంగిపోతే, దానికి బాధ్యత వహించాల్సింది

తరువాయి 2వ పేజీలో...

ఎకో టూరిజం
అభివృద్ధి చేయాలి

మొదటి పేజీ తరువాయి...

పర్యాటక శాఖతో సమన్వయం చేసుకుని ఎకో టూరిజం కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రజలకు ప్రకృతి అందాలను చేరువ చేయడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు భంగం కలగకుండా ఆధునిక సదుపాయాలతో ఎకో పార్కులను ఏర్పాటు చేయాలని సూచించారు. గుర్రంగూడ ఎకో పార్క్ తరహాలో నగరంలోని అనువైన ప్రాంతాలను అభివృద్ధి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. భారత్ ఫ్యూచర్ సిటీ పరిధిలోని అటవీ భూములను అంతర్జాతీయ ప్రమాణాలతో పర్యాటక గమ్యస్థానాలుగా తీర్చిదిద్దేందుకు సమగ్ర కార్యాచరణ రూపొందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. విదేశీ పర్యాటకులను ఆకర్షించేలా ప్రపంచ స్థాయి సౌకర్యాలు, వినోద కార్యక్రమాలు, ప్రకృతి ఆధారిత పర్యాటక ప్రాజెక్టులను రూపొందించాలని సూచించారు. హైదరాబాద్‌లో ఇప్పటికే ఉన్న పర్యాటక ప్రాంతాలను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని సీఎం స్పష్టం చేశారు. తారామతి బారాదరిని ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చేయడంతో పాటు దుర్గం చెరువును పూర్తి స్థాయి పర్యాటక కేంద్రంగా మార్చాలని ఆదేశించారు. అలాగే మంజీరా, దిల్‌కుషా అతిథి గృహాలను ఆధునికీకరించి దేశ, విదేశీ పర్యాటకులకు అనువైన వసతి కేంద్రాలుగా తీర్చిదిద్దాలని సూచించారు. టూరిజం హబ్ డెవలప్‌మెంట్ పథకం కింద వికారాబాద్ జిల్లాను ప్రత్యేక పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని సీఎం పేర్కొన్నారు. ముఖ్యంగా అక్కడి శ్రీ వీరభద్రస్వామి దేవాలయాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. యాదగిరిగుట్ట తరహాలో దేవస్థానానికి ప్రత్యేక పాలక మండలిని ఏర్పాటు చేసి అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. క్యూర్ పరిధిలో అర్బన్ ఫారెస్ట్ నమూనాలో ఎకో టూరిజం ప్రాజెక్టులను రూపొందించి అమలు చేయాలని, ఇందుకోసం ప్రత్యేక అధికారులను నియమించి పనులను ముమ్మరం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. నగరంలోని పురానాపూల్ వంటి చారిత్రక వారసత్వ బ్రిడ్జిలను సంరక్షిస్తూ పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని, అవసరమైతే ట్రాఫిక్‌ను ప్రత్యామ్నాయ మార్గాలకు మళ్లించి పర్యాటకులకు అనుకూల వాతావరణం కల్పించాలని పేర్కొన్నారు.

పర్యాటక రంగంలో భారీ పెట్టుబడులను ఆకర్షించేందుకు వచ్చే డిసెంబర్‌లో నిర్వహించనున్న గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌కు ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం కోసం ఉన్నతస్థాయి కమిటీలను ఏర్పాటు చేసి పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణం కల్పించాలని, తెలంగాణను ప్రపంచ స్థాయి పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దే దిశగా వేగంగా ముందుకు సాగాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

కేసీఆర్ అసెంబ్లీకి రావాలి.. కాళేశ్వరంపై వివరణ ఇవ్వాలి

మొదటి పేజీ తరువాయి...

బీఆర్ఎస్ నాయకత్వమేనని అన్నారు. గోదావరి జలాలను కృష్ణా పరివాహక ప్రాంతాలకు తరలించే పేరుతో నిర్మించిన ప్రాజెక్టుపై తప్పుడు ప్రచారం చేసి ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.

ప్రభుత్వంపై ఎన్ని నిరాధార ఆరోపణలు చేసినా ప్రజలు వాటిని తిరస్కరిస్తూనే ఉన్నారని, అధికార దాహంతో చేస్తున్న రాజకీయాలకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతున్నారని అన్నారు. నిజంగా ప్రజాహితం కోసం సూచనలు ఇవ్వాలనుకుంటే అసెంబ్లీ వేదిక సిద్ధంగా ఉందని, అక్కడే అన్ని అంశాలపై బహిరంగంగా చర్చిద్దామని కేసీఆర్‌కు సవాల్ విసిరారు. రాష్ట్రంలో ఇప్పటికీ 32 వేల కుటుంబాలు పూరిగుడిసెల్లో జీవిస్తున్నాయని ప్రభుత్వం గుర్తించిందని, రెండో విడత నుంచి నాలుగో విడత వరకు వారికి అత్యంత ప్రాధాన్యంతో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సిద్ధిపేటతో పాటు కొద్ది ప్రాంతాల్లో మాత్రమే ఇళ్లు నిర్మించి, మిగిలిన నియోజకవర్గాలను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. నిర్మించిన ఇళ్లను కూడా అసంపూర్తిగా వదిలేసిందని అన్నారు. గత పదేళ్లలో ప్రతి ఏడాది లక్ష ఇళ్లు నిర్మించి ఉంటే నేడు ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. ప్రస్తుతం మెదక్, హైదరాబాద్ సహా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అసంపూర్తిగా ఉన్న ఇళ్లను పూర్తి చేస్తున్నామని, మహిళల సాధికారతకు ప్రాధాన్యమిస్తూ ఆడబిడ్డల పేరుతో ఇళ్ల పట్టాలు అందిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో తొలి విడత ఇందిరమ్మ ఇళ్లలో ఇప్పటికే లక్షా 30 వేల ఇళ్ల గృహప్రవేశాలు పూర్తయ్యాయని, మరో 70 నుంచి 75 వేల ఇళ్లు శ్లాబ్ దశకు చేరుకున్నాయని తెలిపారు. కులం, మతం, పార్టీ అనే తేడా లేకుండా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇళ్లు మంజూరు చేస్తున్నామని చెప్పారు. మొదటి విడత విజయవంతం కావడంతో గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండో విడత ఇందిరమ్మ ఇళ్లకు శ్రీకారం చుట్టారని, ఈ విడతలో రెండున్నర లక్షల ఇళ్లను మంజూరు చేశామని, ప్రతి నియోజకవర్గంలో రెండు వేల ఇళ్లు నిర్మించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని వివరించారు. ఇందులో 1,500 కొత్త ఇళ్లతో పాటు గతంలో అసంపూర్తిగా మిగిలిపోయిన 500 రేకుల ఇళ్లు, మొండిగోడల ఇళ్ల పూర్తి కోసం కూడా నిధులు విడుదల చేస్తున్నామని మంత్రి తెలిపారు.

మున్సిపల్ ఇంజనీర్ల మాయాజాలం

మొదటి పేజీ తరువాయి...

వ్యక్తులు గ్రామపంచాయతీ పేరుతో ఇంటి నిర్మాణ అనుమతులు జారీ చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

ప్రజల అమాయకత్వం ఆసరా

ఇంటి నిర్మాణానికి అనుమతి కావాలంటూ వచ్చే ప్రజలకు అనలు నిబంధనలు తెలియకపోవడాన్ని ఆసరాగా చేసుకుని, గ్రామపంచాయతీ పేరిట నకిలీ పర్మిషన్ పత్రాలు సిద్ధం చేసి భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొంతమంది ఇంటి యజమానులు లక్షల రూపాయలు ఖర్చు చేసి ఇళ్లు నిర్మించిన తర్వాత తమ వద్ద ఉన్న పత్రాలు చెల్లుబాటు కావని తెలుసుకుని తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

గ్రామ పంచాయతీ పర్మిషన్ తో అధికారి సస్పెండ్...

ఇటీవల ఇదే తరహాలో ఓ మహిళకు గ్రామపంచాయతీ పేరిట ఇంటి నిర్మాణ పర్మిషన్ జారీ చేసి భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేశారంటూ బాధితురాలు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. కలెక్టర్ ఆదేశాల మేరకు జరిగిన విచారణలో ప్రాథమికంగా అక్రమాలు జరిగినట్లు గుర్తించిన అధికారులు సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారితో పాటు ఆయన కింద పనిచేసే సహాయ సిబ్బందిపై చర్యలు తీసుకుని విధుల నుంచి తొలగించిన విషయం తెలిసిందే.

ఇంజనీర్ల పై చర్యలేవి...

అయితే ఈ వ్యవహారంలో అధికారులపై చర్యలు తీసుకున్నప్పటికీ, నకిలీ పర్మిషన్లు సిద్ధం చేసి ప్రజలను తప్పుదారి పట్టించారని ఆరోపణలు ఎదుర్కొంటున్న కొందరు మున్సిపల్ లైసెన్సుడ్ ఇంజనీర్లపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. అక్రమాలకు అసలు కారకులుగా భావిస్తున్న ఇంజనీర్లను ఎందుకు విచారించడం లేదని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.ఇంకా మెట్‌పల్లి మున్సిపల్ పరిధిలో ఇలాంటి నకిలీ పర్మిషన్లు మరెన్ని జారీ అయ్యాయి, ఎంతమంది ప్రజలు మోసపోయారు, ఈ వ్యవహారంలో ఎంత మొత్తంలో డబ్బుల లావాదేవీలు జరిగాయి అనే అంశాలపై సమగ్ర విచారణ జరపాల్సిన అవసరం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. బాధితుల నుంచి మరిన్ని ఫిర్యాదులు వచ్చే అవకాశం ఉందని, పూర్తి స్థాయి దర్యాప్తు జరిగితే మరిన్ని సంచలన విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయని పట్టణంలో చర్చ సాగుతోంది.

పూర్తి స్థాయిలో విచారణ జరగాలి...

సంబంధిత శాఖ ఉన్నతాధికారులు ఈ వ్యవహారాన్ని అత్యంత సీరియస్‌గా తీసుకుని పైస్థాయి నుంచి కింది స్థాయి వరకు సమగ్ర విచారణ చేపట్టి, నకిలీ పర్మిషన్లు జారీ చేయడంలో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా పాత్ర పోషించిన ప్రతి ఒక్కరిపై కఠిన చర్యలు తీసుకోవాలని మెట్‌పల్లి పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా మున్సిపల్ పరిధిలో జారీ అయ్యే ప్రతి ఇంటి నిర్మాణ అనుమతిని ప్రత్యేకంగా పరిశీలించి, ప్రజల్లో అవగాహన కల్పించాలని వారు కోరుతున్నారు.

జూన్ 2028 నాటికి ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పూర్తి చేస్తాం

మొదటి పేజీ తరువాయి...

తర్వాత ఇప్పటికే అర కిలోమీటర్‌కు పైగా పురోగతి నమోదైందని తెలిపారు. దేవరకొండ వైపు నుంచి పనులు సంతృప్తికరంగా కొనసాగుతున్నాయని, శ్రీశైలం వైపు కూడా అన్ని భద్రతా ప్రమాణాలు పాటిస్తూ పనులు సాగుతున్నాయని చెప్పారు. టన్నెల్ పనులను మరింత వేగవంతం చేసేందుకు మూడు అత్యాధునిక ఆర్మ్ బూమర్ యంత్రాలు ముంబై పోర్టుకు చేరాయని, ఈ నెలాఖరులో పనుల ప్రదేశానికి చేరుకుని నిర్మాణ వేగాన్ని మరింత పెంచనున్నాయని వెల్లడించారు. ఎస్ఎల్‌బీసీ ద్వారా శ్రీశైలం జలాశయం నుంచి 40 టీఎంసీల నీటిని తరలించి 4.01 లక్షల ఎకరాలకు సాగునీరు, 618 ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాలకు సురక్షిత తాగునీరు, అలాగే పారిశ్రామిక అవసరాలకు నీటి సరఫరా అందుతుందని మంత్రి వివరించారు. ఈ ప్రాజెక్టుకు సవరించిన పరిపాలనా అనుమతి వ్యయం సుమారు రూ.12,718 కోట్లు అని తెలిపారు.

పనుల వేగం ఎంత ముఖ్యమైనదైనా, కార్మికుల భద్రత దానికంటే ముఖ్యమని మంత్రి స్పష్టం చేశారు. టన్నెల్ అంతటా తగిన లైటింగ్, సమర్థవంతమైన వెంటిలేషన్, సీనియర్ జియాలజిస్టులు, అథారిటీ ఇంజినీర్లు, నిపుణుల నిరంతర పర్యవేక్షణతో పనులు కొనసాగించాలని ఆదేశించారు. నాణ్యతా ప్రమాణాలపై ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు.

టన్నెల్ వద్ద పనిచేసే సిబ్బందిని ఇప్పటికే మూడింతలు పెంచినట్లు, అదనపు యంత్రాలు, ప్రత్యేక పరికరాలు, సాంకేతిక నిపుణులను సమీకరిస్తున్నట్లు తెలిపారు. యంత్రాల రవాణా, కస్టమ్స్ అనుమతులు, సాంకేతిక సిబ్బంది నియామకం వంటి అంశాల్లో ఎలాంటి ఆలస్యం జరగకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డిండి ప్రాజెక్టు, నక్కలగండి రిజర్వాయర్, పెండ్లిపాకల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, కాలువల నెట్‌వర్క్ పూర్తయితేనే ఎస్ఎల్‌బీసీ పూర్తి ప్రయోజనాలు రైతులకు అందుతాయని మంత్రి తెలిపారు. భూసేకరణ పరిహారాన్ని రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.

హై లెవల్ కెనాల్, లో లెవల్ కెనాల్, ఉదయ సముద్రం ఎత్తిపోతల పథకం, కాలువల సామర్థ్య పెంపు పనులపైనా సమీక్ష నిర్వహించిన మంత్రి, అవసరమైన చోట కాలువలను విస్తరించి భవిష్యత్తులో అదనపు నీటి ప్రవాహాలను సురక్షితంగా మోయగల విధంగా రూపకల్పన చేయాలని అధికారులను ఆదేశించారు.

చివరగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, "ఎస్ఎల్‌బీసీ, డిండి ప్రాజెక్టులను జూన్-2028 నాటికి అన్ని విధాలుగా పూర్తి చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం. ఈ ప్రాజెక్టులు దక్షిణ తెలంగాణ రైతాంగానికి శాశ్వత సాగునీటి భరోసా, ఫ్లోరైడ్ బాధిత ప్రాంతాలకు సురక్షిత తాగునీరు అందించి ఆ ప్రాంత అభివృద్ధికి కొత్త దిశ చూపిస్తాయి" అని అన్నారు. ఈ సమీక్షలో నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఈ. శ్రీధర్, టన్నెల్ నిపుణుడు కల్నల్ పరిక్షిత్ మెహ్రా, ఇంజినీర్-ఇన్-చీఫ్ (జనరల్) వి. రమేష్ బాబు, ఉన్నతాధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

నీరవ్ మోదీ అప్పగింతకు మార్గం సుగమం..

మొదటి పేజీ తరువాయి...

అనంతరం ఇంటర్‌పోల్ కూడా అతడిపై అంతర్జాతీయ సహకారం కోరుతూ నోటీసు జారీ చేసింది. నీరవ్ మోదీ తన అప్పగింతను అడ్డుకునేందుకు యూకేలో అందుబాటులో ఉన్న అన్ని న్యాయపరమైన అవకాశాలను వినియోగించుకున్నారు. చివరిగా 2026 ఏప్రిల్‌లో యూరోపియన్ కోర్ట్ ఆఫ్ హ్యూమన్ రైట్స్‌ను ఆశ్రయించారు. అయితే, భారత్ ఇచ్చిన జైలు భద్రత, ఖైదీల పట్ల వ్యవహారంపై హామీలు సంతృప్తికరంగానే ఉన్నాయని ఇప్పటికే యూకే హైకోర్టు స్పష్టం చేస్తూ నీరవ్ మోదీ అప్పీల్‌ను తిరస్కరించింది. ఈసీహెచ్ఆర్ తీర్పుతో నీరవ్ మోదీ అప్పగింతకు ఇక ఎలాంటి న్యాయపరమైన అడ్డంకులు లేవని దౌత్య వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం లండన్‌లోని వాండ్స్‌వర్త్ జైలులో ఉన్న ఆయనను భారత్‌కు అప్పగించేందుకు బ్రిటన్ అధికారులు పరిపాలనా ప్రక్రియను ప్రారంభించినట్లు సమాచారం. అవసరమైన అధికారిక ప్రక్రియలు పూర్తికాగానే భారత్‌కు తీసుకురానున్నట్లు తెలుస్తోంది. నీరవ్ మోదీని 2019 మార్చిలో లండన్‌లో అరెస్టు చేశారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ భారీ మోసం, మనీలాండరింగ్ కేసుల్లో ఆయనని సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ), ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) వాంటెడ్ నిందితుడిగా ప్రకటించాయి. కాగా, ఈ ఏడాది మార్చిలోనూ తన అప్పగింత ఉత్తర్వులను పునఃపరిశీలించాలని లండన్‌లోని కింగ్స్ బెంచ్ డివిజన్ హైకోర్టును నీరవ్ మోదీ ఆశ్రయించారు. అయినా ఆయన పిటిషన్‌ను కోర్టు తిరస్కరించింది. అయితే, రక్షణ సలహాదారు సంజయ్ భండారీ కేసులో మానవతా దృక్పథంతో అప్పగింతను నిరాకరించిన తీర్పును ఆధారంగా చూపిస్తూ నీరవ్ మోదీ తన వాదనలు వినిపించినప్పటికీ.. కోర్టు వాటిని అంగీకరించలేదు. కాగా, తాజా తీర్పుతో ఆయన అప్పగింతకు మార్గం పూర్తిగా సుగమమైంది.

సముద్రం పాలవుతున్న అన్నదాతల ఆశలు

మొదటి పేజీ తరువాయి...

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు స్వయంగా కన్నెపల్లి పంప్ హౌస్‌ను సందర్శించి,ప్రాజెక్టులో నీటి లభ్యతను కళ్ళకు కట్టినట్లు చూపించినా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. ప్రాజెక్టులోని ఒకటి రెండు పిల్లర్ల సమస్యను రాజకీయ కక్ష సాధింపు కోసం సాకుగా చూపుతూ,ప్రాజెక్టును నిర్వీర్యం చేయడం ద్వారా 70 లక్షల మంది రైతుల ప్రయోజనాలను ప్రభుత్వం పణంగా పెట్టిందని విమర్శించారు.ప్రాజెక్టును నిర్మించిన ఎల్ అండ్ టీ సంస్థ స్వయంగా మరమ్మతులు చేయడానికి ముందుకు వచ్చినా, ప్రభుత్వం కక్షపూరితంగా అడ్డుకుంటోందని ,కేసీఆర్‌కు మంచి పేరు వస్తుందన్న అక్కసుతోనే ఈ అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు.ప్రాజెక్టు నిర్మాణంపై విషప్రచారం ఆపి,తక్షణమే పంపులను ఆన్ చేసి చెరువులను నింపాలని ఆయన డిమాండ్ చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు వ్యతిరేక విధానాలను అమలు చేస్తూ,రైతుల నడ్డి విరుస్తోందని నేతలు మండిపడ్డారు.రైతు భరోసా సకాలంలో అందకపోవడం,పంటల బోనస్ విషయంలో స్పష్టత లేకపోవడం, ఎరువుల కొరత వంటి సమస్యలతో అన్నదాతలు రోడ్డున పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.రైతులకు సాగునీరు అందించే బాధ్యతను విస్మరించి,నిందలు వేయడం ద్వారా ప్రజలను పక్కదోవ పట్టిస్తున్నారని మాజీ ఎమ్మెల్యేలు దాసరి మనోహర్ రెడ్డి,కోరుకంటి చందర్,పుట్ట మధుకర్ ఆరోపించారుప్రభుత్వం తన మొండి వైఖరిని వీడి,తక్షణమే కన్నెపల్లి పంపులను ఆన్ చేసి చెరువులను నింపాలని వారు డిమాండ్ చేశారు.లేనిపక్షంలో,రాబోయే రోజుల్లో లక్షమంది రైతులను ఏకం చేసి కన్నెపల్లి పంప్ హౌస్‌ను ముట్టడిస్తామని కొప్పుల ఈశ్వర్ హెచ్చరించారు.రైతుల ప్రయోజనాలే పరమావధిగా బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని,ప్రభుత్వం కళ్లు తెరిచి స్పందించకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.ఈ సమావేశంలో మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ రఘువీర్ సింగ్,మాజీ జడ్పీటీసి గంట రాములు యాదవ్,పట్టణ అధ్యక్షులు ఉప్పు రాజ్ కుమార్, మండల అధ్యక్షులు మర్కు లక్ష్మణ్, నాయకులు వెన్నం రవీందర్, మోబిన్,పెంచాల శ్రీధర్,నలేంద్ర రాములు, రాజ కొమురయ్య,మూదరి చంద్రశేఖర్, శ్రీకాంత్,అఫ్జల్ బాబా,ఖాదర్,రాజేష్,తోపాటు తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం దోషులను శిక్షించండి.. రైతులను కాదు

మొదటి పేజీ తరువాయి...

పాటు కాళేశ్వరం, హైడ్రా, మెట్రో, కేంద్ర నిధులు తదితర అంశాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా శ్యామాప్రసాద్ ముఖర్జీ దేశ సమైక్యత కోసం జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడని ఈటల కొనియాడారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా "ఒకే దేశం - ఒకే జెండా - ఒకే రాజ్యాంగం" కోసం ఆయన పోరాడారని గుర్తు చేశారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ వందలాది సంస్థానాలను ఏకం చేసి అఖండ భారత నిర్మాణానికి పునాది వేశారని, వారి స్ఫూర్తితో ప్రధాని నరేంద్ర మోడీ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, ఆలయాల పునరుద్ధరణకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర రాజకీయాలపై స్పందిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలను మభ్యపెట్టే రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. విదేశాల్లో కూడా అబద్ధాలు చెప్పడమే తన రాజకీయ శైలిగా ముఖ్యమంత్రి భావిస్తున్నారని విమర్శించారు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లను కూల్చివేయడం, గత ప్రభుత్వాలు పేదలకు ఇచ్చిన భూములను తిరిగి స్వాధీనం చేసుకుని ఇతరులకు కట్టబెట్టడం ప్రభుత్వ లక్ష్యంగా మారిందని ఆరోపించారు. హైడ్రా వ్యవహారంలో తాను మొదటి నుంచే వ్యతిరేకంగా పోరాడానని, అప్పట్లో తనను విమర్శించిన వారే ఇప్పుడు హైడ్రా అసలు స్వరూపాన్ని గుర్తిస్తున్నారని ఈటల పేర్కొన్నారు. కోర్టులు కూడా హైడ్రా వ్యవహార తీరుపై పలుమార్లు అభ్యంతరం వ్యక్తం చేశాయని, చట్టపరమైన విధానాలను విస్మరించి అధికారులు వ్యవహరించడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. అస్మత్‌పేటలో బాధిత మహిళ కన్నీళ్లు హైదరాబాద్‌లోని వేలాది పేద కుటుంబాల ఆవేదనకు ప్రతీక అని వ్యాఖ్యానించారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో హైడ్రా చర్యలపై ప్రజలు తమ తీర్పు ఇస్తారని, రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా రేవంత్ రెడ్డి ఓటమి తప్పదని ప్రజల్లో బలమైన అభిప్రాయం ఉందని ఈటల అన్నారు. అహంకార రాజకీయాలకు ప్రజలు తగిన సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై మాట్లాడుతూ దోషులు ఎవరైనా వారిపై చర్యలు తీసుకోవాలని, అయితే ప్రజలను, రైతులను శిక్షించడం సరికాదని స్పష్టం చేశారు. అన్నారం, సుందిళ్ల, ఎల్లంపల్లి వంటి ప్రాజెక్టులు పూర్తిస్థాయిలో పనిచేస్తున్నాయని, ప్రస్తుతం గోదావరిలో భారీగా నీరు సముద్రంలో కలుస్తుండగా మరోవైపు కరువు ముప్పు ఉందని చెప్పారు. ఈ పరిస్థితుల్లో రాజకీయాలు పక్కనపెట్టి వెంటనే పంపింగ్ ప్రారంభించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.రైతులు వర్షాభావంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, హైదరాబాద్ వంటి మహానగరాల తాగునీటి అవసరాలు కూడా గోదావరి, కృష్ణా నదులపైనే ఆధారపడి ఉన్నాయని గుర్తు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో ఒక భాగంలో సమస్యలు వచ్చినంత మాత్రాన మొత్తం ప్రాజెక్టును నిరుపయోగంగా పదిలేయడం సరికాదన్నారు. అవసరమైన మరమ్మతులు పూర్తి చేసి వెంటనే నీటి ఎత్తిపోతల పనులు ప్రారంభించాలని ప్రభుత్వానికి సూచించారు.కేంద్ర ప్రభుత్వం తెలంగాణ పట్ల ఎలాంటి వివక్ష చూపడం లేదని ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్-2కు కేంద్రం భారీ నిధులు ఇవ్వడానికి సిద్ధంగా ఉందని, రాష్ట్ర ప్రభుత్వం సరైన ప్రతిపాదనలు తీసుకురావాలని కోరారు. షామీర్‌పేట్, మేడ్చల్, ఎయిర్‌పోర్టు, ఫోర్త్ సిటీ వైపు మెట్రో విస్తరణకు బీజేపీ ఎలాంటి అభ్యంతరం చెప్పడం లేదని, త్వరితగతిన పనులు ప్రారంభించేందుకు కేంద్ర మంత్రులు, బీజేపీ ఎంపీలు పూర్తి సహకారం అందిస్తారని తెలిపారు. ట్రిపుల్ ఆర్ రోడ్డు, జాతీయ రహదారుల అభివృద్ధి వంటి కీలక ప్రాజెక్టులను కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు అందించిందని గుర్తుచేసిన ఆయన, కేంద్రంపై దుష్ప్రచారం మానుకుని అభివృద్ధి కార్యక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలని సూచించారు. ప్రజలు వాస్తవాలను గుర్తించే స్థాయిలో ఉన్నారని, అసత్య ప్రచారాలను నమ్మే పరిస్థితిలో లేరని ఈటల రాజేందర్ వ్యాఖ్యానించారు.

హైకోర్టు ఆదేశాల అమలు చేయాలి..

– చట్టవిరుద్ధ బిల్డింగ్ పర్మిషన్లు,ఇంటి నంబర్లు రద్దు చేయాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్‌కు వినతి

హనుమకొండ జులై 6 ప్రజా కలం ప్రతినిధి

తెలంగాణ హైకోర్టు W.P.No.20389 of 2026లో 2026 జూన్ 30న జారీ చేసిన ఉత్తర్వులను తక్షణమే అమలు చేయాలని కోరుతూ ఎన్.సమరసింహ గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) కమిషనర్‌కు సోమవారం వినతిపత్రం సమర్పించారు.వినతిపత్రంలో బిల్డింగ్ పర్మిషన్ నంబర్లు 0278/BP/3006/2023,0279/BP/3006/2023, అలాగే 23-6-103/A, 23-6-103/B ఇంటి నంబర్లు వివాదాస్పద,ఆక్రమిత భూమిపై చట్టవిరుద్ధంగా మంజూరయ్యాయని పేర్కొంటూ వాటిని రద్దు చేయాలని కోరారు.ఈ అంశంపై ఇప్పటికే 2025 జూలై 14న ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు తీసుకోలేదని,అనంతరం హైకోర్టును ఆశ్రయించగా సంబంధిత అధికారులకు నోటీసులు జారీ చేసి, అన్ని పక్షాలకు వాదనలు వినిపించే అవకాశం కల్పించి చట్టప్రకారం నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు ఆదేశించిందని తెలిపారు. అదేవిధంగా,సహాయ సంచాలకులు, సర్వే&భూ రికార్డులు సమర్పించిన సర్వే నివేదిక,అలాగే సుబేదారి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ 2026 జూలై 4న జారీ చేసిన అధికారిక లేఖలో ఆస్తికి సంబంధించిన సర్వే నంబర్లలో ఉన్న వ్యత్యాసాలను ప్రస్తావించిన విషయాలను కూడా విచారణలో పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు తన ఫిర్యాదుపై విచారణ చేపట్టి,సంబంధిత పక్షాలకు నోటీసులు జారీ చేసి వ్యక్తిగత విచారణ

నిర్వహించాలని, చట్టవిరుద్ధంగా మంజూరైనట్లు తేలితే సంబంధిత బిల్డింగ్ పర్మిషన్లు,ఇంటి నంబర్లను రద్దు చేసి కారణాలతో కూడిన (స్పీకింగ్ ఆర్డర్) ఉత్తర్వులు జారీ చేయాలని వినతిపత్రంలో విజ్ఞప్తి చేశారు.ఈ వినతిపత్రం ప్రతులను జిల్లా కలెక్టర్, హనుమకొండతో పాటు జీడబ్ల్యూఎంసీ డిప్యూటీ కమిషనర్,కాజీపేట సర్కిల్-IIకు కూడా సమాచారం మరియు తదుపరి చర్యల కోసం సమర్పించినట్లు తెలిపారు.

ఎస్ఐ పేరిట సైబర్ ఫేక్ కాల్స్

అప్రమత్తంగా ఉండాలి – మెట్‌పల్లి ఎస్ఐ పబ్బా కిరణ్ కుమార్

మెట్‌పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జులై 6 (ప్రజాకలం) మెట్‌పల్లి ఎస్ఐ పబ్బా కిరణ్ కుమార్ పేరుతో గుర్తుతెలియని వ్యక్తులు ఫేక్ ఫోన్ కాల్స్ చేస్తూ డబ్బులు అడుగుతున్న నేపథ్యంలో పట్టణ ప్రజలు, ముఖ్యంగా వ్యాపారులు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. సోమవారం ఎస్ఐ కిరణ్ కుమార్ విలేకరులతో మాట్లాడుతూ, తన పేరుతో కొందరు వ్యక్తులు ఫోన్ చేసి "తనకు అత్యవసరంగా డబ్బులు అవసరమని, ఫోన్‌పే ద్వారా నగదు పంపాలని" కోరుతున్నట్లు పలువురు తన దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. ప్రజలను, ముఖ్యంగా వ్యాపారులను లక్ష్యంగా చేసుకుని సైబర్ నేరగాళ్లు ఇలాంటి మోసాలకు పాల్పడుతున్నారని ఆయన హెచ్చరించారు. ఎవరైనా తన పేరుతో లేదా ఇతర అధికారుల పేరుతో డబ్బులు పంపాలని కోరితే వెంటనే నమ్మకుండా, సంబంధిత అధికారిని నేరుగా సంప్రదించి నిజానిజాలు నిర్ధారించుకోవాలని సూచించారు.అలాగే ఇలాంటి ఫేక్ కాల్స్ వచ్చినట్లయితే, సంబంధిత ఫోన్ నంబర్ వివరాలను నమోదు చేసి వెంటనే 918712656794 నంబర్ ద్వారా తన దృష్టికి తీసుకురావాలని మెట్‌పల్లి ఎస్ఐ పబ్బా కిరణ్ కుమార్ కోరారు.

అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి

- జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి

పెద్దపల్లి,జూలై 06:(ప్రజాకలం జిల్లాప్రతినిధి) అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి కలెక్టరేట్ సమావేశం మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు.శ్రీరాంపూర్ మండలం మంగపేట గ్రామానికి చెందిన ఏ లక్ష్మి తమ గ్రామ నందు ఖాళీగా ఉన్న అంగన్వాడి ఆయా పోస్ట్ తమకు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా వారధి సోసైటీ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు.ధర్మారం మండలం దొంగతుర్తి గ్రామానికి చెందిన మహంకాళి వీరమ్మ,గొట్టె లింగమ్మ సర్వేనెంబర్ 294 నందు ప్రభుత్వం తరఫున ఉమ్మడిగా బోర్వెల్ ఏర్పాటు చేయుట గురించి దరఖాస్తు చేసుకోగా ఈడీఎస్సీ కార్పొరేషన్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు.మంథని పట్టణం రాఘవ ఊర్ల నగర్ కు చెందిన భీమనపల్లి సురేందర్ తన కుమార్తెకు ఏదైనా బిసి గురుకుల పాఠశాలలో 8వ తరగతి నందు సీటు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా గురుకుల పాఠశాల సొసైటీ అధికారుల కొరకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు.ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి బి.ప్రకాష్,సంబంధిత జిల్లా అధికారులు,కలెక్టరేట్ డి.విభాగ పర్యవేక్షకులు ఈశ్వర ప్రసాద్,తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- వైద్యాధికారి డాక్టర్ వనజ

ఇబ్రహీంపట్నం జూలై 6(ప్రజాకలం ప్రతినిధి) ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఇబ్రహీంపట్నం వైద్యాధికారి డా. వనజ ఆధ్వర్యంలో స్థానిక తెలంగాణా మోడల్ స్కూల్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పీహెచ్ సిబ్బంది విద్యార్థులకు, వంటలు వండే సిబ్బందికి మరియు సానిటరీ సిబ్బందికి సాధారణ ఆరోగ్య పరీక్షలతో పాటు రక్త పరీక్షలు నిర్వహించారు. ముఖ్యంగా వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధులు అయిన డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, విరేచనాలు, జలుబు, ఫ్లూ తదితర వ్యాధుల లక్షణాలు, నివారణ చర్యల గురించి విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.డా. వనజ.మాట్లాడుతూ "పరిశుభ్రమైన తాగునీరు తాగడం, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూడడం, దోమల నివారణకు దోమతెరలు వాడడం, చేతులు శుభ్రంగా కడుక్కోవడం వంటి జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలి. జ్వరం వస్తే స్వీయ వైద్యం చేయకుండా వెంటనే పీహెచ్ ని సంప్రదించాలి" అని సూచించారు. ఈ శిబిరంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, హెల్త్ ఎడ్యుకేటర్ తులసి రమణ గణేష్. ఏఎన్ఎం. ఆశ వర్కర్లు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

పాలిటెక్నిక్ కళాశాలకు బస్సులు లేక విద్యార్థుల ఆవేదన

ప్రజా కలం జులై 6 (గద్వాల ప్రతినిధి)

గద్వాల్ మండలం గోనుపాడు వద్ద గల పాలిటెక్నిక్ కళాశాలకు ?సరైన రవాణా సౌకర్యం లేకపోవడం వల్ల చాలా మంది విద్యార్థులు కళాశాలకు రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, గద్వాల ఆర్టీసి బస్టాండ్ నుంచి అదనపు బస్సు సౌకర్యం కల్పించాలని విద్యార్థులు సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ గద్వాల ఆర్టీసి బస్టాండ్ నుంచి పాలిటెక్నిక్ కళాశాలకు బస్సు సౌకర్యం లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సాయంత్రం వేళల్లో కళాశాల వద్ద బస్సులు ఆపకపోవడంతో విద్యార్థులు గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోంది అని ఆవేదన వ్యక్తం చేశారు. గద్వాల నుంచి అదనపు బస్సు ఏర్పాటు చేయాలని కోరారు.

రైల్వే ట్రాక్‌పై ఆత్మహత్యాయత్నాన్ని అడ్డుకొని

వ్యక్తి ప్రాణాలను కాపాడిన కానిస్టేబుళ్లు

జిల్లా ఎస్పీ ప్రశంసలు - నగదు రివార్డు

జగిత్యాల ప్రతినిధి జూలై 6(ప్రజాకలం)

విధి నిర్వహణలో అప్రమత్తత, వేగవంతమైన స్పందన, మానవీయ దృక్పథంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ వ్యక్తి ప్రాణాలను కాపాడిన మల్యాల పోలీస్ స్టేషన్ బ్లూ కోల్ట్స్ కానిస్టేబుళ్లు మధుసూదన్ రెడ్డి మరియు వేణులను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు. వారి సేవలను గుర్తిస్తూ నగదు రివార్డును ప్రకటించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజల ప్రాణాలను కాపాడడం పోలీసుల అత్యున్నత బాధ్యత అని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో సమయస్ఫూర్తితో స్పందించడం, మానవత్వంతో వ్యవహరించడం ప్రతి పోలీసు సిబ్బందికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. విధి నిర్వహణలో నిబద్ధత, సేవాభావంతో పనిచేసిన కానిస్టేబుళ్లు మధుసూదన్ రెడ్డి, వేణులను ప్రత్యేకంగా ప్రశంసిస్తూ, ఇలాంటి సేవలు పోలీసు శాఖ ప్రతిష్ఠను మరింత పెంచుతాయని అన్నారు.ఆదివారం సాయంత్రం సుమారు 5 గంటల సమయంలో మల్యాల మండలం నూకపల్లి గ్రామ శివారులోని రైల్వే ట్రాక్‌పై ఓ గుర్తుతెలియని వ్యక్తి గాయాలతో పడి ఉన్నాడని డయల్-100కు సమాచారం అందింది. సమాచారం అందుకున్న వెంటనే బ్లూ కోల్ట్స్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని, మానసిక పరిస్థితి సరిగా లేక ఆ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు గుర్తించారు. తలకు తీవ్ర గాయాలతో రైల్వే ట్రాక్‌పైనే పడిఉండటంతో ప్రాణాపాయం ఉన్నట్లు గ్రహించిన పోలీసులు ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే అతడిని ట్రాక్‌పై నుంచి సురక్షిత ప్రాంతానికి తరలించారు. అనంతరం ప్రథమ చికిత్స అందించి, 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చి గాయపడిన వ్యక్తిని జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం అందేలా చర్యలు చేపట్టారు. కానిస్టేబుళ్ల సమయోచిత స్పందనతో ఒక వ్యక్తి ప్రాణాలు కాపాడబడగా, వారి సేవలను జిల్లా పోలీసు శాఖ అభినందించింది.

ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

- పలు సమస్యలపై వినతులు స్వీకరించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

- ప్రజావాణి ఫిర్యాదుల సంఖ్య: 68



జగిత్యాల ప్రతినిధి జులై 6 (ప్రజాకలం)

ప్రజావాణి అర్జీల పై సమగ్ర విచారణ జరిపి సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ పలు సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని పలు మండలాల నుండి ప్రజలు సమస్యలు విన్నవించుకోడానికి ప్రజావాణికి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పై సమగ్ర విచారణ చేపట్టి పరిష్కారానికి చొరవ చూపాలని అన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాగా ఈ ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 68 ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఇదివరకు ప్రజావాణి లో వచ్చిన 197 పెండింగ్ దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలని లేని యెడల సంబంధిత జిల్లా అధికారి బాధ్యునిగా చేస్తూ మెమో జారీ చేయబడునని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్, జిల్లా రెవెన్యూ అధికారి ప్రసాద్, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ హరిణి, సంబంధిత జిల్లా స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ధాన్యం అక్రమార్కులపై ఉక్కుపాదం

- రైస్ మిల్లు యాజమాని అరెస్ట్ పీడీ యాక్ట్ నమోదు

పెద్దపల్లి,జూలై 06:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

పేదలకు అందాల్సిన ప్రభుత్వ ధాన్యాన్ని అక్రమంగా దారి మళ్లించి, ప్రజా పంపిణీ వ్యవస్థను దెబ్బతీస్తున్న వారిపై పోలీసులు ఉక్కుపాదం మోపారు.ప్రభుత్వానికి కోట్లాది రూపాయల నష్టం కలిగించడమే కాకుండా, ప్రజల ఆహార భద్రతా హక్కులను హరిస్తున్న వారిపై రాజీ లేని వైఖరిని అవలంబిస్తామని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా స్పష్టం చేశారు.ఈ నేపథ్యంలోనే.కరీంనగర్ జిల్లా కట్టరాంపూర్‌కు చెందిన బండారి మారుతి (43) అనే వ్యక్తిపై పీడీ యాక్ట్ నమోదు చేసినట్లు సీపీ వెల్లడించారు.నిందితుడు సుల్తానాబాద్ మండలంలోని కాట్నపల్లిలో గల సాయి మహాలక్ష్మి,సౌభాగ్యలక్ష్మి ఇండస్ట్రీస్ మేనేజింగ్ పార్ట్‌నర్‌గా వ్యవహరిస్తూ ఈ అక్రమాలకు పాల్పడినట్లు తేలిందని,2023-24 రబీ,ఖరీఫ్ సీజన్లలో తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థతో కస్టమ్ మిల్లింగ్ ఒప్పందం కుదుర్చుకున్న మారుతి,ప్రభుత్వానికి అప్పగించాల్సిన 7,624.867 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని అక్రమంగా ఇతర రైస్ మిల్లులకు విక్రయించి ప్రభుత్వానికి రూ. 27 కోట్లకు పైగా నష్టం కలిగించినట్లు దర్యాప్తులో నిర్ధారణ అయిందని తెలిపారు. 2024 నుండి పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాల్లో ఇతనిపై నాలుగు క్రిమినల్ కేసులు నమోదయ్యాయని,బెయిల్‌పై విడుదలైనప్పటికీ మళ్లీ అదే నేరాలకు పాల్పడుతుండటంతో,నిందితుడు బయట ఉంటే ప్రజా పంపిణీ వ్యవస్థకు ముప్పు వాటిల్లుతుందని భావించిన పోలీసులు, సీపీ ఆదేశాల మేరకు పీడీ యాక్ట్ అమలు చేశారు.సుల్తానాబాద్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.రంజిత్‌రావు,సబ్‌ఇన్‌స్పెక్టర్ చంద్రకుమార్ కరీంనగర్ జైలులో నిందితుడికి ఉత్తర్వులు అందజేసి,అనంతరం చర్లపల్లి కేంద్ర కారాగారానికి తరలించారు.ఈ సందర్భంగా సీపీ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ ప్రభుత్వ ధాన్యాన్ని అక్రమంగా దోచుకునే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని,అక్రమ దారిమళ్లింపులో పాల్గొన్న ప్రతి వ్యక్తిని,సహకరించిన వారిని గుర్తించి కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన పెద్దపల్లి ఏసీపీ కృష్ణ,సీఐ పి.రంజిత్‌రావు,ఎస్సై చంద్రకుమార్‌లను ఆయన అభినందించారు.

కరెంట్ షాక్ కు గురై యువకుడు మృతి

భౌతిక దేహానికి నివాళి అర్పించిన ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్ (ప్రజా కలం న్యూస్) జోగులాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండల పరిధిలోని షాబాద్ గ్రామంలో కరెంటు షాక్ కు గురై యువకుడు మృతి చెందిన ఘటన గ్రామంలో విషాద ఛాయలు అమలుకున్నాయి. ఇటిక్యాల ఎస్ఐ రవి తెలిపిన వివరాల మేరకు షాబాద్ గ్రామానికి చెందిన అర్ఫాన్ తండ్రి రాజు (19) సంవత్సరాల యువకుడు పొలము పనులు నిర్వహిస్తుండగా ప్రమాదవశాత్తు కరెంటు తీగ తగిలి షాక్ కు గురై మృతి చెందాడని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం గద్వాల ఏరియా హాస్పిటల్ తరలించి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగిందని ఇటిక్యాల ఎస్ఐ తెలిపారు. ప్రమాద ఘటనను తెలుసుకున్న అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు గద్వాల ప్రభుత్వ ఆసుపత్రిలో భౌతిక దేహానికి నివాళులర్పించి,కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియ చేశారు.

హెల్ప్‌డెస్క్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- కౌన్సిలర్ ఖాజా అజీమ్

మెట్‌పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జులై 6 (ప్రజాకలం) మెట్‌పల్లి పట్టణంలోని 21వ వార్డు ప్రజలకు ప్రభుత్వ సేవలు సులభంగా అందేలా ప్రత్యేక "సర్" హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేసి సేవలు అందిస్తున్నట్లు వార్డు కౌన్సిలర్ ఖాజా అజీమ్ తెలిపారు. ఈ హెల్ప్‌డెస్క్‌ను కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగ్ రావు ఆదేశాలు, మార్గదర్శకత్వంలో కౌన్సిలర్ ఖాజా అజీమ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. హెల్ప్‌డెస్క్ ద్వారా సర్ ఫారాల నింపడం, అవసరమైన పత్రాలపై అవగాహన కల్పించడం, సందేహాలకు సమాధానాలు ఇవ్వడం వంటి సేవలను ఉచితంగా అందిస్తున్నారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ ఖాజా అజీమ్ మాట్లాడుతూ, 21వ వార్డు ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ సేవలను సులభంగా పొందాలని కోరారు. ప్రజలకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు హెల్ప్‌డెస్క్ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందన్నారు.

ఫిర్యాదులకు సత్వర చర్యలు

- జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

గ్రీవెన్స్ డేలో ప్రజా ఫిర్యాదులను స్వయంగా పరిశీలించిన ఎస్పీ

జగిత్యాల్ ప్రతినిధి జులై 6 (ప్రజా కలం)

జిల్లా ప్రజలకు పోలీసు సేవలను మరింత చేరువ చేయడం, బాధితుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడం లక్ష్యంగా ప్రతి సోమవారం నిర్వహిస్తున్న గ్రీవెన్స్ డే కార్యక్రమంలో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వయంగా పరిశీలించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 22 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడిన ఎస్పీ, వారి సమస్యలను వివరంగా తెలుసుకొని సంబంధిత పత్రాలను పరిశీలించారు. ప్రతి ఫిర్యాదును న్యాయబద్ధంగా, పారదర్శకంగా విచారించి బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.చట్ట పరిధిలో పరిష్కరించగల సమస్యలను ఆలస్యం లేకుండా వెంటనే పరిష్కరించాలని, విచారణలో ఎలాంటి లోపాలు ఉండకూడదని స్పష్టం చేశారు. జిల్లా పోలీసు శాఖ ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన సేవలను అందించేందుకు కట్టుబడి ఉందని, ప్రతి ఫిర్యాదును బాధ్యతాయుతంగా పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తోందని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు.

సీసీటీవీ కెమెరాలను ప్రారంభించిన

డి.ఎస్.పి కె పురుషోత్తం రెడ్డి

ఎండపల్లి, జూలై 06 : (ప్రజా కలం ప్రతినిధి)

జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం ఎండపల్లి మండలం రాజారాంపల్లి గ్రామం లో కమ్యూనిటీ పోలీసింగ్, నేను సైతం లో భాగంగా రాజారాంపల్లి గ్రామశీ లో సీసీటీవీ కెమెరాల ను ప్రారంబించిన జగిత్యాల డీఎస్పీ కె పురుషోత్తం రెడ్డి తేది 06.07.2026 సోమవారం రోజున రాజారాంపల్లి గ్రామం లో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాలను జగిత్యాల డీఎస్పీ కె పురుషోత్తం రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి రిబ్బన్ కట్ చేసి సిసీటీవీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సంద ర్భంగా ఏర్పాటు చేసిన సమావేశం లో డీఎస్పీ మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవడం ద్వారా నేరాలను చాలా వరకు అరికట్టవచ్చని తెలిపారు. ఏదైనా అవాంఛ నీయ సంఘటన లేదా దొంగతనం జరిగినప్పుడు నిందితులను త్వరగా పట్టుకోవడానికి సీసీ ఫుటేజ్ కీలక సాక్ష్యంగా మారు తుందని అన్నారు. సాంకేతి కత పెరిగిన ఈ రోజుల్లో ప్రతి ఒక్కరూ తమ పరిసర ప్రాంతాల లో భద్రతపై నిఘా ఉంచడం ఎంతో అవసర మన్నారు. నేను సైతం కార్యక్రమం లో భాగంగా ప్రజలు, వ్యాపారస్తులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ కాలనీల లో ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించడం అభినంద నీయమని డీఎస్పీ కొనియా డారు. భవిష్యత్తు లో మరిన్ని ప్రాంతాలను ఈ నిఘా నేత్రాల పరిధిలోకి తీసుకు వస్తామని డి.ఎస్.పి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం లో ధర్మపురి సీఐ ఎలపాటి రామ్ నర్సింహా రెడ్డి, వెల్గటూర్ ఇంచార్జ్ సబ్ ఇన్స్పెక్టర్- రవీందర్, గొల్లపల్లి సబ్ ఇన్స్పెక్టర్ కృష్ణ సాగర్ రెడ్డి, పోలీస్ సిబ్బంది, స్థానిక సర్పంచ్ సంగ రమేష్ యాదవ్, ఉప సర్పంచ్ మేరుగు జానీ, ప్రజా ప్రతినిధులు, గ్రామ ప్రజలు, యూత్ పాల్గొన్నారు.

ప్రజా కలం
మంగళవారం, జూలై 7, 2026

ఎలా నిర్వచిస్తారు?

రాజకీయాలలో ఎంత దిగువకు దిగజారితే అధఃపాతాళానికి చేరుకున్నట్టు? ఇది రాజకీయ ప్రశ్న కాదు, సామాజికమే. రాజకీయ నాయకులు అవకాశవాదంతో పార్టీలు ఫిరాయించడానికి ఎప్పటికప్పుడు కొత్త దారులు కనిపెడుతున్నారు... యథేచ్ఛగా ఆ దారిన పరుగులు తీస్తున్నారు. ఈమధ్యే చోటుచేసుకున్న పశ్చిమ బెంగాల్ పరిణామాలు చూస్తే చాలా ఆశ్చర్యం కలుగుతుంది. దశాబ్దంన్నర పాటు ఏకచ్ఛత్రాధిపత్యం సాగించిన మమతా బెనర్జీని ప్రజలు ఇంటికి సాగనంపారు. ఇది ప్రజాస్వామ్యంలో సహజ పరిణామం. ఏదో ఒక్క రాజకీయ పక్షాన్నో, ఒకే ఒక్క రాజకీయ నేతనో ప్రజలు శాశ్వతంగా అధికారంలో ఉండనివ్వకపోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తి. కానీ ఒక పార్టీ అండతో గెలిచినవారు, ఒక్క ఉదుటున గీత దాటిపోతే... మరి వారి రాజకీయ విధేయత సంగతి ఏమిటి? రాజకీయ అధికారం, సామాజిక హోదా కల్పించిన మాతృసంస్థతో కలిసి నడవాలా, అక్కరలేదా? రాజకీయ నడతలో నైతికతకు స్థానం ఉండనక్కరలేదా? ఎన్నికలలో ప్రజలు ఒక పార్టీని ఇంటికి పంపగానే అప్పటివరకూ ఆ పార్టీలో ఉండి రాజకీయాలను నడిపించిన వ్యక్తులు ఒక్కసారిగా, మూకుమ్మడిగా కొత్త దారులు అన్వేషించడాన్ని సామాజిక పరిశోధకులు ఎలా నిర్వచిస్తారు? దీనిని అధినాగరిక లక్షణంగా పునర్నిర్వచించడానికి కొలమానం ఏమైనా ఉన్నదా? ఈ దేశంలో పార్టీ ఫిరాయింపు రాజకీయాలు కొత్తేమీ కాదు, కానీ అందుకు కూడా కొన్ని పద్ధతులను పాటించడం గతంలో చూశాం. ఇప్పుడు మార్గం మారింది. పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ నాయకత్వంలో అప్రతిహతంగా ఏలుబడి సాగించిన తృణమూల్ కాంగ్రెస్ పార్టీ.. అసెంబ్లీ ఎన్నికలలో ప్రజాగ్రహాన్ని చవిచూసింది. గతంలో ఆ పార్టీ టిక్కెట్టుపై గెలిచి సగర్వంగా పార్లమెంటు మెట్లు ఎక్కిన 20 మంది సభ్యులు రాత్రికి రాత్రి ఎన్సీపీఐ (నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా) అనే పార్టీలోకి వెళ్లిపోయారు. తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఓడిపోయింది అసెంబ్లీ ఎన్నికలలో కదా..., కానీ ఇప్పుడు పార్టీ మారిన వారు అసెంబ్లీ సభ్యులు కారు, వారు పార్లమెంటు సభ్యులు. తృణమూల్ నాయకత్వంపై అసంతృప్తి ఉంటే, నాయకత్వంపై తిరుగుబాటు అవసరం అనుకుంటే గతంలో ఎప్పుడో ఈ పని చేసి ఉండవచ్చు. కానీ అలా చేయలేదు. సరే, పశ్చిమ బెంగాల్లో చక్రం తిప్పిన తృణమూల్ కాంగ్రెస్ నుంచి ఎన్సీపీఐలోకి వెళ్లిన వారికి, పాత పార్టీలో కనిపించని ఉత్తేజపూరితమైన సైద్ధాంతిక బలం ఏమైనా కొత్త పార్టీలో కనిపించిందా అంటే అటువంటిదేమీ ఉన్నట్టు లేదు. అసలు ఒకప్పుడు పశ్చిమ బెంగాల్ అంతటి రాష్ట్రాన్ని నడిపించినంతటి పెద్ద పార్టీ నుంచి మరో పార్టీలోకి వీరు వెళ్లారంటే అదింకా ఎంత పెద్ద పార్టీయో కదా అని అనిపిస్తుంది. కానీ ఆరా తీస్తే చాలా ఆశ్చర్యకరమైన సంగతులు తెలుస్తాయి. నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా అనే పార్టీకి పశ్చిమ బెంగాల్‌లో అసలు మూలాలే లేవు. ఆ పార్టీ వెనుక ప్రజలు లేరు, ఆ పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడానికి కార్యకర్తలు లేరు. కలకత్తాలో ఒక చిన్న ఆఫీసు మాత్రమే ఉందట. పోనీ గతంలో ఏమైనా పెద్ద రాజకీయ చరిత్ర ఉందా అంటే అదీ లేదు. ఇప్పుడు 20 మంది పార్లమెంటు సభ్యులను తనలోకి ఇముడ్చుకున్న ఆ బుజ్జి రాజకీయ పక్షానికి పశ్చిమ బెంగాల్ ఎన్నికలలో సైతం ఎన్నడూ పోటీ చేసిన చరిత్ర లేదు. అప్పనంగా 20 మంది ఎంపీల రాక ఓ హఠాత్ పరిణామం. దాంతో అసలు ఎక్కడా ఏ రూపంలోనూ ప్రాతినిధ్యమే లేని ఓ చిన్న రాజకీయ పక్షం ఉన్నట్టుండి ఒక్కసారిగా పార్లమెంటులో ఒక పెద్ద పార్టీగా రాత్రికి రాత్రి అవతరించేసింది. కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ మిత్రపక్షాలలో ఇప్పుడు అగ్రతాంబూలం ఈ బుజ్జి పార్టీదే. ఇంతా చేస్తే దీని వయస్సు ముచ్చటగా మూడేళ్లే. గతంలో ఈ పార్టీ తరఫున నలుగురు త్రిపుర అసెంబ్లీ ఎన్నికలలో పోటీ చేస్తే.. ఒక్కొక్కరికి వచ్చిన ఓట్లు నాలుగైదు వందలకు మించలేదు. అప్పట్లో ఆ పార్టీ నినాదం మాత్రం చాలా ఆకర్షణీయంగా ఉంది. 'మీ ఓట్లను కాపాడుకోవడానికి పార్టీ ఫిరాయింపుదారులను తిప్పికొట్టండి' అని ప్రజలకు సందేశం ఇచ్చిన నినాదం అది. ఎంత బాగుందీ నినాదం! ఆదర్శప్రాయమైన ఒక నినాదాన్ని ప్రజలలోకి తీసుకువెళ్లడానికి ఆ పార్టీ నేతలు చేసిన కృషిని ఆ పార్టీకి వచ్చిన ఓట్ల సంఖ్యతో బేరీజు వేయనక్కరలేదు గానీ, జరిగిన పరిణామాలను బట్టి చూస్తే మాత్రం ఆ నినాదానికీ, తదుపరి పరిణామాలకూ ఎక్కడా పొంతన కుదరడం లేదు. ఏడు కిరణాల మధ్య జిగేల్‌మని మెరుస్తున్న పాళీని ఎన్నికల గుర్తుగా ఎంచుకున్న ఈ పార్టీకి విరాళాలు కూడా వచ్చాయి. వచ్చిన లక్షా పదివేల డెబ్భై అయిదు రూపాయలలో ఖర్చులు పోగా, ఇంకా డెబ్భై అయిదు రూపాయలు బ్యాంకు ఖాతాలో నికరంగా మిగిలే ఉన్నాయి. బాగుంది. విరాళాల దుర్వినియోగం జరగనే లేదు. ఈ విశేషాలను బట్టి చూస్తే.. తృణమూల్ కాంగ్రెస్ పార్టీ నుంచి ఎన్సీపీఐలోకి వచ్చిన వారు ఆ పార్టీ నినాదం చూసి ఆకర్షితులై ఇందులోకి వచ్చారనుకోవడానికి ఇసుమంత ఆధారం కూడా కనిపించడం లేదు. మరి ఎందుకు మారినట్టు? పార్టీ ఫిరాయింపుదార్లుగా ముద్ర పడకూడదనే ఉద్దేశంతోనే, వారు మూకుమ్మడిగా పార్టీ మారారన్నది చెప్పకనే చెబుతున్నది. అంత అవసరం ఏమొచ్చిందీ అంటే... అసలు సిసలు తృణమూల్ కాంగ్రెస్ తమదేనని, కాబట్టి తమనే అసలైన తృణమూల్‌గా గుర్తించాలని ఈ 20 మందీ వెళ్లి ఎన్నికల కమిషన్‌ను అభ్యర్థించాలి. ఎన్నికల కమిషన్ అవునని అంగీకరించడానికి చాలా కసరత్తు చేయవలసి ఉంటుంది. ముఖ్యంగా సమయం. ఈ డిజిటల్ యుగంలో దీర్ఘకాలం ఎదురుచూసే సహనశీలురు అరుదు. అందుకే ఒక్క దెబ్బతో– ఒక కొత్త వ్యూహంతో– పాత మిత్రులతో కలిసి కాక, పార్లమెంటులో విడిగా ప్రత్యేకంగా కూర్చునే వీలును సాధించుకున్నారు. బాగు బాగు... మామూలుగా అయితే ఒక రాజకీయపక్షం మాత్రమే మరో పార్టీలో విలీనం కావచ్చు. ఎన్నికైన ప్రజాప్రతినిధులు ఆ కొత్త పార్టీలో తమ పాత పార్టీ విలీనం అయ్యింది కనుక తామూ అందుకు అంగీకరిస్తున్నట్టు చెప్పుకోవచ్చు. అప్పుడు ఫిరాయింపుల నిరోధక చట్టం వర్తించదు. కానీ ఇప్పుడు మూడింట రెండు వంతుల మంది మేము ఫలానా పార్టీలో చేరిపోయామని ప్రకటించుకోవడం వల్ల అనేక విధాలుగా అందరికీ శిరోభారం తగ్గినట్టే. మమతా బెనర్జీ ఆశ్రిత పక్షపాతానికి బండీ అయ్యుండవచ్చు, పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యాన్ని ఖాతరు చేయకపోయి ఉండవచ్చు, అవినీతిని అరికట్టలేకపోయి ఉండవచ్చు, ఆమె నాయకత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ తుడిచిపెట్టుకుపోవడానికి మరెన్నయినా కారణాలు ఉండవచ్చు. కానీ వాటిని వ్యతిరేకించేవారు ప్రాథమిక ప్రజాస్వామిక సూత్రాలనే ఆచరణలోకి తెచ్చి ఉండవచ్చు. కానీ అలా జరగకపోవడాన్ని సమాజం కూడా ఆక్షేపిస్తున్నట్టు లేదు. నాయకులలోని అప్రజాస్వామిక వర్తన చూస్తే సమాజానికి చీమ కుట్టినట్టయినా అనిపించడం లేదు. ఒకప్పుడు ఇటువంటి పరిణామాలు సంభవించినప్పుడు ప్రజలు ఈసడించుకునేవారు. చెట్టు కిందో, గట్టు మీదో కూర్చుని వార్తా పత్రికలు పట్టుకుని మరీ ఇందులోని మంచి– చెడు గురించి చర్చోపచర్చలు చేసేవారు. ఎవరికి తోచిన పద్ధతిలో వారు ఇటువంటి పరిణామాల పట్ల ఏదో ఒక స్థాయిలో నిరసన ధ్వని వినిపించేవారు. ఇప్పుడు ఆ సంస్కృతి మాయమైపోయింది. ఇది కూడా ఆకస్మికంగా జరిగింది కాదు. ఇది మనకు మామూలే. ఆ రోజుల్లో చీటికీ మాటికీ పార్టీలు మారే వారిని ఉద్దేశించి ఆయారాం, గయారాం అనేవారు. హర్యానా శాసనసభ్యుడు గయా లాల్ కేవలం పదిహేను రోజులలో ముచ్చటగా మూడు పార్టీలు ఫిరాయించడంతో ఈ శకం ప్రారంభమైంది. అది ఒక రకమైన తిట్టు. అయితే దేశ రాజకీయాలలో శ్రీరాముడికి ఉచితాసనం ఇవ్వడం మొదలయ్యాక ఆయారాం, గయారాం అనడానికి ఎవరైనా సంశయించవలసివస్తోంది. అంత తేలికగా నోరు పెగలడం లేదు. అలనాటి ఫిరాయింపు క్రీడలో భజన్‌లాల్ ఉదంతం మరీ విచిత్రం. హర్యానా మంత్రిమండలి మొత్తం ఏకబిగిన జనతా పార్టీ నుంచి కాంగ్రెస్‌లోకి దూకడం పెద్ద సంచలనం సృష్టించింది, పెనుదుమారం మిగిల్చింది. ఫిరాయింపు ప్రహసనం పుణ్యమా అని దేశంలో ఉన్నట్టుండి కుప్పకూలిన రాష్ట్ర ప్రభుత్వాల సంఖ్య 45 వరకూ ఉంటుందని విశ్లేషకులు తేల్చారు. భారత రాజకీయాలలో ఒకప్పుడు హెచ్.ఎన్ బహుగుణ అనే నాయకుడు ఉండేవారు.

ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, డిజిటలైజేషన్ వేగవంతం చేయాలి

– రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి

జగిత్యాల ప్రతినిధి జూలై 6 (ప్రజాకలం)

ప్రత్యేక సమగ్ర నవరణ (ఎన్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేసి నిర్దేశిత గడువుల్లో పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, సంబంధిత అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్ఐఆర్ కార్యక్రమం పురోగతిని సమీక్షించారు. జిల్లా సమీకృత కలెక్టరేట్ (ఐడీఓసీ) నుంచి జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీని మంగళవారం నాటికి 100 శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. తాళం వేసి ఉన్న ఇళ్లను 'అబ్సెంట్'గా నమోదు చేసి, అవసరమైతే మళ్లీ సందర్శించి ఫారాలను అందజేయాలని సూచించారు. పంపిణీ చేసిన ప్రతి ఫారాన్ని బూత్ లెవల్ అధికారులు, బీఎల్‌వోలు తిరిగి సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేసే డిజిటలైజేషన్ ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. తప్పుడు సమాచారం అందించిన వారిపై ప్రజాప్రతినిధ్య చట్టం సెక్షన్–31 ప్రకారం చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. ఎన్యుమరేషన్ ఫారాలను ఎలా పూరించాలో ఓటర్లకు వివరించడంలో బీఎల్‌వోలకు సూపర్‌వైజర్లు సహకరించాలని, అవసరమైతే అనుభవం ఉన్న వాలంటీర్లను వినియోగించాలని సూచించారు. ప్రతి ఓటరికి ఒకే ఫారం అందజేసి, పూరించిన ఫారాన్ని మాత్రమే తిరిగి తీసుకోవాలని స్పష్టం చేశారు.

ఎన్యుమరేషన్ ఫారాలను బీఎల్‌వోలు మాత్రమే పంపిణీ చేయాలని, రాజకీయ పార్టీల ప్రతినిధులు లేదా బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) పంపిణీ చేయరాదని తెలిపారు. అయితే ఓటర్ల చిరునామాలను గుర్తించడంలో మాత్రమే బీఎల్ఏలు సహకరించవచ్చన్నారు. పట్టణ ప్రాంతాల్లో ఎస్ఐఆర్ పనులను మరింత వేగవంతం చేయడంతో పాటు పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియను కూడా గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ, జగిత్యాల జిల్లాలో ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ 97.96 శాతం పూర్తయిందని, మిగిలిన సుమారు 14 వేల ఫారాల పంపిణీని మంగళవారం నాటికి పూర్తి చేస్తామని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 20.18 శాతం ఫారాల డిజిటలైజేషన్ పూర్తయిందని, ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు.ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిరంతరం సమావేశాలు నిర్వహిస్తూ, వారి సూచనలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటూ పారదర్శకంగా ప్రక్రియను కొనసాగిస్తున్నామని కలెక్టర్‌తెలిపారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి ఆర్డీవోలు మధుసూదన్, జీవాకర్ రెడ్డి, నరసింహా రావు, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ కన్నం హరిణి, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కేసు విచారణలో సీసీ కెమెరాల ఫుటేజీ కీలక ఆధారం

- సీసీ కెమెరాలను ప్రారంభించిన డీఎస్పీ పురుషోత్తం రెడ్డి

జగిత్యాల ప్రతినిధి జులై 6 (ప్రజాకలం)

నేరస్థులను గుర్తించడం, చోరీలు, రోడ్డు ప్రమాదాలు, గొడవలు తదితర ఘటనల విచారణలో సీసీ కెమెరాల ఫుటేజీ కీలక ఆధారంగా ఉపయోగపడుతుందని డీఎస్పీ పురుషోత్తం రెడ్డి పేర్కొన్నారు.కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా మల్యాల గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన 32 సీసీ కెమెరాలను సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేరాల నియంత్రణ, నేరాల ఛేదనలో సీసీ కెమెరాలు అత్యంత కీలక పాత్ర పోషిస్తాయని డీఎస్పీ పురుషోత్తం రెడ్డి అన్నారు.ప్రస్తుతం ప్రతి గ్రామం, కాలనీ, వ్యాపార సంస్థలో సీసీ కెమెరాలు అదనపు భద్రతను కల్పించే సమర్థవంతమైన సాధనంగా మారాయని తెలిపారు. ప్రతి గ్రామంలోని ప్రధాన కూడళ్లు, రహదారులు, మార్కెట్ ప్రాంతాలు, రద్దీ ప్రదేశాలు, అలాగే ప్రతి ఇల్లు, దుకాణం, వ్యాపార సంస్థ, అపార్ట్‌మెంట్‌ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ప్రజలకు సూచించారు. మల్యాలలో ఏర్పాటు చేసిన 32 సీసీ కెమెరాలు గ్రామ భద్రతను మరింత బలోపేతం చేస్తాయని, ప్రజల్లో భద్రతాభావాన్ని పెంపొందిస్తాయని అన్నారు.సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, దాతలు, గ్రామస్థులను డీఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమాన్ని ఆదర్శంగా తీసుకుని పరిసర గ్రామాల్లో కూడా స్వచ్ఛందంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాలు కనిపిస్తే వెంటనే డయల్–100 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ రాజ్‌కుమార్, ఎస్ఐ సందీప్, గ్రామ సర్పంచ్, ఎంపీవో, పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

దేశ సమగ్రత కోసం పోరాడిన మహనీయుడు శ్యామా ప్రసాద్ ముఖర్జీ

పెద్దపల్లి,జూలై 06: (ప్రజాకలం)

దేశ సమైక్యత,జాతీయవాద భావజాలం కోసం డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ చేసిన సేవలు చిరస్మరణీయమని బీజేపీ పెద్దపల్లి పట్టణ మండల శాఖ అధ్యక్షులు పెంజర్ల రాకేష్,వెల్పుల రమేష్ కొనియాడారు.సోమవారం భారతీయ జనసంఘ్ వ్యవస్థాపక అధ్యక్షులు,అఖండ భారత స్వప్నద్రష్ట,అపర చాణక్యుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతిని పురస్కరించుకుని పెద్దపల్లిలో బీజేపీ శ్రేణులు ఘనంగా నివాళులు అర్పించారు. ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి,ఆయన చేసిన త్యాగాలను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా పెంజర్ల రాకేష్,వెల్పుల రమేష్ మాట్లాడుతూ ఆధునిక భారత చరిత్రలో డాక్టర్ ముఖర్జీ ఒక ధ్రువతార అని,కేవలం 33 ఏళ్ల వయసులోనే కలకత్తా విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్‌గా ఆయన చేసిన మేధోమథనం,విద్యావ్యవస్థలో ఆయన తీసుకువచ్చిన సంస్కరణలు నేటికీ ఆదర్శనీయం అని కొనియాడారు.బెంగాల్ శాసనమండలిలో సభ్యునిగా,ఆర్థిక మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించినప్పటికీ,దేశ సమగ్రత విషయంలో ఎక్కడా రాజీపడకుండా,సిద్ధాంతాల కోసం మంత్రి పదవిని సైతం తృణప్రాయంగా వదిలేసిన గొప్ప వ్యక్తిత్వమని ఆయన పేర్కొన్నారు.1951 అక్టోబరు 21న భారతీయ జనసంఘ్‌ను స్థాపించి,బలమైన జాతీయ రాజకీయ శక్తికి పునాదులు వేసిన ముఖర్జీ,కాశ్మీర్ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించారని, ఆర్టికల్ 370 రద్దు కోసం చేసిన సుదీర్ఘ పోరాటంలో భాగంగానే 1953 జూన్ 23న ఆయన అనుమానాస్పద స్థితిలో అమరులయ్యారని గుర్తు చేశారు.ఆయన కలలు కన్న ఏక్ దేశ్–ఏక్ నిషాన్–ఏక్ విధాన్' లక్ష్యాన్ని సాకారం చేస్తూ,2019 డిసెంబర్‌లో ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం ఆర్టికల్ 370ని రద్దు చేయడం ముఖర్జీకి లభించిన నిజమైన నివాళి అని వ్యాఖ్యానించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు తంగే రాజేశ్వరరావు,పోల్సాని సంపత్ రావు,ఈర్ల శంకర్,ప్రధాన కార్యదర్శులు గుడ్ల సతీష్,మామిడి ఉమేష్,కోశాధికారి గాదసి సతీష్,కార్యదర్శి పోగుల రాజు,ముంజ రాజేంద్రప్రసాద్, కుషనపల్లి మధు,సండే శివ,సాయి కుక్క అంజి తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఉండాలి

- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ జూలై 06 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆయన స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆయా శాఖల అధికారులు ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను కలెక్టర్ కు సమర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ, ఉద్యోగులందరూ తప్పనిసరిగా ప్రతి రోజూ ముఖ గుర్తింపు హాజరు నమోదు చేయాలని ఆదేశించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ఫాంల పంపిణీ ప్రక్రియ వెంటనే పూర్తి చేయాలి:

– రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి

నిర్మల్ జూలై 06 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ఎన్యుమరేషన్ ఫాం ల పంపిణీ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

సోమవారం సాయంత్రం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి, ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి ఎన్యుమరేషన్ ఫాంల పంపిణీ, డిజిటలైజేషన్ పై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గడువులోగా ఎన్యుమరేషన్ ఫాంల పంపిణీ పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాల వారీగా ఇప్పటివరకు పూర్తి చేసిన ఎన్యుమరేషన్ ఫాంల పంపిణీ వివరాలు సమీక్షించారు. బూత్ లెవెల్ అధికారులు (బిఎల్ఓలు) తప్పనిసరిగా ఇంటింటికీ వెళ్లి ఫాం లు అందివ్వాలని అన్నారు. బిఎల్ఓ లు మాత్రమే ఫాంలు పంపిణీ చేయాలని, బిఎల్ఏ లు గానీ, ఇతర రాజకీయ పార్టీల వారికి గానీ ఎన్యుమరేషన్ ఫాం లు పంపిణీ చేసే అధికారం లేదని స్పష్టం చేశారు. ప్రజలకు ఎస్ఐఆర్ ప్రక్రియపై సందేహాలు నివృత్తి చేయడానికి అవసరమైతే అదనపు హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలకు ఎస్ఐఆర్ ప్రక్రియపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై ఎప్పటికప్పుడు వివిధ మీడియా మాధ్యమాలు, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం కల్పించాలని పేర్కొన్నారు.

కలెక్టరేట్లోని సమావేశ మందిరం నుంచి ఈ వీసీలో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పాల్గొన్నారు. వీసీలో భాగంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో ఎన్యుమరేషన్ ఫాంల పంపిణీ ప్రక్రియ పూర్తయిందన్నారు. అన్ని నియమాలు పాటిస్తూ ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్వహిస్తామని వివరించారు. డిజిటలైజేషన్ ప్రక్రియను కూడా త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు. ఎప్పటికప్పుడు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహిస్తున్నామని అన్నారు.

ఈ వీసీలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, ఆర్డీఓ దేవీదాస్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సిత్లా పండుగను గుర్తించి సెలవు ప్రకటించాలి

లంబాడీల ఐక్యవేదిక డోర్నకల్ అసెంబ్లీ ఇన్చార్జ్ ప్రవీణ్ నాయక్

మరిపెడ ప్రజా కలం న్యూస్ జూలై 6

జూలై 7న జరగనున్న బంజారా గిరిజనుల సంప్రదాయ శీతల పండుగకు ప్రభుత్వ సెలవు ప్రకటించాలని లంబాడీల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. ఈ పండుగ బంజారా సమాజానికి ఎందుకు అంత ప్రత్యేకం ప్రభుత్వ గుర్తింపు కోసం ఎందుకు విజ్ఞప్తి చేస్తున్నారు? పూర్తి వివరాలు తెలుసుకోండి.

బంజారా గిరిజనుల ఆచార వ్యవహారాలకు ప్రతీకగా నిలిచిన శీతల (శిత్ల్) పండుగను జులై 7న అన్ని తాండాల్లో ఘనంగా నిర్వహించాలని లంబాడీల ఐక్యవేదిక డోర్నకల్ అసెంబ్లీ ఇన్చార్జి ప్రవీణ్ నాయక్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పెద్ద పూసల కార్తీలో వచ్చే మొదటి మంగళవారం నిర్వహించే శిత్ల్ పండుగ బంజారా గిరిజనుల తొలి సంప్రదాయ పండుగ అని తెలిపారు. ప్రాచీన కాలం నుంచి పశుసంపద అభివృద్ధి చెందాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని, వర్షాలు బాగా కురవాలని ప్రార్థిస్తూ ఈ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారని పేర్కొన్నారు.

యావత్ గిరిజన బంజారా సోదర సోదరీమణులు ఈ ఏడాది జులై 7న ఒకేరోజు శీతల పండుగను ఘనంగా నిర్వహించి జాతి ఐక్యతను చాటాలని కోరారు. ప్రభుత్వం ఈ పండుగకు ప్రత్యేక గుర్తింపు ఇచ్చి అధికారిక సెలవు దినంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రజాప్రతినిధులు శీతల పండుగకు ప్రభుత్వ గుర్తింపు తీసుకురావడానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి తాండాలో లంబాడి గిరిజనులు సంప్రదాయాలను పరిరక్షిస్తూ శాంతియుత వాతావరణంలో శీతల పండుగను ఘనంగా నిర్వహించాలని బానోతు ప్రవీణ్ నాయక్ కోరారు.

జునోసిస్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ

అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి 06:

జునోసిస్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, దీనిపై ప్రజలలో అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా పిలుపునిచ్చారు. ప్రపంచ జునోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా అధికారుల సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ, జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే జునోసిస్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, ప్రజల్లో అవగాహన పెంపొందించడం ద్వారా అనేక ప్రాణాంతక వ్యాధులను నివారించవచ్చని ఆమె పేర్కొన్నారు. ప్రజారోగ్య పరిరక్షణలో పశు సంవర్ధక, వైద్య ఆరోగ్య, స్థానిక సంస్థలు, రెవెన్యూ తదితర శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. జునోసిస్ వ్యాధుల నివారణలో ప్రభుత్వ శాఖలతో పాటు ప్రజల భాగస్వామ్యం కూడా అత్యంత కీలకమని ఆమె అన్నారు. జంతువుల నుంచి మనుషులకు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా సంక్రమించే వ్యాధులను జునోసిస్ వ్యాధులు అంటారని కలెక్టర్ వివరించారు. వైరస్‌లు, బ్యాక్టీరియా, పరాన్నజీవులు, శిలీంధ్రాల ద్వారా ఈ వ్యాధులు వ్యాపిస్తాయని తెలిపారు. వ్యాధిగ్రస్త జంతువులతో ప్రత్యక్ష సంబంధం, జంతువుల కాట్లు లేదా గీతలు, కలుషితమైన పాలు, మాంసం, గుడ్లు వంటి ఆహార పదార్థాల వినియోగం, జంతువుల విసర్జనలు, మూత్రం, రక్తంతో సంబంధం, అలాగే దోమలు, పేలు, ఈగలు వంటి వాహకాల ద్వారా ఈ వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందని చెప్పారు.రేబీస్, బ్రూసెల్లోసిస్, లెప్టోస్పిరోసిస్, ఆంథ్రాక్స్, బర్డ్ ఫ్లూ, స్వైన్ ఫ్లూ వంటి వ్యాధులు ప్రధాన జునోసిస్ వ్యాధులుగా గుర్తించబడినట్లు ఆమె తెలిపారు.ప్రజలు తమ పెంపుడు జంతువులకు సకాలంలో టీకాలు వేయించాలని, జంతువులను తాకిన తర్వాత తప్పనిసరిగా సబ్బుతో చేతులు శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. పాలను బాగా మరిగించిన తరువాతనే వినియోగించాలని, మాంసం, గుడ్లను పూర్తిగా ఉడికించి తీసుకోవాలని తెలిపారు. అనారోగ్యంతో ఉన్న లేదా చనిపోయిన జంతువులను నేరుగా తాకకుండా వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.పశువుల షెడ్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు దోమలు, ఈగలు, పేలు వంటి వాహకాల నియంత్రణ చర్యలు చేపట్టాలని, పెంపుడు జంతువుల ఆరోగ్యాన్ని పశువైద్యుల ద్వారా ఎప్పటికప్పుడు పరీక్షించుకోవాలని కోరారు. జునోసిస్ వ్యాధులను నిరోధించడంలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని, పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత పై ప్రజలలో విస్తృత ప్రచారం చేయాలని కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయి శివాని, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డా. స్వామి, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల సహకారంతో మాజీ ఎంపీ సురేందర్ రెడ్డి భూమి కబ్జా

- రిజిస్టేషన్ చేసుకుని ఆ పై ఇంటి నిర్మాణం - పదేళ్లుగా రైతుబంధు పొందుతున్న వైనం

- జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ కు గ్రామ పెద్దలు పిర్యాదు

- క్రిమినల్ కేసు నమోదు చేసి రెవెన్యూ రికవరీ చేయాలని డిమాండ్



మరిపెడ ప్రజా కలం న్యూస్ జూలై 6

మాజీ పార్లమెంట్ సభ్యులు రామ సహాయం సురేందర్ రెడ్డి పేర ఉన్న భూమిని అక్రమంగా కబ్జా చేసి ఇంటి నిర్మాణం చేసుకోవడంతోపాటు గత పదేళ్ల గా రైతుబంధు పథకం ద్వారా లబ్ధి పొందుతున్న ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగుల ఉదాంతం ఇది. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపల్ కేంద్రంలోని సుప్రసిద్ధ మాకుల శ్రీ వెంకటేశ్వర ఆలయంలో అక్రమార్కుల వివరాలు నంచలనం కలిగిస్తున్నాయి.

మాకుల శ్రీ వెంకటేశ్వర ఆలయానికి రెండు ఎకరాల వ్యవసాయ భూమిని మాజీ పార్లమెంట్ సభ్యులు రామ సహాయం సురేందర్ రెడ్డి కేటాయించారు. ఇట్టి భూమిలో గతంలో ఇక్కడ ఆలయ మేనేజర్ గా పనిచేసిన సమయంలో బోగోజు భిక్షమాచారి (గుంజేడు ముసలమ్మ ఆలయంలో రూపాయలు 20,000 లంచం తీసుకొని ఎసిబి ట్రాప్ కు గురై రెడ్ హ్యాండెడ్ గా చిక్కి అరెస్టు అయి సస్పెండ్ అయ్యారు) ఆయన తో పాటు ఆలయ అర్చకునిగా ఉద్యోగం నిర్వహిస్తున్న నల్ల చక్రవర్తుల లక్ష్మణాచార్యులు దాదాపు 8 గంటల భూమిని ఆక్రమించి ఆక్రమంగా ఇంటి నిర్మాణం చేపట్టారని సోమవారం గ్రామానికి చెందిన వేర్మరెడ్డి వెంకట రెడ్డి, కుడితి వెంకట రెడ్డి లు జిల్లా కలెక్టర్ కు గ్రీవెన్స్ సెల్ లో లిఖిత పూర్వకంగా పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మీడియా తో మాట్లాడుతూ భూమిని కబ్జా చేయటం తో పాటు అక్రమంగా గృహ నిర్మాణం చేశారు. అనంతరం ఆ ఇండ్లను తమ భార్యలైన బోగోజు ఉమా, నల్లాస్ గోదాదేవి లపై వ్యూహ త్మకంగా అప్పటి మరిపెడ జీపీ లో రికార్డు చేయించుకున్నారు. ఇది ఇలా ఉండగా గృహ నిర్మాణం చేసుకున్న స్థలాన్ని వ్యవసాయ భూమిగా చూపిస్తూ గత 12 ఏళ్లుగా రైతుబంధు పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారు. వీరి పై క్రిమినల్ కేసు నమోదు చేసి రెవెన్యూ రికవరీ చట్టం కింద రైతుబంధు రికవరీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

తాడిచెర్లలో మానవత్వం చాటుకున్న వార్డు సభ్యులు

- అంత్యక్రియల్లో పాల్గొని పాడే మోసిన అశోక్ గౌడ్, సారయ్య

మల్హర్, జూలై 6 ప్రజాకలం ప్రతినిధి...

మండల కేంద్రమైన తాడిచెర్ల తాడిచెర్ల గ్రామానికి చెందిన జాలిగపు మల్లయ్య అనారోగ్యంతో సోమవారం మృతి చెందగ విషయం తెలుసుకున్న స్థానిక వార్డు సభ్యులు తిర్రి అశోక్ గౌడ్, ఇందారపు సారయ్యలు మృతుని కుటుంబాన్ని పరామర్శించారు.అనంతరం మల్లయ్య పార్థివ దేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అంత్యక్రియల్లో పాల్గొని పాడే మోసి తమ మానవత్వాన్ని చాటుకున్నారు. మల్లయ్య మృతి రాజకులస్థులకు, వారి కుటుంబానికి తీరని లోటని అన్నారు. మృతుని కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అభివృద్ధికి ఆమడ దూరంగా తాడిచెర్ల డేంజర్ జోన్ పరిధి ..!

-డేంజర్ జోన్ పేరుతో హరించుకుపోతున్న కనీస వసతులు.. అధ్వానంగా సీసీ రోడ్లు, డ్రైనేజీలు...

మల్హర్, జూలై 6 ప్రజాకలం ప్రతినిధి...

మండల కేంద్రమైన తాడిచెర్ల లోని టీజీ జెన్కో ఓసిపి బ్లాక్ వన్ కు కేవలం 500 మీటర్ల డేంజర్ జోన్లో ఉన్న పెద్ద తాడిచెర్ల గ్రామం దశాబ్ద కాలంగా తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతోంది. ఓసిపి మైనింగ్ లో బాగంగా సేకరించేందుకు ఈ గ్రామానికి ఉమ్మడి రాష్ట్రంలో ఏపి జెన్కో పేరుతో, 2022 లో టీఎస్ పేరుతో ఇండ్లకు నెంబర్లు వేసినప్పటికీ ఇప్పటివరకు ఇండ్ల సేకరణ (పరిహారం) ప్రక్రియ పూర్తి చేయలేదు. ఇండ్లు సేకరించకుండానే 2017 లోనే ఓసీపీ పనులు ప్రారంభించారని, నాటి నుండి నేటివరకు పదేళ్లు గడుస్తున్నా ఓసిపి వెదజల్లే దుమ్ము దూలితో నరకయాతన అనుభవిస్తున్న కానీ నిర్వాసితులకు మాత్రం న్యాయం జరగలేదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధికి దూరం.. నరకప్రాయంగా రోడ్లు:

ఈ గ్రామాన్ని ఓసిపి ఎఫెక్టెడ్ జోన్‌గా భావించి సీసీ రోడ్లు, డ్రైనేజీలు, మరుగుదొడ్ల మంజూరు వంటి కనీస వసతులు పూర్తిగా నిలిపివేశారు. దీంతో పెద్ద తాడిచెర్ల బస్టాండ్ నుండి మన్యపువాడ చివరి వరకు ఉన్న రోడ్డు పరిస్థితి అత్యంత అధ్వాన్నంగా తయారైంది. ఎస్సీ కాలనీ, పెద్ద తాడిచెర్ల పరిధిలో ఇందిరమ్మ ఇండ్లు కూడా మంజూరు కావడం లేదని దళిత వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

261 కోట్ల నిధులున్నా కదలని ఇండ్ల సేకరణ:

ఇటీవల టీజీ జెన్‌కో సంస్థ ఇండ్ల సేకరణ కోసం లైన్ ఎస్టిమేషన్ కింద రూ. 261 కోట్ల నిధులను కలెక్టర్‌కు బదిలీ చేసినప్పటికీ, ఇప్పటికీ సేకరణ ప్రక్రియ మొదలుకాలేదు. 'డెంజర్ జోన్' పేరుతో ఒకపక్క ఓసిపి ప్రాజెక్ట్ ముప్పు, బ్లాస్టింగ్ వల్ల కూలుతున్న గృహాలు, మరోపక్క దుమ్ము దూలితో నరకయాతన అనుభవిస్తున్నామని ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే ఇండ్ల సేకరణ పూర్తి చేసి, తమను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని పెద్ద తాడిచెర్ల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

అర్జిదారుల దరఖాస్తులను సత్వరం

పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు

జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా - ప్రజావాణికి 132 ఫిర్యాదుల స్వీకరణ

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి 06:

ప్రజావాణిలో అర్జిదారుల నుండి వచ్చిన దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులకు ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, స్థానిక సంస్థల అదనపు కలెక్టో మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి హరిప్రియ తో కలిసి అర్జిదారుల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా అర్జిదారుల సమస్యలను సావధానంగా విన్నారు. ప్రతి సమస్యను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని అర్జిదారులకు ఆమె వారికి భరోసా ఇచ్చారు.

ఈ ప్రజావాణిలో మున్సిపల్, పంచాయతీరాజ్, జిల్లా సంక్షేమం, వ్యవసాయం, పౌరసరఫరాల శాఖ, భూ సర్వే రికార్డులు, గృహ నిర్మాణం, రోడ్డు రవాణా, పోలీస్, గిరిజన అభివృద్ధి శాఖ, ప్రణాళిక శాఖ, విద్యుత్ శాఖ, విద్య, వైద్య ఆరోగ్యం , అటవీ, గ్రామీణ అభివృద్ధి, తదితర శాఖలకు సంబంధించిన మొత్తం 132 వినతులను అధికారులు స్వీకరించారు.లిఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీలో సభ్యత్వ నమోదు చేసుకోవాలి: కలెక్టర్ ఖుష్బు గుప్తా పిలుపు.లివివిధ శాఖలలో పనిచేస్తున్న జిల్లా అధికారులు, సిబ్బంది ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీలో సభ్యత్వం నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా పిలుపునిచ్చారు. సోమవారం, ప్రజావాణి అనంతరం నిర్వహించిన జిల్లా అధికారుల సమావేశంలో మాట్లాడుతూ అధికారులందరూ తప్పనిసరిగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ లో లైఫ్ మెంబర్ రూ.1000 చెల్లించి సభ్యత్వం నమోదు చేసుకోవాలని సూచించారు. సభ్యత్వ నమోదు ప్రక్రియను సులభతరం చేసేందుకు జిల్లా కలెక్టరేట్లలో ఒక ప్రత్యేక నమోదు కేంద్రం, అలాగే ఒక కంప్యూటర్ ఆపరేటర్ ను కూడా నియోంచినట్టు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది ఈ కేంద్రం ద్వారా సులభంగా సభ్యత్వం పొందవచ్చని పేర్కొన్నారు. సభ్యత్వం కోసం ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫొటో సమర్పిస్తే సరిపోతుందని, నమోదు పూర్తయిన మూడు రోజుల్లోనే డిజిటల్ సభ్యత్వ గుర్తింపు కార్డును అందజేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలో సభ్యత్వ సంఖ్యను పెంచడంతో పాటు రెడ్ క్రాస్ నిర్వహిస్తున్న రక్త బ్యాంకులు, పేద విద్యార్థులకు ఉన్నత విద్యా కోసం ఆర్థిక సహాయం వంటి మానవతా సేవా కార్యక్రమాలను మరింత బలోపేతం చేయడం లక్ష్యమని ఆయన వివరించారు.

కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. ఎల్. బి. హరిప్రియ, భూసేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ రామ్ రెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనీ సాయి శివాని, జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ నటరాజ్, డి.ఆర్.ఓ ఎ .నిర్మల, జడ్.పి.సి.ఈ.ఓ, ఇన్.ఛార్జ్ డి. పి.ఓ, వెంకట రెడ్డి, డి.ఆర్.డి.ఓ నరసింహులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలం ఏరియా ఆస్పత్రిపై

ప్రత్యేక దృష్టి పెట్టండి

- ఎంపీ బలరాం నాయక్ , ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు కు మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ వినతి

- అదనపు వైద్యులు, సిబ్బందిని నియమించాలి

- సిటీ స్కాన్, ప్లేట్‌లెట్ వేరు చేసే యంత్రాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి

- తల సేమియా , సికిల్ సెల్ చిన్నారులకు ప్రతినెల 10 వేల రూపాయలు పెన్షన్ ఇవ్వాలని విజ్ఞప్తి

ప్రజాకలం ప్రతినిధి భద్రాచలం, జూలై 6

భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో నెలకొన్న వైద్యుల కొరతను తీర్చాలని, ఆధునిక వైద్య పరికరాలను అందుబాటులోకి తీసుకురావాలని మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ కోరింది. ఆదివారం భద్రాచలంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, స్థానిక ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావులను కలిసి ట్రస్ట్ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొప్పుల మురళి మాట్లాడుతూ.. నాలుగు రాష్ట్రాల సరిహద్దులో ఉన్న భద్రాచలం ఆస్పత్రికి గిరిజనులు, పేద ప్రజలు పెద్ద సంఖ్యలో వస్తుంటారని, అయితే సిబ్బంది కొరతతో వైద్య సేవలు అందుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. వర్షాకాలంలో డెంగ్యూ వ్యాధిగ్రస్తులకు అత్యవసరమైన 'ప్లేట్‌లెట్ సెపరేటర్' లేకపోవడం, ప్రమాదాల సమయంలో 'సిటీ స్కాన్' కోసం బయట ఆస్పత్రులకు వెళ్లాల్సి రావడం వల్ల పేదలు ఆర్థికంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తలసేమియా, సికిల్ సెల్ అనీమియాతో బాధపడుతున్న పిల్లలకు నెలకు రూ. 10 వేల ఆర్థిక సాయం అందించేలా ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా: ఎంపీ బలరాం నాయక్

సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పీకరించిన ఎంపీ బలరాం నాయక్ మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంత ప్రజల ఆరోగ్య భద్రతకు తాము కట్టుబడి ఉన్నామన్నారు. ఆస్పత్రిలో వైద్యుల , నర్సింగ్ సిబ్బంది కొరతను , అలాగే మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యంగా సిటీ స్కాన్, ప్లేట్‌లెట్ సెపరేటర్ ఏర్పాటుకు కృషి చేస్తానని, తలసేమియా పిల్లల ఆర్థిక సాయం అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని ఎంపీ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు జిలకర నాగరాజు, పీర్ల నాగేంద్ర, గాడి విజయ్, మహమ్మద్ జిందా తదితరులు పాల్గొన్నారు.

పద్మ పురస్కారాలకు అర్హులైన వ్యక్తుల నుండి నామినేషన్ల ఆహ్వానం

- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

ప్రజా కలం జులై 6 (గద్వాల ప్రతినిధి)భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రదానం వేసే పద్మ అవార్డులు- 2027 (పద్మ విభూషణ్,పద్మ భూషణ్,పద్మ శ్రీ) అర్హులైన వారి నుండి నామినేషన్లు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశానికి,సమాజానికి విశిష్ట సేవలు అందించిన అసాధారణ ప్రతిభావంతులను పద్మ అవార్డులకు సిఫారసు చేయాలని భారత ప్రభుత్వం కోరుతున్నట్లు తెలిపారు.గుర్తింపు పొందని ప్రతిభావంతులు,గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో సేవలందిస్తున్న వారు, మహిళా సాధికారత, బాలల సంక్షేమం,సామాజిక సేవ రంగాల్లో విశేష కృషి చేసిన వారికి ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. అదే విధంగా కళలు,సాహిత్యం, విద్య,క్రీడలు,వైద్యం, సామాజిక సేవ,సైన్స్, ఇంజినీరింగ్,పబ్లిక్ అఫైర్స్, సివిల్ సర్వీస్,వాణిజ్యం,పరిశ్రమలు మొదలైన రంగాల్లో విశిష్ట సేవలు అందించి విజయాలు సాధించిన వారికి ఈ అవార్డులు అందజేయను న్నట్లు వెల్లడించారు. 2027 సంవత్సరానికి ఇచ్చే ఈ పద్మ అవార్డుల కోసం నామినేషన్లు/సిఫార్సులను రాష్ట్రపతి పురస్కార్ పోర్టల్ https://awards.gov.in ద్వారా స్వీకరించబడతాయని వెల్లడించారు.నామినేషన్లను 15 జూలై,2026 లోగా పైన పేర్కొన్న పోర్టల్‌లో అందుబాటులో ఉన్న ఫార్మాట్‌లో,పూర్తి వివరాలతో పాటు విశిష్ట సేవలు,సామాజిక సేవలు వివరణాత్మక కథనం రూపంలో పంపిం చాలని తెలిపారు.ఆన్‌లైన్‌లో నామినేషన్లు పంపడానికి అవసరమైన సూచ నలు https://awards.gov.in పోర్టల్‌లో అందుబాటులో ఉన్నాయని, అలాగే నియమ నిబంధనలు పద్మఅవార్డుల వెబ్‌సైట్: https://padmaawards.gov.in లో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. జిల్లాకు చెందిన అర్హులైన వ్యక్తులు లేదా వారి పేర్లను సిఫారసు5 చేయదలచిన వారు,పూర్తి వివరాలతో కూడిన ప్రతిపాదనలను 2026 జూలై 15లోగా జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయానికి సమర్పించాలని కలెక్టర్ తెలిపారు.

రామారావుపల్లె ప్రభుత్వ పాఠశాలలో ప్రీ ప్రైమరీ తరగతులు ప్రారంభం

మల్హార్, జూలై 6 ప్రజాకలం ప్రతినిధి : మండల కేంద్రమైన తాడిచర్ల గ్రామ పరిధిలోని రామారావుపల్లె ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి గానూ ప్రీ ప్రైమరీ తరగతుల నిర్వహణకు జిల్లా విద్యాశాఖ నుండి ఉత్తర్వులు వచ్చినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి. పద్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తల్లిదండ్రులందరూ తమ నాలుగు సంవత్సరాల పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని ఆమె పేర్కొన్నారు.

భూ సమస్యలపై నిర్లక్ష్యం వద్దు

తక్షణమే పరిష్కరించండి: ఆర్డీవో శ్రీదేవి

చండూరు, జూలై 6 (ప్రజాకలం): డివిజన్ కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి ఐదు భూ సమస్యల దరఖాస్తులు అందినట్లు ఆర్డీవో శ్రీదేవి తెలిపారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులు తమ భూ సమస్యలపై ఆర్డీవోకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ఆయా శాఖల అధికారులు త్వరితగతిన పరిశీలించి, చట్టపరిధిలో వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. బాధితులకు న్యాయం జరిగేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు.అదేవిధంగా ప్రస్తుతం నియోజకవర్గ వ్యాప్తంగా జరుగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియపై అధికారులతో ఆర్డీవో సమీక్ష నిర్వహించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా, జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా పకడ్బందీగా సవరణలు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. నిబంధనల ప్రకారం ఓటరు నమోదు, మార్పులు చేర్పుల ప్రక్రియను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్లతోనే పేదల సొంతింటి కల సాకారం

- మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు
- 8వ వార్డులో ఘనంగా గండూరి నగేష్ ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం

చండూరు, జూలై 6 (ప్రజాకలం):

పేదల సొంతింటి కలను నెరవేర్చే ఏకైక లక్ష్యంతోనే ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని చండూరు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు అన్నారు. చండూరు మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డుకు చెందిన గండూరి నగేష్ నూత నంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమాన్ని మున్సిపాలిటీ పాలకవర్గం ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజ రైన చైర్మన్ డా. కోడి శ్రీనివాసులు.. నూతన వధూవరులు, కుటుంబ సభ్యు లకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్ల పథకం ఎన్నో పేద కుటుంబాల్లో వెలుగులు నింపుతూ, వారికి కొండంత సంతోషాన్ని అందిస్తోందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభు త్వం ఎంతో ప్రతిష్టా త్మకంగా తీసుకువ చ్చిన ఈ పథకం పేదలకు ఒక వరం లాంటిదని కొనియాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సొంతిల్లు దక్కాలనేదే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఈ గృహప్ర వేశ మహోత్సవంలో మున్సిపల్ వైస్ చైర్మన్ భూతరాజు దశరథ, కౌన్సిల్ సభ్యులు బుషిపాక వాసు, కో-ఆప్షన్ సభ్యురాలు కల్లెట్ల చంద్రకళ మారయ్య, కాంగ్రెస్పార్టీ పట్టణ అధ్యక్షుడు ఐతరాజు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

నాయకుడు కాని నాగన్న.. గాయకుడు గానే సమాధి

డా.విశారదన్ మారాజ్

ఖమ్మం జులై 06(ప్రజా కలం న్యూస్)

ఖమ్మం అరుణోదయ నాగన్న కుటుంబాన్ని బీసీ , ఎస్సీ , ఎస్టీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ విశారదన్ మహారాజ్ హాజరై పరామర్శించారు . మోహన్ రావు అధ్యక్షతన సంతాప సభను నిర్వహించడం జరిగినది . ఈ సందర్భంగా విశారదన్ మాట్లాడుతూ. నాగన్న గత 30 సంవత్సరాలుగా పరిచయం . నాగన్న ఎంతో దుఃఖితుడు అందుకే కాబోలు పేద ప్రజలను చూసి మరింత దుఃఖించేవాడు . తన కుటుంబాన్ని కూడా కాదనుకొని తన స్వరంతో ఈ సమాజానికి సందేశం ఇవ్వాలి అనుకున్నాడు . కానీ అతని స్వరంతో ఒకే ఒక సామాజిక వర్గం (కమ్మ) అధికారాన్ని చేజిక్కించుకుంది . అతని త్యాగంతో కమ్మ కులం కోట్ల సంపదను పోగు చేసుకుంది . తన పాట తన జాతికి కానీ తనకు కానీ ఆత్మగౌరవాన్ని కలిగించలేకపోయిందని అన్నారు . నాగన్న ను పాట గాడి గానే చూశారు . కానీ ఒక రాజకీయ నాయకుడుగా ఆ సామాజిక వర్గం ఎదగనివ్వలేదు . ఇది అత్యంత బాధాకరం . నాగన్న మరణం సహజ మరణం కాదు . ఇది సామాజిక హత్య . నాగన్న ఈ సమాజానికి ఓ సందేశాన్ని ఇవ్వకుండానే వెళ్లిపోయారు . దళిత బహుజనుల త్యాగాలతో ఏర్పాటు చేసుకున్న కమ్మ సామ్రాజ్యాన్ని కూల్చి పేదల రాజ్యాన్ని సాధించడమే నాగన్నకు ఇచ్చే నివాళి అని అన్నారు . బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి పొడకండి రాంబాబు మాట్లాడుతూ అగ్రకులాల వారి గురిగింజంత త్యాగం కొండంత వెలుగులా కనపడుతుంది . శ్రామిక కులాల వారి కొండంత త్యాగం నామరూపం లేకుండా పోతుంది ఇదే కుల వ్యవస్థ అందుకే నాగన్న త్యాగానికి వారి కుమారుడ్ని ఖమ్మం నుండి శాసనసభకు పంపడమే అని అన్నారు . ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి బండారు ఐలన్న , అడ్వకేట్ విప్లవ్ , నాగన్న సతీమణి , కుమారుడు అజయ్ , బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ జిల్లా నాయకులు అనిల్, రాజేష్ , లక్ష్మి తదిరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి కాంగ్రెస్ ప్రభుత్వ భరోసా

ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి క్యాంప్ కార్యాలయంలో 300 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ - లబ్ధిదారులకు రూ. 88 లక్షల మేరకు ఆర్థిక చేయూత
చెక్కుల పంపిణీలో పాల్గొన్న డీసీసీ అధ్యక్షులు నూతి, మాజీ ఎమ్మెల్సీ బాలసాని, రాష్ట్ర మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జ్ దయాకర్ రెడ్డి, నగర అధ్యక్షులు దీపక్ చౌదరి

ఖమ్మం జులై 06(ప్రజా కలం న్యూస్)

ఖమ్మం ప్రైవేట్, కార్పొరేట్ హాస్పిటళ్లలో అత్యవసర వైద్య చికిత్సలు పొందిన పేదల పక్షాన కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా భరోసాగా నిలుస్తోందని కాంగ్రెస్ జిల్లా నాయకులు కొనియాడారు. ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి సిఫారసుతో మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను సోమవారం ఖమ్మంలోని గట్టయ్య సెంటర్ లో గల ఎంపీ క్యాంప్ కార్యాలయంలో లబ్ధిదారులకు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఖమ్మం క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు దీపక్ చౌదరి, తదితరులు హాజరై లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 300 మంది లబ్ధిదారులకు రూ. 88,78,600 మేరకు లబ్ధి చేకూరింది. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అన్ని వర్గాల సంక్షేమానికి, అభ్యున్నతికి విశేష కృషి జరుగుతోందని అన్నారు. ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి గారు ఎంతో శ్రద్ధ చూపి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా తన పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో.. ప్రజలకు ఆరోగ్య లబ్ధి చేకూరేలాగా ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు.

లబ్ధిదారులకు భోజన సదుపాయం

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పొందేందుకు వచ్చిన లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజన సదుపాయాన్ని ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి కల్పించారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు వడ్డేబోయిన నర్సింహారావు, నాయకులు కొప్పుల చంద్రశేఖర్, టీఎన్ఎస్ సభ్యులు ఉమ్మినేని కృష్ణ, ఇమామ్ భాయ్, సత్యనారాయణ రెడ్డి, నాయకులు కోసూరి శ్రీను, మల్లెల నాగేశ్వరరావు, ఓబీసీ రాష్ట్ర నేత హరికా నాయుడు, కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకులు కొర్లపాటి అన్నపూర్ణ, శ్రీ కళా రెడ్డి, పలువురు కాంగ్రెస్ పార్టీ అనుబంధ నాయకులు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గ్రామాల్లో యథేచ్ఛగా 'ఎక్స్పైరీ' ఆహార పదార్థాల అమ్మకాలు

-కనిపించని ఫుడ్ సేఫ్టీ అధికారులు

ప్రజా కలం జూలై 6 (గద్వాల ప్రతినిధి)

గ్రామీణ ప్రాంతాల్లోని కిరాణా దుకాణాలు, బేకరీలలో కాలం చెల్లిన (ఎక్స్పైరీ డేట్ దాటిన) ఆహార పదార్థాలు, వస్తువుల అమ్మకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. అధికారుల నిఘా కొరవడటం, గ్రామీణ ప్రాంత ప్రజలకు అవగాహన లేకపోవడంతో కొందరు వ్యాపారులు అమాయక ప్రజల, ముఖ్యంగా చిన్న పిల్లల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. తాజాగా జోగులాంబ గద్వాల జిల్లా కేటిదొడ్డి మండలం గంగన్పల్లి గ్రామంలోని ఒక కిరాణా దుకాణంలో కాలం చెల్లిన ఆహార పదార్థాలను విక్రయిస్తుండగా ఓ వినియోగదారుడు గమనించి నిలదీశారు. ప్రభుత్వ పాఠశాలకు అత్యంత సమీపంలో ఉన్న ఈ దుకాణంలో నిత్యం పాఠశాల విద్యార్థులు వివిధ కంపెనీల మసాలా రింగ్స్, చిప్స్, బిస్కెట్లు వంటి ఆహార పదార్థాలను కొనుగోలు చేసి తింటున్నారు. గడువు ముగిసిన ఇలాంటి పదార్థాలను తినడం వల్ల చిన్న పిల్లలు అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉందని స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గ్రామాల్లో ఇంత బహిరంగంగా కాలం చెల్లిన ఆహార పదార్థాలు విక్రయిస్తున్నా.. అటు రెవెన్యూ అధికారులు, ఇటు పంచాయతీ కార్యదర్శులు గానీ, పోలీస్ అధికారులు గానీ కనీసం తనిఖీలు చేసిన పాపాన పోలేదని మండల ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. అధికారుల ఉదాసీనత వల్లే వ్యాపారులు నిబంధనలను బేఖాతరు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు.గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్య రక్షణ దృష్ట్యా ఉన్నతాధికారులు స్పందించి, గ్రామాల్లోని కిరాణ దుకాణాలు, బేకరీ దుకాణాలలో తక్షణమే తనిఖీలు చేపట్టి కాలం చెల్లిన ఆహార పదార్థాలను విక్రయిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

స్వర్గీయ డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి ఘనంగా డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్ నివాళులు

ఖమ్మం జూన్ 06(ప్రజా కలం న్యూస్)

ఖమ్మం: సామాజిక న్యాయానికి, దళిత ఉద్యమానికి ప్రతీక అయిన స్వర్గీయ డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ గారి వర్ధంతి కార్యక్రమాన్ని వివిధ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులకు మాదిగ హక్కుల దండోరా టీఎంహెచ్డీ రాష్ట్ర అధ్యక్షులు, దళితరత్న డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "బాబు జగ్జీవన్ రామ్ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయం. దళితులు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలి" అని అన్నారు.

దేశంలో సామాజిక సమానత్వం సాధించేందుకు జగ్జీవన్ రామ్, ఆశయాలను కొనసాగించాల్సిన అవసరం ఉందని, యువత ఆయన జీవిత స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు, కుల సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని బాబు జగ్జీవన్ రామ్, గచిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన ఏర్పాట్లపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేసిన జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

- ముఖ్యమంత్రి బహిరంగ సభకు జిల్లా యంత్రాంగం పూర్తి సన్నద్ధం
- చింతకాని మండలంలో జగన్నాథపురం వద్ద సభా వేదిక, హెలిప్యాడ్, పార్కింగ్, భద్రతా ఏర్పాట్ల పై అధికారులకు దిశానిర్దేశం చేసిన జిల్లా కలెక్టర్

ఖమ్మం జూలై 06(ప్రజా కలం న్యూస్)

జిల్లాలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న ముఖ్యమంత్రి పర్యటన కోసం అన్ని శాఖలు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలోని చింతకాని మండలం జగన్నాథపురం(మత్కెపల్లి) వద్ద నిర్వహించనున్న బహిరంగ సభ కు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్న నేపథ్యంలో సభ ఏర్పాట్లను సోమవారం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జిల్లా కలెక్టర్, పోలీసు కమిషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి లతో కలిసి సభా ప్రాంగణం, హెలిప్యాడ్, వాహన పార్కింగ్ ప్రాంతాలు, ప్రజల రాకపోకలకు అనువైన మార్గాలు, భద్రతా ఏర్పాట్లను సమగ్రంగా పర్యవేక్షించి, ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం కోసం పకడ్బంది చర్యలపై వివిధ శాఖల అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ,జూన్ 30న భారీ బహిరంగ సభ నిర్వహించి రైతు భరోసా కార్యక్రమాన్ని ప్రారంభించాలని నిర్ణయించినప్పటికీ, అప్పటి భారీ వర్షాలు, వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో కార్యక్రమాన్ని వాయిదా వేయాల్సి వచ్చిందని కలెక్టర్ గుర్తుచేశారు. ఉప ముఖ్యమంత్రి సమక్షంలో జరిగిన సమీక్షలో కూడా వాతావరణ పరిస్థితులు అనుకూలించిన తర్వాత కొత్త తేదీని నిర్ణయిస్తామని వెల్లడించినట్లు తెలిపారు. వాతావరణ శాఖ జూలై 6వ తేదీ వరకు భారీ వర్షాల సూచనలు ఇచ్చిన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండి పరిస్థితులను నిరంతరం పరిశీలించిందన్నారు. అయితే ఊహించినంతగా వర్షాలు నమోదు కాకపోవడంతో సభ నిర్వహించాల్సిన ప్రాంగణాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి గ్రౌండ్ పరిస్థితులను అంచనా వేస్తున్నామని అన్నారు. ప్రస్తుతం సభా ప్రాంగణం దాదాపు పూర్తిగా ఎండిపోయి కార్యక్రమం నిర్వహించేందుకు అనుకూలంగా ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించామని తెలిపారు. ఈ మేరకు జిల్లా యంత్రాంగం చేసిన ఏర్పాట్లు, ప్రాంగణ పరిస్థితులు, ఇతర అంశాలపై వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి, ముఖ్యమంత్రి కార్యాలయానికి నివేదిక అందజేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు.ముఖ్యమంత్రి కార్యక్రమానికి సంబంధించిన తేదీని ప్రభుత్వం త్వరలో అధికారికంగా ఖరారు చేస్తుందని, తేదీ నిర్ణయమైన వెంటనే ప్రజలకు అధికారిక సమాచారం అందజేస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు. అప్పటివరకు అన్ని శాఖలు పూర్తి సన్నద్ధతతో ఉండి అవసరమైన ఏర్పాట్లను సిద్ధంగా ఉంచాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.సభకు భారీ సంఖ్యలో రైతులు, ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున అన్ని ఏర్పాట్లను ముందస్తుగా ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని మిగిలిన పనులు సభా వేదిక నిర్మాణం, హెలిప్యాడ్ ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్, ప్రజల కూర్చునే ఏర్పాట్లు, ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, అత్యవసర పరిస్థితుల్లో స్పందించే వ్యవస్థలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన అన్ని ప్రోటోకాల్ ఏర్పాట్లు నిబంధనలకు అనుగుణంగా ఉండేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. అలాగే సభకు హాజరయ్యే రైతులు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీటి సౌకర్యం, నిరంతర విద్యుత్ సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ, తాత్కాలిక మరుగుదొడ్లు, వైద్య శిబిరాలు, అంబులెన్స్ సేవలు, అగ్నిమాపక ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు, భద్రతా బందోబస్తు వంటి అంశాలను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్ర మంలో ఇంజినీరింగ్, రెవెన్యూ, పోలీసు, విద్యుత్, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

ప్రజావాణిలో ప్రజలు సమర్పించే దరఖాస్తులను సం బంధిత శాఖల అధికారులు సత్వరమే పరిశీలించి, పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజలు సమర్పించిన ప్రతి దరఖాస్తును సానుకూల దృక్పథంతో పరిశీలించి, అర్హత ఉన్న వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఖమ్మం అర్బన్ మండలం 15వ డివిజన్కు చెందిన సయ్యద్ రహమత్ బీ తాను అద్దె ఇంట్లో నివాసం ఉ ంటున్నానని, సొంత ఇంటి స్థలం కూడా లేదని, డబుల్ బెడ్రూమ్ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు సమర్పించగా, ఖమ్మం మున్సిపల్ కమీషనర్ కు పంపిస్తూ, నిబంధనల మేరకు పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. తిరుమలాయపాలెం మండలానికి చెందిన భానురేఖ టేకులపల్లి మహిళా ప్రాంగణంలో ఏఎన్ఎం కోర్సు పూర్తి చేసినప్పటికీ, ఏఎన్ఎం సర్టిఫికెట్ రిజిస్ట్రేషన్ విషయంలో అధికారులు స్పందించడం లేదని దరఖాస్తు సమర్పించగా, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారికి విచారించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. నేలకొండపల్లి మండలం రెవెన్యూ గ్రామానికి చెందిన లక్కం వెంకన్న, బక్కయ్య, శ్రీనివాస్ లు సర్వే నంబర్లు 993లో 23 గుంటలు, 616లో 15 గుంటలు, 1004లో 12 గుంటలు, 1005లో 12 గుంటల భూమి ఉందని, సాధా బైనామా కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ పాస్ పుస్తకాలు అందలేదని తెలపగా, సంబంధిత తహసీల్దార్కు పంపిస్తూ విచారించి నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.రఘునాథపాలెం మండలం మంచుకొండ గ్రామానికి చెందిన వంగర రమాదేవి తన కుమార్తెకు కళ్యాణలక్ష్మి పథకం కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ మంజూరు కాలేదని తెలపగా సంబంధిత తహసీల్దార్కు పంపిస్తూ అర్హత మేరకు పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, డిఆర్ఓ సిహెచ్ రామ్మూర్తి, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ కె. శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

కేశాపూర్ గ్రామపంచాయతీ

సందర్శించిన ఎంపీఓ

మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జులై 6 (ప్రజాకలం)

ఇబ్రహీంపట్నం మండలం కేశాపూర్ గ్రామపంచాయతీ ని ఎంపీఓ రాజేశ్వర్ రాజు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా నర్సరీ, కంపోస్టు షెడ్ ను పరిశీలించి. జీపీ రికార్డులు పరిశీలించారు.నర్సరీలో మొక్కలు సంరక్షించాలని, వర్షాకాలం దృశ్య గ్రామంలో పారిశుధ్య పనులు ఎప్పటికప్పుడు చేపట్టాలని, రికార్డులు సక్రమంగా మెయింటైన్ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి కే. రాణి తదితరులు ఉన్నారు.

వేదాద్రి కంచల ఎత్తిపోతల పథకం

పునరుద్ధరణ పనుల శంకుస్థాపన

పాల్గొన్న ఎంపి చిన్ని, మంత్రి నిమ్మల, ఎమ్మెల్యేలు

జగ్గయ్యపేట : వేదాద్రి కంచల ఎత్తిపోతల పథకం పునరుద్ధరణ పనుల శంకుస్థాపన కార్యక్రమంలో నిమ్మల రామానాయుడు, ఎంపీ కేశినేని చిన్ని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, ఎమ్మెల్యే శ్రీరామ్ తాతయ్య ఎన్టీఆర్ జిల్లా టిడిపి అధ్యక్షురాలు గద్దె అనురాధ పాల్గొన్నారు.ఎంపీ కేశినేని చిన్ని మాట్లాడుతూ రైతు సోదరులకు ఒక శుభ దినం తీసుకువచ్చి న మంత్రి రామ నాయుడు కి ధన్యవాదాలు. పలు దఫాలుగా సీఎం, మంత్రి ని కలిసి వేదాద్రి కంచల ఎత్తి పోతల పథక గురించి వివరించడం జరిగింది.. నేను ఎమ్మెల్యే సౌమ్య, , ఎమ్మెల్యే తాతయ్య కలిస్తే ఏమి చెయ్యగలమో చూస్తున్నారు. ముగ్గురం కలిసి కట్టుగా నిర్ణయించుకొని ఎంపీ నిధుల నుండి ఒక మోటార్ సిద్ధం చెయ్యాలి అని అనుకున్నాం. మోటారు పంపు సిద్ధం అయ్యే లోపే ట్రాన్స్ఫార్మర్ దెబ్బతింది.33 లక్షల ఎంపీ నిధులతో మోటార్ పంపు పనులు పునరుద్ధరణ చేసుకోవడం ఆనందం గా వుంది. పోలనీపల్లి ప్రాజెక్ట్ పనులు కూడా త్వరలోనే ప్రారంభిస్తానీ. నందిగామ లో ఆయుష్ హాస్పిటల్ కి త్వరలో శంకుస్థాపన చేయబోతున్నాం. త్వరలో అనేక పరిశ్రమలు జగ్గయ్యపేట నందిగామ పరిధిలో రాబోతున్నాయి. ఈ మంచి ప్రభుత్వం వల్ల ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నాం. ఈ స్కీం పేరు చెప్పగానే గుర్తొచ్చేది దేవినేని రమణ, మరియు దేవినేని ఉమా. ఈ స్కీం కి 15 కోట్లు సాంక్షన్ చేసిన సీఎం చంద్రబాబు కి ధన్యవాదాలు. గత ప్రభుత్వం ప్రాజెక్టులు అన్నిటిని పక్కన పడేసింది, నందిగామ జగ్గయ్యపేట ప్రాంతాల్లో త్వరలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టబోతున్నామని అన్నారు.

బాబూ జగ్జీవన్ రామ్ కు భారతరత్న ప్రకటించాలి .

తెలంగాణోద్యమ కవి, రచయిత డప్పోల్ల రమేష్

సంగారెడ్డి ప్రతినిధి జులై 06(ప్రజా కలం):

'బాబూ జగ్జీవన్ రామ్ సమతా సంఘం' ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లా కేంద్రంలో గల సమతాస్టల్ నందు సోమవారం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం తెలంగాణోద్యమ కవి, రచయిత మరియు సంఘం గౌరవాధ్యక్షులు డప్పోల్ల రమేష్, సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. వేణుగోపాల్ మాట్లాడారు. డా. బాబూ జగ్జీవన్ రామ్ గారికి భారతరత్న ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. భారతదేశ మేటి స్వాతంత్ర సమరయోధుడుగా జగ్జీవన్ రామ్ కీర్తి మహోన్నతమైనదని కొనియాడారు. నెహ్రూ తాత్కాలిక ప్రభుత్వం మొదలుకొని స్వాతంత్రానంతర భారత రాజకీయాలలో ఎక్కువ కాలం కేంద్ర మంత్రిగా పనిచేసిన జగ్జీవన్ రామ్ సేవలు మరువలేనివి అని అన్నారు. భారత ఉప ప్రధానిగా దేశ చరిత్రలో చెరగని ముద్ర వేశారన్నారు. బాబూ జగ్జీవన్ రామ్ తీసుకొచ్చిన అనేక చట్టాలు, పాలనా నంస్కరణలు ఈనాటికి అమలవుతుండడం ఆయన పరిపాలనాదక్షతకు నిదర్శనం అన్నారు. బాబూ జగ్జీవన్ రామ్ భారతీయ సామాజిక దార్శనికుడుగా సమ సమాజం కోసం ఎంతో కృషి చేసిన సమతా వాది అని కొనియాడారు. సమాజంలో గల అసమానతలు పోయి భారతదేశం అభివృద్ధి చెందాలని కలలు కన్నాడని అన్నారు. కుల నిర్మూలన ఈ దేశ అభివృద్ధికి దోహదపడే అంశమని చాటిచెప్పిన మహనీయుడు అని అన్నారు. రిజర్వేషన్ల పరిరక్షకుడుగా జగ్జీవన్ రామ్ ఇచ్చిన స్ఫూర్తి యావద్దేశం అనుసరించటగినదని అన్నారు. భారత రాజ్యాంగ రూపకల్పనకు వేసిన అనేక కమిటీలలో ప్రధాన సభ్యునిగా తన పాత్రను క్రియాశీలకంగా నిర్వర్తించారని అన్నారు.

దేశాన్ని అభివృద్ధి పథంలో నడవడానికి జగ్జీవన్ రామ్ పాటుపడినంతగా మరే ఇతర నేత పాటుపడలేదని అన్నారు. భారతీయ సమాజాన్ని స్వాతంత్రం కంటే ముందు స్వాతంత్రం అనంతరం నడిపించడంలో జగ్జీవన్ రామ్ పాత్ర ఎనలేనిదని కొనియాడారు. ఈ కార్యక్రమం బాబూ జగ్జీవన్ రామ్ సమతా సంఘం సలహాదారులు జనార్ధన్ ఉపాధ్యక్షులు ఆనంద్ రావు, నాయకులు దయాకర్, ఎమ్మెస్సెఫ్ జాతీయ నాయకులు సంగమేశ్, దళిత నాయకులు రవినాథ్, నాగరాజు బహుజనసేన జిల్లా అధ్యక్షులు అనిల్ బౌద్ధ్, మోచి సంఘం నాయకులు సీతారామ్, దుర్గరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్ అర్బప్ యస్ 32 వ దినోత్సవాన్ని

ఘనంగా నిర్వహించాలి

వర్ధన్నపేటలో ఘనంగా మంద కృష్ణ మాదిగ జన్మదిన వేడుకలకి ప్రతి ఒక్కరు హాజరు కావాలి

ప్రతి గ్రామంలో ఎమ్ ఆర్ పి యస్ జెండా ఆవిష్కరణకు పిలుపు మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో ప్రధాన కార్యక్రమం

జూలై 6 ప్రజాకలం ప్రతినిది:వరంగల్ /వర్ధన్నపేట) జూలై 7,



మంగళవారం రోజున పద్మశ్రీ అవార్డు గ్రహీత మంద కృష్ణ మాదిగ జన్మదిన వేడుకలతో పాటు ఎమ్ ఆర్ పి యస్ (మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి) 32వ ఆవిర్భావ దినోత్సవాన్ని వర్ధన్నపేట మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించను న్నట్లు ఎమ్ అర్బప్ యస్ , ఎమ్ యస్ పి మండల నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని ప్రతి గ్రామం, ప్రతి బస్తీలో ఎమ్ ఆర్ పి యస్ జెండాను ఆవిష్కరించాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లోని రాజకీయ నాయకులు, ప్రభుత్వ ఉద్యోగులు, మేధావులు, కార్మికులు, రైతులు, విద్యార్థులు, యువతతో పాటు గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.గ్రామాల్లో జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు పూర్తి చేసిన అనంతరం వర్ధన్నపేట మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద నిర్వహించే ప్రధాన కార్యక్రమంలో ఎమ్ ఆర్ పి యస్ జెండా ఆవిష్కరణ జరగనుంది. మండలంలోని అన్ని గ్రామాల అధ్యక్షులు, దళిత సంఘాల నాయకులు, పెద్దలు తప్పనిసరిగా హాజరుకావాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.ఈ మేరకు ఎమ్ ఎమ్ అర్బప్ యస్ --ఎమ్ యస్ పి వర్ధన్నపేట మండల కమిటీ, మండల ఇన్‌చార్జి జిల్లా ధర్మయ్య మాదిగ, ఎమ్ యస్ పి మండల అధ్యక్షుడు ముత్యాల మల్లేశం మాదిగ, ఎమ్ ఆర్ పి యస్ మండల ఉపాధ్యక్షుడు చాడ కర్ణాకర్ మాదిగ సంయుక్తంగా పిలుపునిచ్చారు.

టీడీపీ నేత బిక్ష నాయక్‌కు

చాడ మరియా సురేఖ నివాళి

– అన్నారం పెద్ద తండలో కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం వ్యక్తం

జూలై 6 ప్రజాకలం ప్రతినిధి: (వరంగల్ /పర్వతగిరి) వరంగల్ జిల్లా వర్ధన్నపేట నియోజకవర్గంలోని పర్వతగిరి మండలం అన్నారం పెద్ద తండకు చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, ఎస్టీ సెల్ రాష్ట్ర నాయకుడు నునావత్ బిక్ష నాయక్ ఆకస్మిక మరణం పట్ల వర్ధన్నపేట నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ చాడ మరియా సురేఖ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన స్వగృహానికి వెళ్లి బిక్ష నాయక్ భౌతికకాయానికి పార్టీ జెండా కప్పి, పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిక్ష నాయక్ తెలుగుదేశం పార్టీలో ఎస్టీ సెల్ రాష్ట్ర స్థాయిలో సమర్థవంతంగా పనిచేసి, ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండేవారని కొనియాడారు. తన ప్రత్యేక శైలితో ప్రజల్లో మంచి గుర్తింపు సంపాదించుకున్న నాయకుడిగా ఆయన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పర్వతగిరి మండల పార్టీ అధ్యక్షుడు గొల్లపెల్లి మహేందర్, జనగామ లక్ష్మణ్, రామసాని కృష్ణ, ఆకుల యాకయ్యతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్టీ వీడే ఆలోచనలో మాజీ మంత్రి ?

పార్టీ మారితే మరిచిపోతారని వ్యాఖ్యలు
కోడలు కొడుకు రాజకీయ అరంగ్రేటమే కారణం?

హైదరాబాద్,
జూలై 6 ప్రజాకలం ప్రతినిధి

పాలమ్మిన, పూలమ్మిన, కాలేజీలు పెట్టినా.. రాజకీయాలు చేసినా ఆయన తీరు వేరు. ఆయన మాటలు, పనులు అందరిని తన వైపుకు తిప్పుకుని ఆకర్శిస్తారు. ఆయన ఉంటే సందడి, ఉత్సహం..ఆయన మాట్లాడితే ఆసక్తి, రాజకీయాల్లో అలజడి. ఆ నేత చేసిన వ్యాఖ్యలు తాజాగా రాజకీయంగా అలజడికి దారి తీసాయి..

మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి రాజకీయ అడుగుల పై గత కొన్ని రోజులుగా జోరుగా సాగుతున్న ప్రచారానికి ఆయన చేసిన తాజా వ్యాఖ్యలు మరింత ఊతమిస్తున్నాయి. ఇటీవల ఓ ముఖ్య నేత పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న మల్లారెడ్డి, నేను బీఆర్ఎస్ పార్టీకి దూరం కాగానే నన్ను మరిచిపోతున్నారు.. అంటూ చేసిన ఆసక్తికర వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తిగా మారాయి. ఈ వ్యాఖ్యలతో ఆయన త్వరలోనే గులాబీ జెండాను వీడబోతున్నారనే సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని తెలుస్తుంది.గత కొంతకాలంగా పార్టీ ప్రధాన కార్యక్రమాలకు, తెలంగాణ భవన్‌కు దూరంగా ఉంటున్న మల్లారెడ్డి, కేవలం తన సొంత నియోజకవర్గానికే పరిమితమై పర్యటనలు సాగిస్తుండటం ఈ ఊహాగానాలకు బలం చేకూరుస్తోంది.తనదైన విలక్షణ శైలి మాటలతో, వినోదాత్మక చేష్టలతో మాస్ లీడర్‌గా తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న మల్లారెడ్డి తో పాటు ఆయన కుటుంబం చుట్టూ రాజకీయాలు సాగుతున్నాయి.మల్లారెడ్డి కోడలు డాక్టర్ ప్రీతి రెడ్డి రాబోయే రోజుల్లో భారతీయ జనతా పార్టీ తరపున ఎంపీగా పోటీ చేస్తారనే వార్తలు పెద్ద ఎత్తున వినిపిస్తున్న ప్పటికీ, ఇప్పటివరకు ఆమె గానీ, కుటుంబ సభ్యులు గానీ దీనిపై ఎలాంటి వివరణ ఇవ్వలేదు. మరోవైపు మల్లారెడ్డి కుమారుడు సైతం మేడ్చల్ లేదా మల్కాజ్‌గిరి స్థానాల నుండి ఎన్నికల బరిలోకి దిగుతారనే

ప్రచారం సాగుతోంది. ఒకే కుటుంబం నుంచి వలువురు రాజకీయాల్లోకి రావడం, అది కూడా వేర్వేరు పార్టీల వైపు మొగ్గు చూపుతుండటం ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. వ్యాపారవేత్తగా ఎదిగి రాజకీయాల్లోకి.. వ్యాపారవేత్తగా, విద్యాసంస్థల అధినేతగా ఉన్న మల్లారెడ్డి 2014 సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తరపున మల్కాజిగిరి లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసి భారీ మెజారిటీతో గెలిచి ఎన్నికయ్యారు.ఆ తరువాత రాష్ట్రము లో వచ్చిన రాజకీయ పరిణామాలు, తెలంగాణ ఉద్యమం ప్రత్యేక రాష్ట్రము ఏర్పాటు కావడంతో ఆయన టీడీపీ ని వీడాల్సి వచ్చింది. తెలంగాణ రాష్ట్రంలో రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఆనాటి అధికార తెలంగాణ రాష్ట్ర సమితి (ప్రస్తుత భారత రాష్ట్ర సమితి - బీఆర్ఎస్) పార్టీలో చేరారు. 2018 తెలంగాణ ముందస్తు ఎన్నికల్లో మేడ్చల్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా ఎమ్మెల్యేగా గెలుపొందారు. కేసీఆర్ మంత్రివర్గంలో కార్మిక, ఉపాధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి మేడ్చల్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించారు.నాటి నుంచి నేటి వరకు బీఆర్ఎస్ లో కొనసాగిన ఆయన రాజకీయ ప్రస్థానం, ముగియనున్నట్లు ఆయనే స్వయంగా చెప్పడంతో మరోసారి ఆయన అనూహ్యంగా తెరమీదికి వచ్చారు. పార్టీ మారేందుకు ఇదే సమయమా.. ఎన్నికలు లేకున్నా పార్టీ మారుతారా? ప్రస్తుతానికి రాష్ట్రంలో ఎలాంటి ఎన్నికలు లేకపోయి నప్పటికీ, మల్లారెడ్డి పార్టీ మారాల్సిన అవసరం ఏముందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

కేవలం పదవుల కోసం ఆరాటపడే వ్యక్తిత్వం కాకుండా, ప్రజల మధ్య సరదాగా గడపడమే లక్ష్యంగా భావించే మల్లారెడ్డి, భవిష్యత్తు రాజకీయ రక్షణ కోసం కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ వైపు చూస్తున్నారనే టాక్ బలంగా నడుస్తోంది. రాష్ట్రంలో అధికార పార్టీని గట్టిగా ఎదుర్కోవడానికి బీజేపీ సరైన వేదిక అని ఆయన భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతున్నప్పటికీ, క్రమశిక్షణకు మారుపేరైన బీజేపీ, ఆరెస్సెస్ సిద్ధాంతాలకు మల్లారెడ్డి స్వేచ్ఛాయుత శైలి సరిపోతుందా లేదా అన్నది పెద్ద ప్రశ్నగా మారింది. నిబంధనల నడుమ రాజకీయం చేయడం ఆయనకు ఇబ్బందికరంగా మారే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో, మల్లారెడ్డి తీసుకోబోయే తుది నిర్ణయంపైనే అందరి దృష్టి నెలకొంది.

సాంఘిక సంక్షేమ గురుకులాల్లో ఇంటర్ స్పాట్ అడ్మిషన్లు

– జూలై 6న రాయపర్తిలో స్పాట్ కౌన్సిలింగ్
– మిగిలిన సీట్ల భర్తీకి అర్హులైన విద్యార్థులకు అవకాశం

జూలై 6 ప్రజాకలం ప్రతినిధి: (వరంగల్ /రాయపర్తి) తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలల్లో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి మిగిలి ఉన్న ఇంటర్మీడియట్ సీట్ల భర్తీ కోసం అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సమన్వయకర్త సముద్రాల సరిత తెలిపారు.రాయపర్తి, పర్వతగిరి, దుగ్గొండి బాలికల గురుకుల జూనియర్ కళాశాలల్లో బైపీసీ, ఎంపీసీ గ్రూపులతో పాటు నర్సంపేట బాలుర గురుకుల జూనియర్ కళాశాలలో సీఈసీ, హెచ్ఈసీ గ్రూపుల్లో ఖాళీగా ఉన్న సీట్లను స్పాట్ కౌన్సిలింగ్ ద్వారా భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు.ఈ మేరకు జూలై 6, సోమవారం ఉదయం రాయపర్తిలోని టీజీఎస్‌డబ్ల్యూఆర్ జూనియర్ కళాశాల (బాలికలు)లో స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. 2026 మార్చి లేదా ఏప్రిల్‌లో నిర్వహించిన ఎస్ఏసీసీ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు మాత్రమే కౌన్సిలింగ్‌కు అర్హులని పేర్కొన్నారు.రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మాత్రమే,నిర్వహించబడుతుందని, ఆ తర్వాత వచ్చే వారికి ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఉండదని స్పష్టం చేశారు. స్పాట్ కౌన్సిలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు మార్కుల మెమో, ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్ (టీసీ), స్టడీ/బోనాఫైడ్ సర్టిఫికెట్, కుల ధృవీకరణ పత్రం, ఆదాయ ధృవీకరణ పత్రం తదితర అన్ని ఒరిజినల్ ధృవపత్రాలను తప్పనిసరిగా వెంట తీసుకురావాలని సూచించారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సమన్వయకర్త సముద్రాల సరిత కోరారు.

హెచ్ఎండిఏ ఆధ్వర్యంలో రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

శంషాబాద్, జులై 06,(ప్రజా కలం)

హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండిఏ) ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని శంషాబాద్ మండలంలో సిసి (సీసీ) మరియు బిటి (బి టి) రోడ్ల నిర్మాణ పనులకు ఈరోజు ఘనంగా శంకుస్థాపన జరిగింది. సుమారు రూ. 7.50 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఈ పనులకు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శంకుస్థాపన చేశారు.కాచారం, చౌదర్ గూడా మరియు పాల్మకుల్ గ్రామాలలో చేపట్టనున్న సిసి రోడ్లు, బీటీ రోడ్ల పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామ సర్పంచులు ప్రజాప్రతినిధులు హెచ్ఎండిఏ అధికారులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకుల్లో తెచ్చి.. పంటకు ప్రాణం పోస్తూ..

తాండూరు : గత నెల రోజులుగా వరుణుడు కరుణించకపోవడంతో వానకాలంలో కంది, పత్తి పంటలు విత్తుకున్న రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. సాగు చేసిన పంటలను రక్షించుకునేందుకు వాహనాల్లో ట్యాంకులు పెట్టి పైపుల ద్వారా నీరు అందిస్తున్నారు. వికారాబాద్ జిల్లా తాం డూరు నియోజకవర్గంలోని తాండూరు, పెద్దేముల్, యాలాల, బషీరాబాద్ మండలాల్లో దాదాపు రెండు లక్షల ఎకరాల మెట్ట భూములుండగా అందులో 90 శాతం రైతులు పంటలు విత్తు కున్నారు. పైర్లు మొలక దశలోనే ఎండిపోతుండగా మరికొన్ని ప్రాంతాల్లో అసలు మొక్కలే మొలవడం లేదని రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ పరిస్థితిలో యాలాల మండ లంలోని చెన్నారం గ్రామానికి చెందిన అచ్చయ్య అనే రైతు తాను సాగు చేసిన పత్తి పంటను రక్షించుకునేందుకు కుటుంబ సభ్యులతో కలిసి వాహనం లో ట్యాంకు పెట్టి పైపు ద్వారా పత్తి మొక్కలకు అం దిస్తున్నారు. ఇప్పటికే నాలు గుసార్లు పంటకు నీరు అందించినట్టు చెప్పారు. నియోజకవర్గంలో పలు గ్రా మాల్లోనూ ప్రధాన పం టల పరిస్థితి ఇలాగే ఉందని పలు వురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ ప్రారంభం

డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పట్టాల పంపిణీ.

సిద్దిపేట ప్రజాకలం జూలై 06:

సిద్దిపేట జిల్లా ములుగు మండల కేంద్రంలోని కేఎన్ఆర్ గార్డెన్స్‌లో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లాలో రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పట్టాలను లబ్ధిదారులకు అందజేశారు.

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆశీర్వాదాలతో ఏర్పడిన ప్రభుత్వం ఆర్థిక సవాళ్లు ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మొదటి విడతలో రాష్ట్రవ్యాప్తంగా 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసి, ప్రతి నియోజకవర్గానికి 3,500 చొప్పున కేటాయించామని తెలిపారు. ఇప్పటికే 1.30 లక్షల గృహప్రవేశాలు పూర్తయ్యాయని, మరో 80 వేల ఇండ్ల గృహ ప్రవేశానికి సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. కులం, మతం కాకుండా పేదరికాన్ని ప్రామాణికంగా తీసుకుని ఇండ్లను మంజూరు చేశామని, లబ్ధిదారుల పేరున నేరుగా నిధులు విడుదల చేస్తున్నామని పేర్కొన్నారు. అసంపూర్తిగా ఉన్న పాత గృహాల నిర్మాణాలను కూడా పూర్తి చేస్తామని, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఉచితంగా ఇసుకను అందజేస్తామని వెల్లడించారు. మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబానికి సొంత ఇంటి కలను నెరవేర్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తోందన్నారు. రెండో విడతలో ప్రతి నియోజకవర్గానికి 2,000 ఇండ్లను మంజూరు చేస్తామని తెలిపారు. ఇసుక యాప్ ద్వారా ఉచిత ఇసుక సరఫరా చేస్తామని, అవసరమైన ప్రాంతాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. నాణ్యమైన విద్య కోసం 50 వేల ఉపాధ్యాయుల నియామకం చేపట్టామని, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరి మితిని రూ. 10 లక్షలకు పెంచామని, కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేశామని, త్వరలో కొత్త పింఛన్లు కూడా అందజేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె. హైమావతి, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, గృహ నిర్మాణశాఖ రాష్ట్ర ఎండీ వి.పీ. గౌతమ్, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దరిపెల్లి చంద్రం, గజ్వేల్ ఆర్డీవో చంద్రకళ, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రూ.20 లక్షల నిధులతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేసిన మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

మహేశ్వరం, జులై 06, (ప్రజా కలం)

మహేశ్వరం నియోజకవర్గం, బడంగ్‌పేట్ కార్పొరేషన్, నాదర్‌గుల్ 57వ డివిజన్ పరిధిలోని గుర్రంగూడ ఆదిత్య నగర్ కాలనీ (ఫేస్ -3)లో రూ.20 లక్షల నిధులతో చేపట్టనున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి. సబితా ఇంద్రారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా

ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ, రేవంత్ రెడ్డి ప్రభుత్వం మహేశ్వరం నియోజకవర్గంపై కక్షసాధింపు ధోరణితో వ్యవహరిస్తూ అభివృద్ధి పనులను అడ్డుకుంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు అవసరమైన కనీస మౌలిక సదుపాయాల కల్పనలో కూడా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు.

అలాగే, మాజీ ముఖ్యమంత్రి శ్రీ కేసీఆర్ హయాంలో స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద ప్రతి కార్పొరేషన్‌కు రూ.50 కోట్ల నిధులు, మున్సిపాలిటీలకు 25 కోట్ల చొప్పున కేటాయించి, సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, మంచినీటి సరఫరా వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేశారని గుర్తు చేశారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే అట్టి నిధులు నిలిపివేశారని ప్రస్తుతం ఆ నిధులను విడుదల చేయకుండా నిలిపివేయడం వల్ల కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. మహేశ్వరం నియోజకవర్గ అభివృద్ధిని అడ్డుకోవడం మానుకుని, ఆనాడు మంజూరైన స్పెషల్ డెవలప్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేసి, పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి సరఫరా తదితర అభివృద్ధి పనులను పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు గుర్రం సాయికిరణ్ రెడ్డి, ముత్యం రెడ్డి, రామిడి రామిరెడ్డి, సత్తిరెడ్డి పార్టీ నాయకులు, మహిళా నాయకురాళ్లు , కార్యకర్తలు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి

మల్కాజిగిరి,జూలై06(ప్రజా కలం ప్రతినిధి)

డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి వేడుకలు మల్కాజిగిరి

గౌతమ్ నగర్ వాణి నగర్ లో సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు అనంతరం బిజెపి పార్టీ జెండాను ఆవిష్కరించారు. జాతీయ ఐక్యత, విద్యాభివృద్ధి, ప్రజాసేవ అనే ఉన్నత ఆదర్శాలకు తన జీవితం అంకితం చేసిన వ్యక్తి అని వారి యొక్క సేవలను గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు లక్ష్మణ్, శ్రీనివాస్,గణేష్,ఆనంద్, మాశెట్టి శ్రీనివాస్,వెంకట కిషోర్,అమర్నాథ్,రాజేష్, ప్రకాష్,బలరాం,నరసింహ, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నేను సైతం కార్యక్రమంలో సీసీ కెమెరాలను ప్రారంభించిన సీపీ సుమతి ఐపీఎస్

మల్కాజిగిరి,జూలై 6 (ప్రజా కలం ప్రతినిధి)

నేను సైతం 2.0లో భాగంగా పోలీస్ స్టేషన్ పరిధిలోని వాయుపురి రీ క్రియేషన్ సెంటర్ లో 63 కమ్యూనిటీ కెమెరాలను, బృందావన్ కాలనీలో 21 కెమెరాలను మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి ఐపీఎస్ సోమవారం రాత్రి

ప్రారంభించారు. నేను సైతం కార్యక్రమంలో భాగంగా కమిషనరేట్ పరిధిలోని పలు కాలనీలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని సీసీ కెమెరాలు యొక్క ఉపయోగాలు వాటిని అమర్చుకోవడం వల్ల కలిగే లాభాలు ఏమిటని సిపి స్థానికులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి డిసిపి సిహెచ్ శ్రీధర్ ఐపీఎస్,మల్కాజిగిరి ఏసీపీ యాదగిరి రెడ్డి, నేరేడ్మెట్ ఎస్ హెచ్ ఓ ఏ వెంకటయ్య,స్థానిక కాలనీ వాసులు,పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భానుక నర్మద వెంటనే తన పదవికి రాజీనామా చేయాలి

సికింద్రాబాద్ :కంటోన్మెంట్ ప్రాంతంలో ఆక్రమణలకు పాల్పడియధేచ్ఛగా నామినేటెడ్ సభ్యురాలుగా కొనసాగుతున్న భానుక నర్మద వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని, ఆ హోదాలో కొనసాగేందుకు ఆమె పూర్తిగా అనర్హురాలని బిఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్ స్పష్టం చేశారు. తాడు బండ్ రత్న కో-ఆపరేటివ్ సొసైటీలో కంటోన్మెంట్ కు కేటాయించిన 40 శాతం భూభాగంలో వారు నిర్మాణం చేశారని, కంటోన్మెంట్ వాళ్లు కూల్చి అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రతిసారి కోర్టును ఆశ్రయించి స్టేటస్ కో తెచ్చుకొని కాలయాపన చేస్తున్నట్లు తెలిపారు. కంటోన్మెంట్ చట్టం 2006 లోని సెక్షన్ 34 ప్రకారం తక్షణమే కంటోన్మెంట్ బోర్డు సీఈవో, బోర్డు నామినేటెడ్ సభ్యురాలిని తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మన్నే క్రిశాంక్ మీడియాతో మాట్లాడుతూ... బోర్డు నామినేటెడ్ సభ్యురాలి భర్త భానుక మల్లికార్జున్ కంటోన్మెంట్ భూమిని ఆక్రమించి అతిథి గృహం నిర్మించుకున్న నేపథ్యంలో గత కొన్ని సంవత్సరాలుగా కోర్టు నుండి నోటీసులు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. భానుక నర్మదకు పదవి కావాలో లేదా తన అతిథి గృహం కావాలో తేల్చుకోవాలన్నారు. భానుక నర్మదా నైతిక బాధ్యత వహించి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆమె నామినేటెడ్ సభ్యురాలుగా కొనసాగడం సిగ్గుచేటని ఆమె రాజీనామా చేసినా లేదా ఆమెను కంటోన్మెంట్ బోర్డు అనర్హురాలిగా ప్రకటించినా ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించే ఎన్నికలు వచ్చే అవకాశం ఉందని అన్నారు. కంటోన్మెంట్ ప్రాంతంలో పేదలకు ఒకరకంగా భాజపా నాయకులకు మరొక రకంగా న్యాయం ఉండకూడదని వెల్లడించారు.

బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకం విద్యార్థుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి: మంత్రి వివేక్‌కు ప్రజా సంఘాల వినతి



సిద్దిపేట:06 జూలై

(ప్రజా కలం ప్రతినిధి)

బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకం కింద ఎంపికైన విద్యార్థులకు ఎదురవుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రజా సంఘాల ప్రతినిధులు రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన,గనుల శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి,మెదక్ పార్లమెంట్ సభ్యుడు మాధవనేని రఘునందన్ రావును కలిసి వినతిపత్రం సమర్పించారు.సిద్దిపేట జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంపిక ప్రక్రియలో అర్హత సాధించిన కొంతమంది విద్యార్థుల వివరాలు ఇప్పటికీ ఆన్‌లైన్‌లో నమోదు కాలేదని తెలిపారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఈ పరిస్థితి నెలకొందని ఆరోపించారు.

విద్యార్థుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు కాకపోవడంతో ఆయా పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని పేర్కొన్నారు.ఇప్పటికే కలెక్టర్ నిర్వహించిన డ్రాలో ఎంపికైన విద్యార్థులందరికీ న్యాయం జరిగేలా వెంటనే ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేయాలని కోరారు. వినతి పై స్పందించిన మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి,మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు సంబంధిత సమస్యను వెంటనే పరిష్కరించాలని జిల్లా అధికారులకు సూచించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ అవార్డు గ్రహీత, మాల సంఘాల జేఏసీ వైస్ చైర్మన్ తుమ్మ శ్రీనివాస్,దళిత రత్న అవార్డు గ్రహీత,తెలంగాణ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొన్నాల కుమార్ మాదిగ,దళిత సంఘాల ఐకాస రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చివ్వల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

మనమెంతో మనకంత అని టీఆర్ఎస్ నినాదం

- బీసీలకు 50 రిజర్వేషన్ ఇవ్వాలని కవిత డిమాండ్

- జయశంకర్ సార్ జన్మదినం రోజున,బహిరంగ సభ

హైదరాబాద్,

జూలై 6 ప్రజా కలం ప్రతినిధి

సామాజిక న్యాయం, బీసీ నినాదంతో పార్టీని ప్రారంభించిన కల్వకుంట్ల కవిత మరోసారి ఎత్తుగడతో ప్రజలకు దగ్గర కానుంది. ఇప్పటికే ఉద్యమకారులు, అమరుల కోసం బహిరంగ సభను ఏర్పాటు చేసి అరెస్టై పోలీసు స్టేషన్ కు వెల్లిన ఆమె మరోసారి బీసీల కోసం యుద్దానికి సిద్దమైంది. రాష్ట్రంలో బీసీలు అధిక సంఖ్యలో ఉన్నారని లెక్కలు చెప్పిన వారికి ఎన్నికల్లో 50శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీ నినాదంతో ముందుకు వచ్చిన తెలంగాణ రక్షణ సేన వారి హక్కుల కోసం పోరాటం చేసేందుకు సిద్దమైంది. అందులో భాగంగా బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు సాధించేందుకు ఆగస్టు 6న హైదరాబాద్ లో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షులు కల్వకుంట్ల కవిత తెలిపారు. సోమవారం బంజారాహిల్స్ లోని టీఆర్ఎస్ ఆఫీస్ లో నిర్వహించిన పార్టీ బీసీ నాయకుల సమావేశంలో ఆమె మాట్లాడారు...ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి సందర్భంగా బీసీలకు 50 శాతం రిజర్వేషన్ల సాధన కోసం సంకల్పం తీసుకునట్లు స్పష్టం చేశారు. సామాజిక న్యాయ తెలంగాణ సాధన సభ పేరుతో బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. బీసీలతో పాటు సమాజంలోని అన్ని వర్గాల వారిని ఒక్కతాటిపైకి తీసువచ్చి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచుతామన్నారు. మొదట భౌగోళిక తెలంగాణ సాధించుకుని, తర్వాత సామాజిక న్యాయ తెలంగాణ సాధన కోసం పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అందుకు ప్రొఫెసర్ జయశంకర్ ఆదర్శమని, ఆయన చూపిన మార్గంలో అడుగులు వేస్తూ..50 శాతం బీసీ రిజర్వేషన్ల సాధన కోసం పోరాటం చేవట్టినట్లు వెల్లడించారు. జనాభా దామాషా ప్రకారం బీసీ రిజర్వేషన్ల సాధన కోసం తెలంగాణ జాగృతి, టీఆర్ఎస్ రెండేళ్లుగా ప్రజాక్షేత్రంలో పని చేస్తున్నట్లు అమె గుర్తు చేశారు.

దేశ రాజకీయాల్లో నూతన శకం

బీసీల కోసం 50 శాతం రిజర్వేషన్ల పేరుతో ఆగస్టు 6 న హైదరాబాద్ లో నిర్వహించే సభ దేశంలో రాజకీయ పరిస్థితులను మార్చేస్తుందని కవిత ధీమా వ్యక్తం చేశారు. తమిళనాడులోని స్కూళ్లలో ఎన్టీఆర్ ప్రారంభించిన మధ్యాహ్న భోజన పథకాన్ని ఇప్పుడు దేశవ్యాప్తంగా అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. బీసీలకు 50 శాతం రిజర్వేషన్ల సాధన కోసం చేసే ఉద్యమం ఆ సభ దిక్సూచీగా నిలుస్తుందన్నారు. ఆగస్టు 6 జయశంకర్ సార్ జయంతిని టీఆర్ఎస్ పార్టీ సామాజిక న్యాయ తెలంగాణ దినోత్సవంగా నిర్వహిస్తుందని తెలిపారు. తాము చేసిన ఉద్యమాలకు తలొగ్గి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించేలా రెండు వేర్వేరు బిల్లులు అసెంబ్లీ, కౌన్సిల్ లో పాస్ చేసి కేంద్రానికి పంపిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆ బిల్లులకు ఆమోదం తెలిపేలా రాష్ట్ర ప్రభుత్వం నుంచి కనీస ప్రయత్నాలు కూడా చేయడం లేదని అమె మండిపడ్డారు. మనమెంతో మనకంత అనే నినాదం సాకారం కావాలంటే అన్ని వర్గాలను కలుపుకొని 50 శాతం రిజర్వేషన్ల సాధన కోసం ఐక్య ఉద్యమాలు చేయాల్సిన సమయం ఆసన్నమైందని ప్రజలకు పిలుపునిచ్చారు.

ఎస్ఐఆర్ కార్యక్రమ విజయవంతానికి రాజకీయ పార్టీలు సహకరించాలి

- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్.

సంగారెడ్డి, ప్రతినిధి జూలై 6:(ప్రజా కలం): చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి, పారదర్శకమైన, తప్పులులేని ఓటరు జాబితాను రూపొందించేందుకు అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ కోరారు. సోమవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు సంగీత, పాండులతో కలిసి గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్ఐఆర్ కార్యక్రమంపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఇప్పటివరకు 94 శాతం ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ

పూర్తయిందని, గ్రామీణ ప్రాంతాల్లో ప్రక్రియ వేగంగా కొనసాగు తుండగా, పట్టణ ప్రాంతాల్లో కూడా మరింత వేగవంతం చేసేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. ఈ నెల 24వ తేదీలోపు ఎన్యుమరేషన్ ఫారాల పంపిణి,సేకరణ, డిజిటైజేషన్ ప్రక్రియను పూర్తిచేసేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేసి, ఫారాల నింపడంలో సహాయం చేయడంతో పాటు, స్వీకరించిన ఫారాలను వెంటనే డిజిటైజ్ చేసేలా ప్రణాళిక చేస్తున్నామన్నారు. రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లను చురుకుగా వినియోగించుకోవాలని, ఓటర్లకు అవగాహన కల్పించి కార్యక్రమం విజయవంతానికి సహకరించాలని కలెక్టర్ సూచించారు. అలాగే, ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ, డిజిటైజేషన్ ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీల నుంచి అవసరమైన సూచనలు, సలహాలు స్వాగతిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు సంగీత, పాండు, ఈఆర్‌వోలు, తహసీల్దార్లు, ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

మహారాష్ట్ర రాజకీయాల్లో సంచలనం

ముంబై : మహారాష్ట్రలో సంచలనమైన విషయం బయటికి వస్తోంది. మహారాష్ట్ర రాజకీయాలను శాసించిన పార్టీగా ఎన్సీపీకి, దాని అధినేత శరద్ పవార్ కి ఓ పేరుంది. కానీ.. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో ఎన్సీపీని కాంగ్రెస్ లో విలీనం చేయాలని ఆయన నిర్ణయించుకున్నట్లు సమాచారం. దీని వెనుక కాంగ్రెస్ అధిష్ఠానంతో తెరవెనుక చర్చలు కూడా జరుగుతున్నాయని తెలుస్తోంది. ప్రాథమికంగా శరద్ పవార్ కాంగ్రెస్ లో తన పార్టీని విలీనం చేసేందుకు సిద్ధమైనట్లు అంటున్నారు. మహా వికాస్ అగాఢీ లో లుక లుకలు, ప్రస్తుత రాజకీయాల కారణంగా శరద్ పవార్ విసిగిపోయినట్లు తెలుస్తోంది. మహా వికాస్ అగాఢీ అధికారంలో వున్న సమయంలో శరద్ పవార్ ఎంత చెబితే అంతలా రాజకీయాలు నడిచాయి. కానీ.. మహా వికాస్ అగాఢీని, మరీ ముఖ్యంగా ఉద్ధవ్ వర్గంలో చీలిక రావడం, రాజకీయాలు మారిపోవడంతో శరద్ పవార్ ఈ నిర్ణయానికి వచ్చారు. ఒకవేళ ఈ విలీనం జరిగితే మాత్రం మహారాష్ట్ర రాజకీయ ముఖచిత్రమే మారిపోతుంది. మహారాష్ట్ర రాజకీయాలకు పెద్ద దిక్కుగా వున్న శరద్ పవార్ ఇక రాజకీయాల నుంచి తప్పుకున్నట్లే లెక్క. అజిత్ పవార్ దివంగతులయ్యారు. ఉద్ధవ్ తిరుగుబాటుతో సతమతమవుతున్నారు.

డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ ను అవమానించేలా ప్రవర్తించిన వారిపై చర్యలు తీసుకోండి

మల్కాజిగిరి,జూలై06(ప్రజా కలం ప్రతినిధి)

బడుగు బలైన వర్గాల ఆశాజ్యోతి భారత ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 40వ వర్ధంతి సందర్భంగా మల్కాజిగిరి మున్సిపల్ పరిసర ప్రాంతాలలో వారి విగ్రహాల దగ్గర సరైన పూల అలంకరణ, శుభ్రపరచకుండా మహనీయుని అవమానపరిచేలా వ్యవహరించిన అధికారుల పైన కాంట్రాక్టర్ పైన చర్యలు తీసుకోవాలని మల్కాజిగిరి ఎస్సీ,ఎస్టీ, బీసీ,మల్కాజిగిరి పలు పార్టీల నాయకులు జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ ను వారి కార్యాలయంలో సోమవారం కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో మహనీయుల జయంతి వర్ధంతులకు పూల అలంకరణ చేయడంతో పాటు పరిసర

ప్రాంతాలను శుభ్రం చేసి మహనీయులను గౌరవించే వారిని ఈ సంవత్సరం బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా వారి విగ్రహం వద్ద సరైన అలంకరణ చేయకుండా శుభ్రం చేయకుండా వారిని అగౌరపరిచే విధంగా చేసినా కాంట్రాక్టర్, అధికారులపై చర్యలు తీసుకోవాలని లేదంటే దళిత సంఘాలను కలిసి వచ్చే ప్రజా సంఘాలను కలుపుకొని ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంధిగారి నర్సింగ్ రావు మాదిగ,రామ చర్ల నర్సింగ్,బెల్లం నరహరి, బైరు అనిల్ కుమార్, పోశాలు,చందర్,ప్రభాకర్, శివా నాయక్,బీసీ నాయకులు రాము యాదవ్,నాగేష్ గౌడ్, వెంకటేష్,లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంజేపీ బాలికల పాఠశాల తరలింపు లేదని మంత్రి హామీ - మంత్రి, కలెక్టర్‌కు కాంగ్రెస్ నేతల కృతజ్ఞతలు.

సిద్దిపేట ప్రజాకలం జూలై 06.

మండలంలోని శేరిపల్లి బండారం (మొండిచింత) వద్ద ఎంజేపీ (బాలికల) పాఠశాలను ఇతర ప్రాంతానికి తరలించవద్దని జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి, జిల్లా కలెక్టర్‌ను కాంగ్రెస్ నాయకులు కలిసి కోరారు. ఈ

సందర్భంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మద్దెల స్వామి, తిర్మలాపూర్ సర్పంచ్ బండారి లాలూ మాట్లాడుతూ, పాఠశాల తరలింపుపై ఎలాంటి చర్యలు లేవని మంత్రి వివేక్ వెంకటస్వామి కలెక్టర్‌కు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రుల్లో నెలకొన్న ఆందోళన తొలగిందన్నారు. ఈ సమస్యపై సానుకూలంగా స్పందించిన మంత్రి వివేక్ వెంకటస్వామి, జిల్లా కలెక్టర్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మల్లారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు పడాల రాములు, జిల్లా కార్యదర్శి గణేష్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ లో కాసం ఫ్యాషన్స్ షాపింగ్ మాల్ ప్రారంభం

గజ్వేల్:06 జులై (ప్రజా కలం ప్రతినిధి)

సిద్దిపేట జిల్లా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ లో సోమవారం కాసం ఫ్యాషన్ షాపింగ్ మాల్ ప్రారంభం,ఆట పాటలతో సందడి చేసి అభిమానులను అలరించిన అందాల సినీ తార ప్రముఖ యాంకర్ అనసూయ భరద్వాజ్. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో కాసం ఫ్యాషన్స్ 28వ స్టోర్ ను అనసూయ భరద్వాజ్ జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధునాతన కలెక్షన్స్ తో నిత్య నూతన వెరైటీ లతో కాసంఫ్యాషన్స్ పేరు గాంచిందని అన్నారు. ఈ స్టోర్ ను ప్రారంభించడం ఆనందంగా ఉందని చెప్పారు. ఈ సందర్భంగా అనసూయ భరద్వాజ్ కాసం ఫ్యాషన్స్ లోని లేడీస్ జెంట్స్ కిడ్స్ వెర్ అంతా కలియతిరిగి సందడి చేసారు. గజ్వేల్ చుట్టు పక్కల ప్రాంత వాసులు షాపింగ్ కాసం ఫ్యాషన్స్ లో చేయాలని అన్నారు. కాసం షాపింగ్ మాల్ డైరెక్టర్లు కాసం నమశ్శివాయ, కాసం మల్లికార్జున్, కాసం కేదారినాథ్, కాసం శివప్రసాద్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో గత 5 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ఇప్పటివరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లో 28 స్టోర్స్ ప్రారంభిం చాం అని అన్నారు. మా వస్త్రా లను ఎల్లప్పుడూ ఆదరిస్తున్న ప్రజలకు కృతజ్ఞతలు అని పేర్కొన్నారు. అధు నాతన ఫ్యాషన్ డిజైన్లను వినియోగ దారులకు తక్కువ రేటుకే నాణ్యమైన వస్త్రాలను అందిస్తున్నామని తెలిపారు. తమ సంస్థ ద్వారా గజ్వేల్ లో స్థానికులకు నిరక్ష్యారాసులవారికి ప్రభుత్వ జాబ్ అవకాశం లేని వారికి 150 మందికి ఉపాధి కల్పిస్తున్నమన్నా రు,తమ వద్ద సామాన్య వ్యక్తులకు కూడా ఉపాధి గ్యారంటీ అన్నారు. తొలుత సినీనటి అనసూయ భరద్వాజ్ ను చూడడానికి ఉదయం నుండి అభిమానులు, పరిసర ప్రాంత యువతి,యువకులు బారులు తీరారు. యువతి యువకుల కేరింత లతో కాసం షాపింగ్ మాల్ ప్రాంతంలో పండగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమం లో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ లు రాజమౌళి, గాడిపల్లి భాస్కర్, ఆర్యవైశ్య నాయకులు రుక్మయ్యకైలాస ప్రభాకర్,సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.సి. సంతోష్,షాపింగ్ మాల్ నిర్వాహకులు పుల్లూరు అరుణ్ కుమార్,విశాల్, వరుణ్,అరుణ్,కార్తీక్,కాసం ఫణిత్, కాసం సాయికృష్ణ,యాంసాని ప్రవీణ్ తో పాటు పట్టణంలోని ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

వైద్యానికి ద్రవ గతిశాస్త్రం బలం

-అధునాతన వైద్య చికిత్సలకు ద్రవ గతిశాస్త్రం కీలకం: ప్రొఫెసర్ ధర్మేంద్ర త్రిపాఠి.

పటాన్‌చెరు, జులై 6 (ప్రజా కలం) ప్రతినిధి

అధునాతన వైద్య చికిత్సల అభివృద్ధిలో ద్రవ గతిశాస్త్రం కీలక పాత్ర పోషిస్తోందని బయోమెడికల్ పరిశోధనలకు మెకానికల్ ఇంజనీరింగ్ కొత్త దిశ

చూపుతోందని ఎన్ఐటీ ఉత్తరాఖండ్ ప్రొఫెసర్ ధర్మేంద్ర త్రిపాఠి తెలిపారు హైదరాబాద్‌లోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన జీవ వ్యవస్థలలో ద్రవ గతిశీలత విశ్లేషణ అంశంపై నైపుణ్యోపన్యాసంలో ఆయన మాట్లాడారు. ద్రవ స్థిరస్థితి, ద్రవ గతిశాస్త్రం, సజావు, అల్లకల్లోల ప్రవాహాలు, న్యూటోనియన్ కాని ద్రవాలు, నానో ద్రవాలు, గణన పద్ధతులు, శక్తి నిత్యత్వ సూత్రాల వినియోగాన్ని వివరించారు. రక్త ప్రసరణ, శ్వాసకోశం, జీర్ణ, మూత్ర, పునరుత్పత్తి వ్యవస్థల పనితీరుతో పాటు కణితుల ప్రభావం,క్యాన్సర్ వ్యాప్తి చికిత్సలో ద్రవ యాంత్రిక శాస్త్రం పాత్రను వివరించారు. ఈ పరిశోధనలు భవిష్యత్ వైద్య చికిత్సల అభివృద్ధికి ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమాన్ని ప్రొఫెసర్ పి. శ్రీనివాస్, ప్రొఫెసర్ చిన్మయ ప్రసాద్ సమన్వయం చేశారు. విభాగాధిపతి డాక్టర్ జయప్రకాష్ శ్రీవాస్తవ, ప్రొఫెసర్ కె. మారుతి ప్రసాద్, ప్రొఫెసర్ ఎన్. వంశీకృష్ణ, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు..

దుబ్బాక అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలి

: సీఎం రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య వినతి.

సిద్దిపేట ప్రజాకలం జూలై 06.

దుబ్బాక నియోజకవర్గానికి సంబంధించిన పలు అభివృద్ధి పనులు, పెండింగ్ ప్రాజెక్టులు, ప్రజా అవసరాలపై తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి

వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దుబ్బాక నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని ఆయన కోరారు. హబ్సిపూర్ నుంచి దుబ్బాక వరకు ఉన్న డబుల్ రోడ్డును ఫోర్‌లేన్‌గా విస్తరించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలో నిర్మించనున్న ఆధునిక నాన్‌వెజ్ మార్కెట్‌కు గతంలో మంజూరైన నిధులను తిరిగి విడుదల చేయాలని కోరారు. నియోజకవర్గానికి తెలంగాణ పబ్లిక్ స్కూల్‌తో పాటు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ శాఖలకు సంబంధించిన రోడ్ల పెండింగ్ బిల్లులు, నిధులను వెంటనే విడుదల చేసి, గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అన్ని అభివృద్ధి పనులకు అవసరమైన నిధులను త్వరితగతిన విడుదల చేసి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రిని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం దుబ్బాక నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి పూర్తి సహకారం అందించాలని ఆయన కోరారు.

జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

: మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి సిద్దిపేటలో మీడియా అక్రిడిటేషన్ కార్డుల పంపిణీ

సిద్దిపేట:06 జూలై
(ప్రజా కలం ప్రతినిధి)

రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత

ఇస్తోందని రాష్ట్ర కార్మిక,ఉపాధి కల్పన, గనుల శాఖ మంత్రి, ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. సోమవారం సిద్దిపేట ఐడీఓసీలో నిర్వహించిన కార్యక్రమంలో మెదక్ పార్లమెంట్ సభ్యుడు మాధవనేని రఘునందన్ రావు,జిల్లా కలెక్టర్ కె. హైమావతితో కలిసి జిల్లాలోని జర్నలిస్టులకు మీడియా అక్రిడిటేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డులు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. జర్నలిస్టులతో ఒకే వేదికపై నమావేశమై వారి సమస్యలు, అభిప్రాయాలు తెలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఉద్యమ స్వరాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు మీడియా కీలక పాత్ర పోషించిందని, అదే స్ఫూర్తితో నేటికీ ప్రజా సంక్షేమ అంశాలపై మీడియా బాధ్యతాయుతంగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. ప్రస్తుత కాలంలో మీడియా మరింత ఆధునికంగా,సాంకేతికంగా అభివృద్ధి చెందిందని అన్నారు. జర్నలిస్టులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుతున్న నాణ్యమైన వైద్య సేవలను జర్నలిస్టులు కూడా వినియోగించుకోవాలని సూచించారు. జర్నలిస్టులకు అందించే ప్రత్యేక హెల్త్ కార్డులు నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో సమర్థవంతంగా పనిచేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా మరింత చురుకుగా వ్యవహరించాలని మంత్రి కోరారు. ప్రభుత్వ కార్యక్రమాల అమలులో లోపాలు ఉంటే వాటిని నిర్మొహమాటంగా ఎత్తిచూపాల ని, వాటిని ప్రభుత్వం సరిదిద్దుకుంటుందని అన్నారు.

తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన జర్నలిస్టు లక్ష్మారెడ్డి కుటుంబానికి సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు మాట్లాడుతూ తాను గతంలో మీడియాలో కంట్రిబ్యూటర్‌గా పనిచేశానని,మంత్రి వివేక్ వెంకట స్వామి కూడా మీడియా రంగానికి చెందిన వ్యక్తేనని గుర్తు చేశారు. జర్నలిస్టుల సమస్యలు తనకు బాగా తెలుసని, గ్రామీణ ప్రాంతాల నుంచి పనిచేస్తున్న జర్నలిస్టులకు ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో ప్రత్యేక అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. జర్నలిస్టుల హెల్త్ కార్డులు కార్పొరేట్ స్థాయి ఆసుపత్రుల్లోనూ పూర్తిస్థాయిలో అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన జర్నలిస్టు లక్ష్మారెడ్డి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా కలెక్టర్ కె. హైమావతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సన్నబియ్యం పంపిణీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సబ్సిడీ గ్యాస్ సిలిండర్, రూ. 10 లక్షల వరకు ఆరోగ్యశ్రీ, కొత్త రేషన్ కార్డులు, ప్రభుత్వ విద్య,వైద్య సేవల బలోపేతం వంటి సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంలో మీడియా కీలక పాత్ర పోషించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దరిపెల్లి చంద్రం, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మీకిరణ్, డీఆర్‌వో నాగరాజమ్మ, సిద్దిపేట ఆర్డీఓ సదానందం, ఆత్మ కమిటీ ప్రతినిధులు,డీపీఆర్వో రవికుమార్, నమాచార పౌర నంబంధాల శాఖ అధికారులు, మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు, జర్నలిస్టులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ రైల్వే ఎంప్లాయిస్ అసోసియేషన్ లో రైల్ ఇంజన్ ప్యానెల్ అభ్యర్థుల గెలుపు

హైదరాబాద్,జూలై06 ప్రజాకలం

ఆల్ ఇండియా ఎస్సీ,ఎస్టీ రైల్వే ఎంప్లాయిస్ అసోసియేషన్ సౌత్ సెంట్రల్ రైల్వే హైదరాబాద్ డివిజన్ జోనల్ ఎన్నికలు సోమవారం జరిగాయి. ఎన్నికలలో రైల్ ఇంజన్ ప్యానల్ అభ్యర్థులు వై.లక్ష్మీపతి ప్రెసిడెంట్,పి గోపాలకృష్ణ సెక్రెటరీ,కే నాగేశ్వర్ రావు వర్కింగ్ ప్రెసిడెంట్,ఎం భద్రయ్య అడిషనల్ సెక్రెటరీ,బి శ్యామ్ రావు ట్రెజరర్ లుగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కమిటీ వారికి పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

మురికివాడల్లో సైతం తాగునీటి సమస్య లేకుండా చూడాలి - బండి రమేష్

కూకట్ పల్లి, జులై 06, ప్రజా కలం ప్రతినిధి:

కాలనీలతోపాటు మురికివాడల్లో సైతం తాగునీటి సరఫరా సక్రమంగా జరిగేలా తగు చర్యలు తీసుకోవాలని టిపిసిసి ఉపాధ్యక్షుడు తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ అధికారులకు సూచించారు. ఈ మేరకు ఆయన స్థానిక నాయకులతో కలిసి సోమవారం కెపిహెచ్ బి వాటర్ వర్క్స్ జనరల్ మేనేజర్ హరి శంకర్ ను కలిశారు. వాటర్ వర్క్స్ పరిధిలోకి వచ్చే సఫ్దర్ నగర్, దీన్ దయాళ్ నగర్ మోతి నగర్ 15 వ ఫేస్ లలో కొత్తగా డ్రైనేజీ లైన్ల నిర్మాణం, మోతి నగర్ లో వాటర్ సంపు నిర్మించాలని అధికారులకు సూచించారు. అలాగే మురికివాడల్లో 20 వేల లీటర్ల ఉచిత త్రాగునీరును అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు డీజీఎం త్రినాధరావు, నాయకులు తూము వేణు, సతీష్ రెడ్డి, కృష్ణ రాజ్ పుత్, రాజేష్, మైఖేల్, ఫణి కుమార్, రజిత, వనజ, మాధవి తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం హైవేపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి మరొకరికి గాయాలు

కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న కందుకూరు పోలీసులు

కందుకూర్, జులై 06, (ప్రజా కలం).

కందుకూరు మండలం దెబ్బడగూడ గేట్ సమీపంలో, శ్రీశైలం హైవేపై ఫీడ్ కంపెనీ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది, మైసిగండి మైసమ్మ అమ్మవారి దర్శనం ముగించుకుని, హైదరాబాద్ చెందిన ఇద్దరు వ్యక్తులు హోండా యూనికాన్ మోటార్ సైకిల్‌పై హైదరాబాద్ కు వెళ్తున్న సమయంలో, కడ్తాల్ వైపు నుంచి వస్తున్న భారత్ బెంజ్ పాల ట్యాంకర్ (టీఎస్ 05 యుసి 7771) అతివేగంగా, ద్విచక్ర మోటార్ బైకును వెనుక నుంచి ఢీకొట్టింది,ఈ ప్రమాదంలో సాయి కృష్ణ (32) అక్కడికక్కడే మృతి చెందగా, ఆయనతో ప్రయాణిస్తున్న పతిపాక సాయి కిరణ్,(31)కు చేతులు, కాళ్లపై గాయాలయ్యాయి విషయం తెలుసుకున్న కందుకూరు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని జరిగిన సంఘటన పరిశీలించి ఒకరు మృతి చెందారు.మరొకరికి గాయాలయ్యాయి సంఘటన స్థలంలో మృతి చెందిన యాల గండుల సాయి కృష్ణ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు, మరొకరిని మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ ఆస్పత్రికి తరలించారు,మృతుడి భార్య యలగండుల మైత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కందుకూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి, ప్రమాదానికి కారణమైన పాల ట్యాంకర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న కందుకూరు పోలీసులు

గజ్వేల్‌లో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ వేగవంతం..

ఎస్ఐఆర్ హెల్ప్‌డెస్క్‌లను పరిశీలించిన మున్సిపల్ అధికారులు, మున్సిపల్ వైస్ ఛైర్ పర్సన్

గజ్వేల్:06 జూలై 2026 (ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్– ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఎస్.ఐ.ఆర్. హెల్ప్ డెస్క్‌లను మున్సిపల్ కమిషనర్ గణేష్ రెడ్డి, మేనేజర్ బాలకిషన్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ కల్యాణ్ కార్ పద్మాభాయ్ నర్సింగరావు సోమవారం ఉమ్మడిగా పరిశీలించారు. హెల్ప్ డెస్క్‌ల వద్ద ఓటర్ల నమోదు, సవరణలు జరుగుతున్న తీరును వారు అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ కల్యాణ్ కార్ పద్మాభాయ్ నర్సింగరావు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వం, ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. పట్టణంలోని ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ప్రత్యేకంగా ఎస్.ఐ.ఆర్ హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేశామన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు అందరూ తమ పేరును ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలన్నారు. ఓటరు కార్డులో తప్పులు ఉన్నా, చిరునామా మారినా సవరణల కోసం ఈ హెల్ప్ డెస్క్‌ల సేవలను వినియోగించుకోవచ్చు అన్నారు. మున్సిపల్ యంత్రాంగం ఓటరు జాబితాను పక్కాగా, ఎలాంటి తప్పులు లేకుండా రూపొందించేందుకు కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, వార్డు అధికారులు, ఎస్.ఐ.ఆర్ ప్రతినిధులు (బి.ఎల్.ఓ.), స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ఈనెల 24 వరకే ఎస్ ఐ ఆర్

-బి ఎల్ ఏ లు అప్రమత్తంగా ఉండి దొంగ ఓట్లు తొలగించాలి
-జూన్ 25 నుంచి కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ
-మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కేఎల్ఆర్

మహేశ్వరం, జులై 06, (ప్రజా కలం)

భవిష్యత్తులో ఓటు హక్కు వినియోగించుకోవాలంటే కచ్చితంగా సర్ లో పాల్గొనాలని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు.ఇవాళ కాంగ్రెస్ నాయకులు, బి ఎల్ ఏ లతో మాట్లాడారు. అధికారులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పాలని కె ఎల్ ఆర్ సూచించారు.బి ఎల్ ఓ లు అడిగిన పత్రాలను చూపించాలని ఓటర్లను కిచ్చెన్నగారు కోరారు. తెలంగాణ వ్యాప్తంగా 3 కోట్ల 38 లక్షల 26 వేల 228 మంది ఓటర్ల డేటాను వడపోసే ప్రక్రియ అధికారులు చేపట్టారని.. కాంగ్రెస్ నేతలు సైతం యంత్రాంగానికి అండగా నిలవాలని లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. ఫోటో, పేరు, అడ్రస్ అన్ని ఓటర్ జాబితాలో సక్రమంగా ఉన్నాయో లేదో చెక్ చేసుకోవాలని లక్ష్మారెడ్డి సూచించారు. మిస్ అయితే బీఎల్వో దృష్టికి తెచ్చి సరిచేసుకోవాలని కె ఎల్ ఆర్ కోరారు. ఎన్నికల సంఘం నెల రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ మహాయజ్ఞం – మెగా ఇంటి ఇంటి సర్వేకు సహకరించి... ఎన్యూమరేటర్ పత్రాలు పూర్తి చేయాలని లక్ష్మారెడ్డి కిచ్చెన్నగారు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

జగ్జీవన్ రామ్‌కు ఘన నివాళి..

-సామాజిక న్యాయానికి జగ్జీవన్ రామ్ సేవలు చిరస్మరణీయం: మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు, జులై 6 (ప్రజా కలం) ప్రతినిధి

దేశంలో సామాజిక న్యాయం, సమానత్వం కోసం జీవితాంతం పోరాడిన మహానేత డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిగా నిలుస్తాయని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం పటాన్‌చెరు పట్టణంలోని ఆయన కాంస్య విగ్రహానికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, సీనియర్ నాయకులు భిక్షపతి, శంకర్, వెంకటేష్, బల్వంత్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ సంఘాల ప్రతినిధులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ సామాజిక న్యాయం, సమాన హక్కుల కోసం డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ చేసిన సేవలు దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి ప్రతి ఒక్కరికీ ఆదర్శమని, ఆయన ఆశయాల సాధనకు అందరూ కట్టుబడి పనిచేయాలని పిలుపునిచ్చారు అనంతరం నాయకులు బాబు జగ్జీవన్ రామ్ సేవలను స్మరించుకుంటూ ఘనంగా నివాళులర్పించారు..

శంభిపూర్ రాజుకు ఆదర్శ్ పరామర్శ

-గాయపడిన శంభిపూర్ రాజును పరామర్శించిన ఆదర్శ్ రెడ్డి..

పటాన్‌చెరు, జులై 6 (ప్రజా కలం) ప్రతినిధి

రోడ్డు ప్రమాదంలో గాయపడిన బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా బాధ్యుడు, శాసనమండలి సభ్యుడు శంభిపూర్ రాజును బీఆర్ఎస్ పటాన్‌చెరు నియోజకవర్గ బాధ్యుడు వెన్నవరం ఆదర్శ్ రెడ్డి పరామర్శించారు.ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా పూర్తి ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వెన్నవరం ఆదర్శ్ రెడ్డి మాట్లాడుతూ శంభిపూర్ రాజు పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తున్న నాయకుడని పేర్కొన్నారు. ఆయన త్వరగా కోలుకుని మళ్లీ ప్రజల మధ్యకు వచ్చి పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షిస్తూ ధైర్యం చెప్పారు. ఈ పరామర్శ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు జిన్నారం వెంకటేష్ గౌడ్ పాల్గొని శంభిపూర్ రాజును వరామర్శించారు.ఆయన కూడా శంభిపూర్ రాజు త్వరగా పూర్తిగా కోలుకుని యథావిధిగా ప్రజా, పార్టీ సేవలను కొనసాగించాలని ఆకాంక్షించారు..

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా వంటేరు కొండల్ రెడ్డి నియామకం

నియామక పత్రాలు అందజేసిన డిసిసి అధ్యక్షురాలు ఆంక్ష రెడ్డి

గజ్వేల్:06 జూలై 2026 (ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా వంటేరు కొండల్ రెడ్డి నియామకమయ్యారు.సోమవారం డిసిసి అధ్యక్షురాలు ఆంక్షరెడ్డి చేతుల మీదుగా కొండల్ రెడ్డికి నియామక పత్రాలు అందజేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొండల్ రెడ్డి నాయకత్వంలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని వారికి సూచించారు,అనంతరం కొండల్ రెడ్డి మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, డిసిసి అధ్యక్షురాలు ఆంక్షరెడ్డి, కాంగ్రెస్ అధినాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, ప్రతి కార్యకర్తకు అందుబాటులో ఉంటూ నిరంతరం శ్రమిస్తూ, కాంగ్రెస్ పార్టీ అభ్యున్నతి కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు

ఓటు హక్కుకు ముప్పు!..

-ఎస్ఐఆర్‌పై అవగాహన లేక ఓటు హక్కుకు ముప్పు: ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి..

పటాన్‌చెరు, జులై 6 (ప్రజా కలం) ప్రతినిధి

ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్)పై రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు సరైన అవగాహన కల్పించడంలో విఫలమవుతున్నారని, అర్హులైన ఓటర్లు తమ ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉందని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు పటాన్‌చెరులోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 12న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ, బీఆర్ఎస్ డిజిటల్ సభ్యత్వంపై బూత్ స్థాయి ప్రతినిధులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు ఈ సదస్సుకు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు బీజేపీ కాంగ్రెస్ ప్రభుత్వాలు ఎస్ఐఆర్ పేరుతో బీఆర్ఎస్ ఓట్లను తొలగించే కుట్ర చేస్తున్నాయని ఆరోపిస్తూ ప్రతి అర్హుడి ఓటు నమోదు అయ్యేలా బూత్ స్థాయి ప్రతినిధులు పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదర్శ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్లు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు..

గడువులోగా ఎన్యుమరేషన్ ఫారాలను సమర్పించాలి

కొత్త ఓటర్ల నమోదు వంటి అంశాలపై ప్రజలకు అవగాహన

ఏఐసీసీ -విచార్ విభాగ్ కో-ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి

మహేశ్వరం, జులై 06,(ప్రజా కలం)

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండల కేంద్రం అల్మాస్ గూడ పరిధిలోని తిరుమల నగర్‌లో బి ఎల్ ఓ లతో కలిసి ఇంటింటికి

వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలను ప్రజలకు అందజేయడంతో పాటు, ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (సర్) కార్యక్రమం యొక్క ఉద్దేశ్యం, ప్రాముఖ్యతను వివరించారు.ఈ సందర్భంగా ఓటరు జాబితాలో పేరు నమోదు, మార్పులు, చిరునామా సవరణలు, కొత్త ఓటర్ల నమోదు వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, ప్రతి అర్హుడైన పౌరుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ వివరాలను సక్రమంగా నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి సందేహాలు ఉన్నా బి ఎల్ ఓ లను సంప్రదించి అవసరమైన వివరాలు తెలుసుకుని, గడువులోగా ఎన్యుమరేషన్ ఫారాలను సమర్పించాలని బోయపల్లి రాఘవేందర్ రెడ్డి కోరారు..ఈ కార్యక్రమంలో బి ఎల్ ఓ తరుణ్ గౌడ్, నిర్మల, సుస్మా, శ్రీహరి, మహేష్, స్థానికులు ధన్సింగ్ నాయక్, రమేష్ చౌహన్, శ్రీ హిల్స్ కాలనీ ప్రెసిడెంట్ శ్రీనివాస్ చారి, రవీందర్ రావు, బహుగుణ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభకు నగదు ప్రోత్సాహం

-500 మార్కులు దాటిన 30 మంది విద్యార్థులకు రూ.5 వేల నగదు బహుమతి..

పటాన్‌చెరు, జులై 6 (ప్రజా కలం) ప్రతినిధి

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభ కనబరిచిన పదో తరగతి విద్యార్థులను ప్రోత్సహిస్తూ 30 మందికి నగదు బహుమతులు అందజేశారు. ఇష్టపడి చదివి,

క్రమశిక్షణతో ముందుకు సాగితే ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని జిల్లా పరిషత్ బాలికల, బాలుర ఉన్నత పాఠశాలల్లో మెట్టు కుమార్ ఆధ్వర్యంలో ఎంకేవై ఫౌండేషన్ నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని, పదో తరగతిలో 500కు పైగా మార్కులు సాధించిన 30 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున నగదు బహుమతులు అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, ఆధునిక సౌకర్యాలు కల్పిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రతి ఏడాది విద్యార్థులకు ప్రోత్సాహక కార్యక్రమాలు నిర్వహిస్తున్న మెట్టు కుమార్‌ను అభినందించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు, అశోక్, ప్రభాకర్, వెంకటేష్, రాజు, ఇమ్రాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు..

యస్ఐఆర్ ఫారంలను బియల్ఓ లు ఇంటింటికి వెళ్లి ఇవ్వాలి:సిపిఎం

ప్రజాకలం/కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) గాజులరామారం డివిజన్ పరిధిలో యస్ఐఆర్ ఫారాలను బియల్ఓ లు ఒక దగ్గరే కూర్చొని ఇసున్నారని దీనివల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని సిపియం గాజులరామారం డివిజన్ కార్యదర్శి జాకీర్ పేర్కొన్నారు. సోమవారం కుత్బుల్లాపూర్ జోనల్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో సిపియం నాయకులు ఈఆర్వో పింకేష్ కి వినతిపత్రం అందజేశారు. సిపియం సీనియర్ నాయకులు బురాన్ మాట్లాడుతూ... యస్ఐఆర్ లో ఓటర్ల పేరు, పోన్ నంబర్లు తప్పులు ఉన్నాయని దానివల్ల ప్రజలు ఓటు హక్కును కోల్పోయే అవకాశం ఉందన్నారు. ముందుగా యస్ఐఆర్ లో ఉన్న తప్పులను సరిచేయాలని సూచించారు. అలాగే యస్ఐఆర్ పై ప్రజలకు అవగాహన కలిగించాలని కోరారు. ఈకార్యక్రమంలో ముఖ్తర్, ఆరిఫ్, గౌస్ తదితరులు పాల్గొన్నారు

కేబీ ఇంటీరియో నూతన కార్యాలయాన్ని ప్రారంభించిన కొలన్ హన్మంత్ రెడ్డి

ప్రజాకలం/కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) బాచుపల్లి పరిధిలోని దేవేందర్ నగర్ కేబీ ఇంటీరియో కార్యాలయం సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కె. బాల బ్రహ్మచారి నూతనంగా ఏర్పాటు చేసిన కెబీ ఇంటీరియో (KB Interio) నూతన కార్యాలయాన్ని కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇంపీరియల్ రంగంలో నాణ్యమైన సేవలను అందిస్తూ కస్టమర్ల విశ్వాసాన్ని పొందాలని, సంస్థ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అనంతరం సంస్థ వారిని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో సంస్థ మేనేజర్ కె.రంజిత్ చారి, శ్రీనివాస్, గౌతమ్, ఉదయ్, మహాదేవపురం అధ్యక్షులు సిద్దనోళ్ల సంజీవరెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు షఫీ, గఫ్ఫార్, జగన్నాథ్, అజామ్, శ్రీనివాస్ రావు, రాజుచారి, ఆకోడే శ్రీనివాస్, జితేందర్ రెడ్డి, శ్రీలత, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం బట్టి,ఎంపి మల్లురవిని కలిసిన నూతన డివిజన్ అధ్యక్షులు

పార్టీ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తాం

కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసే ప్రతి హామీని ప్రజలలోకి తీసుకెళ్తాం..

మేడిపల్లి జూలై 6(ప్రజాకలం న్యూస్)

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ కాంగ్రెస్ పార్టీ నూతన డివిజన్ అధ్యక్షులుగా నియామకం అయిన సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టివిక్రమార్క, టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లు రవిని పోచారం డివిజన్ అధ్యక్షులు కర్రె రాజేష్,మేడిపల్లి డివిజన్ అధ్యక్షులు తుంగతుర్తి రవి, పీర్జాదిగూడ డివిజన్ అధ్యక్షులు బండి శ్రీరాములు,బోడుప్పల్ డివిజన్ అధ్యక్షులు బొమ్మక్ కళ్యాణ్,చెంగిచర్ల డివిజన్ అధ్యక్షులు పోగుల దిలీప్ రెడ్డి, ఎదులాబాద్ డివిజన్ అధ్యక్షులు సామల అమర్ సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షులను అభినందించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన అధ్యక్షులు పార్టీ అభివృద్ధికి, ప్రజాసేవకు అంకితభావంతో పనిచేస్తామని, ప్రభుత్వం అమలు చేసే ప్రతి అభివృద్ధి పనిని ప్రజలలోకి తీసుకెళ్తామని,కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి,పూస రమేష్,శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహించిన ఎస్సై సస్పెండ్ చేయాలి

బిజెపి జిల్లా అధ్యక్షులు ఉట్కూరి అశోక్ గౌడ్

భూదాన్ పోచంపల్లి

జులై 6 (ప్రజా కలం)

నిందితున్ని వక్క దారి పట్టిన్స్తా, న్యాయాన్ని వక్కనపెట్టి అన్యాయా నికి చేతులు పలుకుతున్నా ఎస్సై ని వెంటనే సస్పెండ్ చేయాలని బిజెపి జిల్లా అధ్యక్షులు ఊట్కూరు అశోక్ గౌడ్ అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి మున్సిపాలిటీ రేవనపల్లి లో బిజెపి నాయకులు నుర్కుంటి రంగారెడ్డి తండ్రి సాయి రెడ్డి పై జరిగిన దాడిని ఖండిస్తూ సోమవారం ఉదయం పోచంపల్లి పోలీస్ స్టేషన్ ఎదురుగా చట్టాన్ని పక్క దారి పట్టిస్తున్న ఎస్సైని వెంటనే సస్పెండ్ చేయాలని స్టేషన్ ఎదురుగా ధర్నా నిర్వహించారు. వెంటనే నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నిసార్లు కంప్లైంట్ చేసిన పోలీసులు రంగారెడ్డి కుటుంబ సభ్యులను పట్టించుకోకుండా చులకనగా చూసారని, నిందితులు యదేచ్ఛగా తిరుగుతున్న వారిని అరెస్టు చేయకుండా వారికి పోలీసులు మద్దతు తెలపడం ఏంటని ఆయన ప్రశ్నించారు. రంగారెడ్డికి బెదిరింపులు వచ్చిన పట్టించుకోకపోవడం వారి నిర్లక్ష్య వైఖరికి నిదర్శనం అన్నారు. గత రెండు మూడు రోజులుగా బిజెపి జిల్లా నాయకులు పలుసార్లు వచ్చిన ఎస్ఐ నిర్లక్ష్య వైఖరి వహించడం సబబు కాదన్నారు. నిందితులకు వత్తాసు పలుకుతున్న ఎస్సైని వెంటనే సస్పెండ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా గంగిడి మనోహర్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏల చంద్రశేఖర్, మాజీ కౌన్సిలర్ మాయ దశరథ, కర్నాటి కర్నాటి ధనుంజయ, పాశం భాస్కర్, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్ మోహన్ రెడ్డి, ఎనం శివకుమార్, మునుగోడు అసెంబ్లీ కన్వీనర్ బిక్షం గౌడ్, చిక్క కృష్ణ, వలిగొండ మండల అధ్యక్షుడు సుదర్శన్, బోనగిరి టౌన్ రత్న ఫ్రం బలరాం, భువనగిరి రూరల్ సురేష్ రెడ్డి, బీబీనగర్ మండల అధ్యక్షుడు సదానంద గౌడ్, మాజీ అధ్యక్షులు తురుగంటి జంగారెడ్డి, మేకల రవీందర్ రెడ్డి, డబ్బికార్ సాయిష్, కిసాన్ మోర్చా అధ్యక్షులు రాజేందర్ రెడ్డి, మేకల చొక్కా రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు చందా మహేందర్ గుప్తా, కొప్పుల యాదిరెడ్డి, చెరుకు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుని పరామర్శించిన మాజీ మంత్రి హరిష్ రావ్ పటాన్చెరువు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

ప్రజాకలం/కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) నిన్న (ఆదివారం) వరంగల్ కన్నెపల్లి రిజర్వాయర్ పర్యటనకు వెళ్తున్న నేపథ్యంలో మార్గమధ్యలో జరిగిన ప్రమాదంలో స్వల్పంగా గాయపడ్డ మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుని శంభీపూర్ లోని నివాసంలో వారిని మర్యాదపూర్వకంగా కలిసి మాజీమంత్రి హరిష్ రావ్, పటాన్చెరువు నియోజకవర్గ ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఈసందర్భంగా వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఉద్యమకారులకు ప్రమాదం చోటు చేసుకోవడం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేయడం లేదని విమర్శించారు.

అంబేద్కర్ భవన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

-జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

యాదాద్రి జూలై 6 ప్రజాకలం:భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని సింగన్నగూడెంలో నిర్మాణంలో ఉన్న అంబేద్కర్ భవనాన్ని జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్... భవనం నిర్మాణ పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఇప్పటి వరకు పూర్తయిన నిర్మాణ

పనులు,ప్రస్తుతం కొనసాగుతున్న పనులు, ఇంకా పెండింగ్‌లో ఉన్న పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.నిర్మాణ పనులు నాణ్యతతో పాటు నిర్దేశిత గడువులో పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.అంబేద్కర్ భవనానికి అవసరమైన మౌలిక వసతులపై కూడా జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.భవనం ముందు సీసీ రోడ్డు నిర్మాణం, గ్రీనరీ అభివృద్ధి,పరినరాల సుందరీకరణ తదితర పనులను,త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. భవనాన్ని ప్రజలకు పూర్తిస్థాయిలో ఉపయోగపడే విధంగా అన్ని వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

-స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు.

యాదాద్రి/ కలెక్టరేట్ జూలై 7 ప్రజాకలం ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని,స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు అన్నారు.సోమవారం రోజు కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి,పాల్గొని వివిధ ప్రాంతాల,ప్రజల నుండి వచ్చిన 71 అర్జీలను స్వీకరించారు.ప్రజా వాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలనీ,అధికారులను ఆదేశించారు.అందులో రెవిన్యూ శాఖ 45,సంక్షేమ శాఖ 5 జిల్లా పరిషత్ 4,గ్రామీణ అభివృద్ధి 3,సర్వే ల్యాండ్స్ 3,హౌసింగ్ 2, అటవీశాఖ 2,పంచాయితీ 2, వ్యవసాయ,విద్య, ట్రాన్స్కో, కోపరేటివ్,ఎస్సీ డెవలప్మెంట్, శాఖలకు ఒక్కటి చొప్పున అర్జీలు వచ్చాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్లు సాత్విక్,కృతిక,జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ,జడ్పీ సీఈవో శోభారాణి,గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి నాగిరెడ్డి,వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బొమ్మలరామారం మండలంలో టైర్లను కాల్చే కంపెనీ వలన

ప్రజల జీవన మనగుడా సాధ్యమేనా?

చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారా?

సమాచార హక్కు చట్టం ద్వారా టైర్ల ను కాల్చే కంపెనీలకు

ఎలాంటి అనుమతులు లేవని సమాధానం ఇచ్చిన రంగాపురం పంచాయతీ కార్యదర్శి

బొమ్మలరామారం జులై 6 (ప్రజా కలం) బొమ్మలరామారం మండలంలోని రంగాపురం గ్రామ పరిధిలో చాప కింద నీరుల విస్తరిస్తున్న టైర్లను కాల్చే కంపెనీలు, ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న టైర్ల కంపెనీల యాజమాన్యం. మండలంలోని గ్రామ ప్రజల జీవన మనగుడా ప్రశ్నార్థకమే అని పర్యావరణవేత్తలు,మండల గ్రామ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు రంగాపురం గ్రామంలో ఉన్న కెమికల్ కంపెనీలు,టైర్ల లను కాల్చే కంపెనీలతో వచ్చే పొగ ,దుర్వాసన గ్రామ ప్రజలు అనారోగ్య పాలవుతున్నామని గతంలో అధికారులకు గ్రామ ప్రజలు, మండల ప్రజలు, ప్రజాప్రతినిధులు ఫిర్యాదులు ఇచ్చిన ఎలాంటి చర్యలు తీసుకోలేదని బొమ్మలరామారం మండల నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు నీటి కాలుష్యం వలన చేపలు,గేదలు, మేకలు చనిపోయి గ్రామపంచాయతీ కార్యాలయం ముందు ధర్నాలు, నిరసనలు చేసిన పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోక పోవడం అధికారుల పనితీరును అర్థం చేసుకోవచ్చు రంగాపురం గ్రామపంచాయతీ రెవిన్యూ పరిధిలో ఉన్న టైర్ల కంపెనీల వల్ల వచ్చే పొగతో చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతు న్నారు ప్రభుత్వ నిబంధనలను విరుద్ధంగా కంపెనీలకు అనుమతి రాకముందే షెడ్డు నిర్మాణం, విద్యుత్ లైన్లు చేపట్టడం మండల అధికారుల నిర్లక్ష్య వైఖరికి నిదర్శనం అని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు ప్రజల ఆరోగ్యం, ప్రాణాలతో చెలగాట మాడుతున్న అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు,ప్రజల ఆరోగ్యానికి టైర్లు కాల్చడం వల్ల వచ్చే పొగ కాలుష్యంతో అత్యంత ప్రమాదకరమని పర్యావరణ శాస్త్రవేత్తలు చెబుతున్న కూడా పట్టించుకోకుండా ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి ఇష్టానుసారంగా కంపెనీలను ఏర్పాటు చేసుకుంటున్నారు కార్మికులకు అవసరమైన సదుపాయాలను సమకూర్చడంలో కంపెనీ యజమానులు విఫలమవుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి జిల్లా లేబర్ అధికారి కంపెనీలలో తనిఖీలు చేసిన దాఖలాలు ఎక్కడా లేవు టైర్ల ను కాల్చడంతో టైర్ల నుండి వెలువడే బహిరంగ అగ్నికణాలలో కార్బన్ మోనాక్సైడ్ (CO), సల్ఫర్ ఆక్సైడ్లు (SOx), నైట్రోజన్ ఆక్సైడ్లు (NOx) మరియు అస్థిర సేంద్రియ నవ్మేళనాలు (VOC\T) వంటి ప్రమాణాలు కలిగిన ప్రమాదకరమైన కాలుష్య కారకాలు ఉంటాయి. పాలీ న్యూక్లియర్ ఆరోమాటిక్ హైడ్రోకార్బన్లు (PAH\T), డయాక్సిన్లు, ఫ్యూరాన్లు, హైడ్రోజన్ క్లోరైడ్, బెంజీన్, పాలీక్లోరినేటెడ్ బైఫినైల్స్ (PCB\T) వంటి "ప్రమాణాలు లేని" ప్రమాదకర వాయు కాలుష్య కారకాలు (HAP\T) కూడా ఉన్నాయి మరియు కాడ్మియం, నికెల్, జింక్, పాదరసం, క్రోమియం మరియు వనాడియం వంటి లోహాలు కూడా ఉన్నాయి. వీటివలన దీర్ఘకాలిక ఆరోగ్య ప్రభావాలను కలిగిస్తాయి. బహిర్గతం యొక్క వ్యవధి మరియు స్థాయిని బట్టి, ఈ ఆరోగ్య ప్రభావాలలో చర్మం, కళ్ళు మరియు శ్లేష్మ పొరల చికాకు, శ్వాసకోశ ప్రభావాలు, కేంద్ర నాడీ వ్యవస్థ ప్రభావం చూపి క్యాన్సర్ కు దారి తీయవచ్చు ఈ ఉద్గారాలకు అసురక్షితంగా గురికావడాన్ని నివారించాలని జ్ఞూూ సూచిస్తుంది.ఇంకా, నియంత్రణ లేని టైర్ దహనం అనేది 16 రెట్లు ఎక్కువ మ్యూటాజెనిక్ అని నిరూపించబడింది,అంటే ఇది ఒక పొయ్యిలో సాంప్రదాయ నివాస కలప దహనం కంటే జన్యు ఉత్పరివర్తనను ప్రేరేపించగలదు ఈ ప్రాంగణంలో నివసించే పిల్లలు అనుకోకుండా ఈ విష ప్రభావానికి గురవుతుండటం ముఖ్యంగా ఆందోళనకరమైన విషయం అని పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు పిల్లలు, గర్భిణీలు,పాలిచ్చే తల్లులకు, చిన్నపిల్లలు, వృద్ధులు, ఉబ్బసం ఉన్నవారు మరియు రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న వ్యక్తులు అందరూ మండుతున్నటైర్లలో విడుదలయ్యే కాలుష్య కారకాలకు ఎక్కువగా అనారోగ్యానికి గురవుతారు.

పాలిచ్చే స్త్రీ కూడా తాను పీల్చే కాలుష్యాన్ని తన తల్లి పాలలోని కొవ్వు ద్వారా శిశువుకు బదిలీ చేయగలదు. తల్లిపాలు ఇచ్చే సమయంలో, శిశువులు వారి జీవితంలో ఏ సమయంలో కంటే ఎక్కువ సాంద్రత కలిగిన సేంద్రీయ కాలుష్య కారకాలకు గురవుతారు. టైర్లను కాల్చడం వల్ల ఆ విష భారం పెరుగుతుంది. ప్రజల ఆరోగ్యం కంటే టైర్లను తగలబెట్టడం ద్వారా ఇంధనంపై డబ్బు ఆదా చేయడం ముఖ్యం కాకూడదు.దురదృష్టవశాత్తు, చిన్న గ్రామాలు మరియు ఇతర అభివృద్ధి చెందని ప్రాంతాలలో, టైర్లను తగలబెట్టే కంపెనీల వల్ల స్థానిక ఆర్థిక వ్యవస్థలో ఎక్కువ ప్రభావాన్ని చూపుతుంది ఇలాంటి కంపెనీల వల్ల ప్రస్తుతం అనుసరిస్తున్నందున విష కాలుష్యం వల్ల చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు అనారోగ్యానికి గురికావడం అనివార్యం.టైర్లను కాల్చడం వల్ల కలిగే భారీ పర్యావరణ నష్టాలు

టైర్లను కాల్చడం వల్ల మానవుల ఆరోగ్యంపై కలిగే ప్రతికూల ప్రభావాలతో పాటు, దాని వల్ల కలిగే పర్యావరణ నష్టాలను అంచనా వేయలేని పరిస్థితిలో ఉండడం ఆందోళన కలిగించే విషయం. టైర్లను కాల్చడం వల్ల పర్యావరణంపై కలిగే మూడు ప్రధాన ప్రభావాలు గాలి, నీరు మరియు నేల కాలుష్యం. టైర్లను కాల్చే కంపెనీల వల్ల కలిగే వాయు కాలుష్యం గణనీయంగా ఉంటుంది. నల్లటి పొగలో భారీ లోహాలు మరియు ఇతర హానికరమైన కాలుష్య కారకాలు ఉంటాయి, ఇవి గాలిలో ఉండిపోతాయి మరియు తీవ్రమైన దీర్ఘకాలిక ఆరోగ్య ప్రమాదాలకు దారితీస్తాయి చుట్టుపక్కల గ్రామ వ్రజలకు ఇంత హాని జరుగుతున్న ప్రజా సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, యువజన సంఘాల నాయకులు స్పందించవలసిన అవసరం ఎంతైనా ఉంది.

జంపిన్‌తో ఫ్యామిలీ ప్యాక్ విభాగంలోకి రస్నా..

రూ.1,000 కోట్ల మార్కెట్‌ను లక్ష్యంగా కొత్త ఉత్పత్తి

ముంబై, జూలై 6, (ప్రజాకలం) :

ప్రపంచంలోనే అతిపెద్ద ఇన్‌స్టంట్ బెవరేజెస్ తయారీ సంస్థ రస్నా తన రెడీ-టు-డ్రింక్ (ఆణ) ఫ్రూట్ బెవరేజ్ పోర్ట్‌ఫోలియోను మరింత విస్తరిస్తూ జంపిన్ 1-లీటర్ ఫ్యామిలీ సైజ్ టెట్రా ప్యాక్ను దేశవ్యాప్తంగా మార్కెట్లోకి విడుదల చేసింది. భారతదేశంలో వేగంగా విస్తరిస్తున్న ప్రీమియం రెడీ-టు-డ్రింక్ (ఆణ) ఫ్రూట్ నెక్టర్ విభాగంలో సుమారు రూ. 1,000 కోట్ల మార్కెట్ అవకాశాన్ని లక్ష్యంగా చేసుకుని ఈ కొత్త ఉత్పత్తిని ప్రవేశపెట్టినట్లు సంస్థ తెలిపింది. అధిక ఫ్రూట్ కంటెంట్‌తో పాటు 10 విటమిన్లు, ఖనిజాలతో ఫోర్టిఫైడ్ చేసిన ఈ ఉత్పత్తి, ఇప్పటికే మార్కెట్లో విజయవంతంగా ఉన్న 125 మి.లీ. మరియు 200 మి.లీ. జంపిన్ శ్రేణికి కొనసాగింపుగా తీసుకువచ్చారు. కుటుంబ అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించిన ఈ 1-లీటర్ ప్యాక్ దేశవ్యాప్తంగా మోడ్రన్ రిటైల్ స్టోర్లు, ఈ-కామర్స్, క్విక్ కామర్స్ ప్లాట్‌ఫారమ్‌లు మరియు ఇతర రిటైల్ ఛానళ్లలో అందుబాటులో ఉంటుంది. కొత్త జంపిన్ 1-లీటర్ టెట్రా ప్యాక్ ధర రూ. 110గా నిర్ణయించారు. అలాగే 125 మి.లీ. సింగిల్-సర్వ్ ప్యాక్‌లు మ్యాంగో, లీచీ, ఆరెంజ్ ఫ్లేవర్లలో రూ. 10 ధరకు, 200 మి.లీ. టెట్రా ప్యాక్‌లు మ్యాంగో, మిక్స్‌డ్ ఫ్రూట్ ఫ్లేవర్లలో రూ. 20 ధరకు అందుబాటులో ఉన్నాయి. ఈ విధంగా కుటుంబ వినియోగంతో పాటు వ్యక్తిగత వినియోగదారులను కూడా దృష్టిలో ఉంచుకుని అన్ని ధరల శ్రేణుల్లో ఉత్పత్తులను అందిస్తోంది. ఈ ఉత్పత్తిని ప్రపంచ ప్రఖ్యాత ప్యాకేజింగ్ సంస్థ టెట్రా పాక్ తయారు చేసిన అత్యాధునిక కార్టన్లలో ప్యాక్ చేస్తున్నారు. ఈ ప్యాకేజింగ్ కూడా భారత్‌లోనే తయారవుతుండటంతో కేంద్ర ప్రభుత్వ 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమానికి ఇది మరింత బలాన్నిస్తుందని సంస్థ పేర్కొంది. ఈ సందర్భంగా రస్నా ప్రైవేట్ లిమిటెడ్ గ్రూప్ చైర్మన్ పిరుజ్ ఖంబట్టా మాట్లాడుతూ, "భారతీయ వినియోగదారులకు అంతర్జాతీయ ప్రమాణాల ఫ్రూట్ బెవరేజెస్‌ను సరసమైన ధరలో అందించడమే జంపిన్ లక్ష్యం. ఇందులో ఉపయోగించే పండ్లన్నీ భారత్‌లోనే సేకరించి, ప్రాసెస్ చేస్తున్నాం. టెట్రా ప్యాక్ ప్యాకేజింగ్ కూడా భారత్‌లోనే తయారవుతోంది. అత్యుత్తమ రుచి, సహజ ఫ్రూట్ గుడ్‌నెస్, అవసరమైన పోషకాలు అందించేలా ఈ ఉత్పత్తిని రూపొందించాం. ముఖ్యంగా పిల్లల అభిరుచిని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేకంగా రూపొందించిన ఆరెంజ్ ఫ్లేవర్ మా ఆవిష్కరణకు నిదర్శనం. ఈ ఉత్పత్తి ద్వారా భారతీయ రైతులు, ఫుడ్ ప్రాసెసింగ్ రంగం, తయారీ పరిశ్రమకు కూడా మద్దతు లభిస్తుంది" అని తెలిపారు. ఈ భాగస్వామ్యంపై టెట్రా పాక్ సౌత్ ఆసియా మేనేజింగ్ డైరెక్టర్ క్యాసియో సిమోయిస్ మాట్లాడుతూ, "భారతీయ వినియోగదారులు నాణ్యమైన, సురక్షితమైన, సౌకర్యవంతమైన పానీయాలను కోరుకుంటున్నారు. జంపిన్ 1-లీటర్ టెట్రా ప్యాక్ ఆ అవసరాలను తీర్చేలా రూపొందించబడింది. రస్నాతో కలిసి దేశవ్యాప్తంగా ఈ ఉత్పత్తిని అందించడం ఆనందంగా ఉంది. భారత్‌లో తయారైన ప్యాకేజింగ్ సొల్యూషన్స్ ద్వారా దేశీయ ఆహార, పానీయ పరిశ్రమ అభివృద్ధికి మేము తోడ్పడుతున్నాం" అని తెలిపారు. ఈ కొత్త శ్రేణిని ప్రధానంగా రెండు వర్గాల వినియోగదారులను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి చేశారు. పిల్లలకు పోషకాహారంతో కూడిన పానీయాలు అందించాలనుకునే తల్లిదండ్రులు, అలాగే విటమిన్‌లతో కూడిన హైడ్రేషన్ కోరుకునే పట్టణ ప్రాంత ఉద్యోగులను లక్ష్యంగా పెట్టుకున్నారు. లీచీ, మిక్స్‌డ్ ఫ్రూట్, ఆరెంజ్ ఫ్లేవర్లలో అందుబాటులో ఉన్న ఈ శ్రేణిలో విటమిన్ జతో పాటు 10 ముఖ్యమైన విటమిన్లు ఉన్నాయి. జంపిన్ బ్రాండ్‌కు ప్రత్యేక గుర్తింపుగా నిలిచిన ర్యాప్ ఆధారిత ప్రకటనలను కూడా రస్నా మళ్లీ తీసుకొస్తోంది. కొత్త ప్రచారంలో ఒక బాలుడు, ర్యాపర్‌తో కలిసి రూపొందించిన ఆధునిక కాన్సెప్ట్ ద్వారా యువత, కుటుంబాలతో మరింత అనుబంధాన్ని పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది.

కర్కపట్లలో సిరో ఫార్మా కంపెనీ ప్రారంభం..

తెలంగాణను లైఫ్ సైన్సెస్ క్యాపిటల్‌గా తీర్చిదిద్దుతాం: మంత్రులు

గజ్వేల్ నియోజకవర్గం: 06, జూలై (ప్రజా కలం ప్రతినిధి)

సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గం మర్కుక్ మండలం కర్కపట్ల గ్రామంలోని బయోటెక్ పార్క్‌లో ఏర్పాటు చేసిన సిరో ఫార్మా కంపెనీని రాష్ట్ర ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. అనంతరం కంపెనీ యూనిట్‌ను పరిశీలించి, నిర్వాహకులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ, ముఖ్యంగా హైదరాబాద్ ఇప్పటికే ఫార్మా రంగంలో ప్రపంచస్థాయి గుర్తింపు సాధించిందని,ఆ బ్రాండ్ ఇమేజ్‌ను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పారిశ్రామిక రంగానికి అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తున్నామని చెప్పారు.ప్రస్తుతం క్యాన్సర్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో నాణ్యమైన ఔషధాల తయారీకి ఫార్మా రంగం మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. బల్క్ డ్రగ్స్, ఫార్మా పరిశ్రమలను ఇప్పటి కంటే మరింత అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు.మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ ప్రపంచ ఫార్మా రంగంలో తెలంగాణ కీలక స్థానాన్ని సంపాదించిందన్నారు. క్యాన్సర్ చికిత్సకు అవసరమైన ఔషధాలను తక్కువ ధరలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ప్రభుత్వం పరిశ్రమలకు పూర్తి సహకారం అందిస్తోందని తెలిపారు.రాష్ట్రంలో పరిశ్రమలకు అనుకూలమైన పర్యావరణాన్ని మరింత బలోపేతం చేస్తూ, పెట్టుబడులను ఆకర్షించే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. భారతదేశంలో పారిశ్రామిక రంగంలో తెలంగాణను అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. తెలంగాణలో ప్రస్తుతం సుమారు 2,000 ఫార్మా కంపెనీలు పనిచేస్తుండగా,వాటిలో 260 కంపెనీలకు యూఎస్ఎఫ్‌డీఏ (ఖూఖీణూా) అనుమతులు ఉండటం రాష్ట్ర ఫార్మా రంగం సామర్థ్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. జహీరాబాద్‌ను నేషనల్ మాన్యుఫాక్చరింగ్ జోన్‌గా అభివృద్ధి చేసేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయని, ఫ్యూచర్ సిటీలో గ్రీన్ ఫార్మా క్లస్టర్ ఏర్పాటు దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు.పరిశ్రమల అభివృద్ధికి ప్రభుత్వం తీసుకొస్తున్న విధానాలను కొందరు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నప్పటికీ వెనక్కి తగ్గబోమని స్పష్టం చేశారు.రాబోయే రోజుల్లో తెలంగాణను ప్రపంచ లైఫ్ సైన్సెస్ క్యాపిటల్గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు.

సమస్యల సుడిగుండాలను తలపిస్తున్న బస్తీలు

కాటేదాన్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎస్ వెంకటేష్

రాజేంద్రనగర్ జులై 06,(ప్రజా కలం)

బస్తీబాట కార్యక్రమంలో అడుగడుగున సమస్యలతో బస్తీలు కొట్టుమిట్టాడుతున్నాయని, అధికారులు,ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సమస్యలు తీర్చాలని ప్రజలు పలు సమస్యల వినతులతో వెంకటేష్ గారిని అభ్యర్థించారు.. కాటేదాన్ డివిజన్ పరిధిలోని బాబు రెడ్డి నగర్ లో సమస్యల సుడిగుండంలో కాటేదాన్ డివిజన్ మునిగి తేలుతున్నది ఎక్కడ చూసినా నోరు తెరుచుకున్న మేనల్లు తవ్విన రోడ్లు మంచి నీటిపైప్లైన్ కి రంద్రాలు పడి మురికి నీరు కాస్త మంచినీటి పైప్ లైన్ లో కి వెళ్లి మంచినీళ్లు కాస్త కలుషితమై దుర్వాసనతో వస్తున్న నీరు తాగా లేక ఎవరు పట్టించుకునే నాధుడు లేక మా గోడు ఎవరికి చెప్పాలో తెలియక నతమతమవుతున్న కాలనీవాసులు బస్తీ బాట కార్యక్రమానికి వచ్చిన బి ఆర్ ఎస్ నాయకులతో అక్కడి కాలనీవాసులు వారు పడుతున్న గోసను తెలిపారు.ఈ సందర్భంగా కాటేదాన్ డివిజన్ అధ్యక్షులు ఎస్ వెంకటేష్ మాట్లాడుతూ కనీసం స్థానిక ప్రజా ప్రతినిధులు ప్రజాపాలన అని చెప్పు కుంటున్న ప్రభుత్వం అభివృద్ధి మా లక్ష్యం అని సంకలు గరేసుకుని తిరుగుతున్న నాయకులు ఎమ్మెల్యే గారి నివాసానికి కూతవేటు దూరంలో ఉన్న పలు కాలనీలలో ఎందుకు అభివృద్ధి జరుగుతా లేదో మరి అర్థమవుతలేదు పెద్ద పెద్ద పూలదండలు పెద్ద పెద్ద శాలువాలు రోడ్డు పొడవున స్వాగతం పలుకుతు భజనలు చేసే పెద్దలు నివసించే కాలనీలో మాత్రమే అభివృద్ధి చేస్తున్నారు కటిక పేదలు నివసించే కాటేదాన్ డివిజన్ లో గాని మైలార్ దేవ్ పల్లి డివిజన్లో గాని పెద్ద పెద్ద దండలు శాలువాలు రోడ్డు పొడవున స్వాగతం పలికే నాయకులు లేరన్న ఈ కాటేదాన్ మైలార్ దేవ్ పల్లి డివిజన్లపై చిన్న చూపు చూస్తూ ఉన్నారు కొన్ని రోజులు ఓపిక పట్టండి గెలిచేది కారే వచ్చేది కే సీ ఆర్ సరే. అప్పుడు అభివృద్ధి అంటే ఏందో మేము చూపించాము మళ్లీ మేమేచూపిస్తాము అని మండిపడ్డారు.ఈ కార్యక్రమంలో ఉప్పల్ శ్రీను సింహాద్రి ఆర్ కుమార్, ప్రకాష్ బొంబాయి రవి నవీన్ సూరి కార్తీక్ శ్రీను అశోక్ నాని మహేందర్ అఖిల్ రామస్వామి మోహన్ వెంకటరమణ అనిల్ సంతోష్ మురళి శేఖర్ కిరణ్ లక్ష్మణ్ వెంకటేష్ మరియు పెద్ద ఎత్తున బి ఆర్ఎస్ నాయకులు మహిళా నాయకురాలు కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రాల చెరువు పరిరక్షణకు శ్రీకారం

-మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

మహేశ్వరం, జులై 06, (ప్రజా కలం)

మహేశ్వరం నియోజకవర్గం, బడంగ్‌పేట్ సర్కిల్, మీర్‌పేట్ డివిజన్ పరిధిలోని మంత్రాల చెరువులో విస్తారంగా పేరుకుపోయిన గుర్రపు డెక్క (వాటర్ హైసింథ్) కారణంగా దుర్వాసన వెదజల్లుతూ స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, చెరువులో గుర్రపు డెక్క తొలగింపు కార్యక్రమానికి మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ, చెరువులో గుర్రపు డెక్కను పూర్తిగా తొలగించి, భవిష్యత్తులో మురికి నీరు చెరువులోకి చేరకుండా అధికారులు శాశ్వత చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చెరువుల పరిరక్షణ ప్రజారోగ్యానికి, పర్యావరణ పరిరక్షణకు ఎంతో కీలకమని ఆమె పేర్కొన్నారు.అలాగే ఆమె మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో కోట్ల రూపాయలతో అందంగా అభివృద్ధి చేసిన చెరువులు నేడు ప్రభుత్వ నిర్లక్ష్యంతో మురికికూపాలుగా మారుతున్నాయి. కేసీఆర్ పేరు చెరిపివేయాలనే ప్రయత్నాలు ఎంత చేసినా, ఆయన చేసిన అభివృద్ధిని ప్రజలు ఎప్పటికీ మరవరు. కేసీఆర్ గారు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారు అని అన్నారు.

ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, అర్కల భూపాల్ రెడ్డి, దీప్లాల్ చౌహాన్,అనిల్ యాదవ్, అర్కల కామేష్ రెడ్డి, దిండు భూపేష్ గౌడ్, రాజ్ కుమార్, మదారి రమేష్, శీను నాయక్, గోపి యాదవ్, ప్రభాకర్ రెడ్డి, అవినాష్ , వీర రాఘవరెడ్డి, సునీత బాలరాజ్, పంతంగి మాధవి, బిందు, నిర్మలారెడ్డి తదితరులు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

రైతులకు అండగా బి ఆర్ ఎస్ పార్టీ

మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

మహేశ్వరం, జులై 06,(ప్రజా కలం)

మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండలం సార్లరావుపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని పోతుబండ తండాలో, ఫోర్త్ సిటీ ప్రాజెక్టు కోసం భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని రైతులకు భరోసాగా బిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుంది అని మాజీ మంత్రి డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మహేశ్వరం శాసన సభ్యురాలు పి.సబితా ఇంద్రా రెడ్డి అన్నారు.ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ రైతులు నష్టపోకుండా రీ సర్వే చేసి రైతులను న్యాయం చేయాలని లేని పక్షంలో బీఆర్ఎస్ పార్టీ రైతుల పక్షాన నిలబడుతుందని అన్నారు, అభివృద్ధి పేరుతో రైతు భూమిని తీసుకుంటే, న్యాయమైన నష్టపరిహారం వెంటనే అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తదుపరి కార్యక్రమంలో మంగళ్లి గడ్డ తండా రైతులు ధర్నా కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ సర్పంచులు. ప్రవీణ్ నాయక్.గోవర్ధన్ నాయక్ .పార్టీ సీనియర్ నాయకులు లక్ష్మీ నరసింహ రెడ్డి. మన్నే జయేందర్ ముదిరాజ్. సురసాని సురేందర్ రెడ్డి. దేవరశెట్టి చంద్రశేఖర్. మేఘనాథ్ రెడ్డి. తాండ్ర ఇందిరా – దేవేందర్, కాకి ఇందిరా –దశరథ ముదిరాజ్ .దామోదర్ గౌడ్. ప్రకాష్ రెడ్డి. పొట్టి ఆనంద్. దేవీలాల్. బ్రాహ్మణపల్లి జ్యోతి – చంద్రశేఖర్. గుండాల సురేష్. పొన్నం అంజయ్య. బేగర్ కంచ సర్పంచ్ వెంకటేష్ నాయక్. ఉప సర్పంచ్ శివ ముదిరాజ్, కురుమిద్ద గ్రామం సర్పంచ్ నీలం శ్రీవిద్య శ్రీ రాములు ముదిరాజ్, తేరేటి రాజు ముదిరాజ్, కాకి రవీందర్ ముదిరాజ్ అరుణ్ మరియు స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల ఆశయాలను కొనసాగిస్తాం

ఎమ్మార్పీఎస్, పలు పార్టీల నాయకులు

మల్కాజిగిరి,జూలై06(ప్రజా కలం ప్రతినిధి)

మహనీయుల ఆశయాలను కొనసాగించేందుకు ప్రతి ఒక్కరం ముందుకు రావాలని ఎమ్మార్పీఎస్, పలు పార్టీల నాయకులు అన్నారు.సోమవారం బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా మల్కాజిగిరి చింతల్ బస్తీలోని మహనీయుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.అనంతరం మాట్లాడుతూ నేటి యువత మహనీయుల ఆశయాలను కొనసాగించేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఇన్చార్జి తిప్పారపు లక్ష్మణ్ మాదిగ, ఎమ్ ఎస్ పి జిల్లా అధ్యక్షులు రామచందర్ మాదిగ,ఎం జె ఎఫ్ నాయకులు మనోహర్, విహెచ్పిఎస్ జిల్లా అధ్యక్షులు వినయ్, మాదిగ సంక్షేమ సంఘం నాయకులు నర్సింగరావు, మాజీ కార్పొరేటర్లు వై ప్రేమ్ కుమార్,జగదీష్ గౌడ్, మురుగేష్, పలు పార్టీల నాయకులు వెంకటేష్ యాదవ్,బీకే శ్రీనివాస్, పిట్టల శ్రీనివాస్,జి డి సంపత్ గౌడ్,ప్రవీణ్ రాందాస్ సంతోష్,ఇస్తారి, పివి సత్యనారాయణ, సందీప్,జేడి చిరంజీవి, ఉపేందర్,ఎల్లేష్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,TS -503001 TELANGANA - 503001.
Editor: **KALAKONDA RAMAKRISHNA**, **PRGI.No. TELTEL/2010/33275,** Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com